అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సోమవారం 04-12-2023
8 పేజీలు + టాబ్లాయిడ్ 8 పేజీలు వెల : 6.50
సంపుటి : 9 సంచిక : 283
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

ప్రజల తీర్పునకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా..

- ఈ విజయం అమరవీరులకు అంకితం :టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి 8లో..




హస్తం హవాతో కారు గ్యారేజీకు వెళ్లింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓటమిని అంగీకరిస్తూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, ఫామ్ హౌజ్‌కు వెళ్లిపోయారు. కాంగ్రెస్ నేతలు గవర్నర్‌ను కలిసి, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎంపిక కోసం సోమవారం కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశం అవుతున్నది. ఆ రేసులో ప్రధానంగా పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్క ఉన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

హస్తగతం

తెలంగాణలో తొలిసారి అధికార పీఠంపై కాంగ్రెస్

- అపోహలు, అనుమానాలు పటాపంచలు
- రాహుల్ అండగా అసంతృప్తులు.. ఆందోళనలను అధిగమించి ఐక్యతారాగం
- క్యాడర్ నుంచి లీడర్ వరకూ ఇదే సూత్రం
- రేవంత్ ఎదురుదాడి వ్యూహం
- ఆరు గ్యారెంటీలతో సక్సెస్ మంత్రం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ లాంటి ఛరిష్మాగల బలమైన నాయకుడు అధికార పార్టీకి అధ్యక్షుడిగా ఉండటం.. పదేండ్ల నుంచి ప్రభుత్వానికి ఆయన రథసారథిగా ఉండటం, అభివృద్ధి, సంక్షేమం పథకాలతోపాటు ఆత్మగౌరవమనే నినాదంతో బీఆర్ఎస్ మూకుమ్మడి దాడి చేయటం, అన్నింటికీ మించి కేసీఆర్ వాగ్ధాటి.. హరీశ్ మంత్రాంగం.. కేటీఆర్ సమన్వయంతో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్‌ను ప్రతిపక్ష కాంగ్రెస్ ఢీ కొట్టగలదా..? ఇది ఎన్నికల ముందు వరకూ సగటు తెలంగాణ పౌరుడి మెదడులో మెదిలిన ప్రశ్న. కానీ ఇలాంటి ప్రశ్నలు, అపోహలు, అనుమానాలను పటాపంచలు చేస్తూ కాంగ్రెస్ కొద్ది కాలంలోనే రేసులోకి వచ్చింది. రాష్ట్రంలో రాహుల్ జోడో యాత్రతో మొదలైన ఈ రేసు... అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మరింత స్పీడందుకుంది. అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తదితరుల ప్రచారంతో 'వార్ వన్‌సైడ్' కాదని తేల్చి చెప్పింది. ఇప్పుడు గెలిచి చూపించింది.

రాష్ట్రంలో అంతర్గత కుమ్ములాటలు, బలహీనతలతో కకా వికలమైన కాంగ్రెస్... కర్నాటక ఫలితాలతో శరవేగంగా పుంజుకుంది. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న నేపథ్యంలో 'చావో రేవో' తేల్చుకోవాల్సిన పరిస్థితి ఇటు నేతల్లోనూ, అటు క్యాడర్‌లోనూ నెలకొంది. దీంతో 'కాంగ్రెసోళ్లను గెలిపిస్తే... వాళ్లు ఆ పార్టీలో ఉండరు.. వాళ్లకు వాళ్లే ఓడించుకుంటారు.. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి అభ్యర్థే...' అనే అవహేళనలను, అనుమానాలను తట్టుకుని, లీడర్లందరూ విబేధాలను తాత్కాలికంగా పక్కనబెట్టి... ఐక్యతా రాగాన్ని ఆలపించారు. ఇదే సమయంలో ఇక్కడి ...2లో

బీఆర్ఎస్ ఘోర పరాజయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో హస్తం హవా కొనసాగింది. 119 శాసనసభా స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లు సాధించి, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. మూడోసారి ముఖ్యమంత్రి నినాదంతో బరిలోకి దిగిన బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు తన ఓఎస్డీ ద్వారా రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు పంపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరారు. అయితే అంతకుముందే కేసీఆర్ ఫామ్ హౌజ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందే కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపిన డీజీపీ అంజనీకుమార్‌ను నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి రవిగుప్తాను డీజీపీగా నియమించారు. అంజన్‌కుమార్‌తో పాటు రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లిన సీఐడీ చీఫ్ మహేష్ భగవత్, ...2లో

నేడు సీఎల్పీ భేటీ

- ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు వేగంగా పావులు కదుపుతున్నది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇప్పటికే ఏఐసీసీ దూతలు పి. చిదంబరం, సుశీల్‌కుమార్ షిండే, సూర్జేవాలా హైదరాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యేలు సమావేశమై సీఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే కానుందని తెలిసింది. అనంతరం ప్రమాణస్వీకారం ఎప్పుడనే అంశంపై తుదినిర్ణయం తీసుకోనున్నారు. ప్రమాణస్వీకారం సందర్భంగా ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేయనున్నారు. ఈకార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ హాజరుకానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు తమ పార్టీని ఆహ్వానించాలంటూ రేవంత్ ఆధ్వర్యంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు లేఖ ఇచ్చారు. గవర్నర్ కలిసిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎమ్మెల్యే ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి తదితరులు ఉన్నారు. సోమవారం ఉదయం సీఎల్పీ నేత పేరును తమకు తెలియజేస్తామని గవర్నర్‌కు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాల్లో విజయం ...2లో

ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకుంటాం

తెలంగాణలో అధికారాన్ని కట్టబెట్టినందుకు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ కృతజ్ఞతలు. ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకుంటాం. దొరల (భూస్వాములు) కోసం పనిచేసిన వారిపై పోరాటం, సామాన్యుల కోసం కలిసి పనిచేయడమన్నది కాంగ్రెస్ ప్రధాన ప్రచారాంశం . అలాగే "మూడు రాష్ట్రాల్లో ప్రజలిచ్చిన తీర్పును హుందాగా స్వీకరిస్తాం. సైద్ధాంతిక పోరు మాత్రం కొనసాగుతుంది.

\- రాహుల్ గాంధీ

నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం..

- ప్రతిపక్ష పార్టీగా సమర్థంగా వ్యవహరిస్తాం..:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తామనీ, శాసన సభలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ...7లో

సీఎం కేసీఆర్ రాజీనామా

ఆమోదం తెలిపిన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ ఓటమి చవిచూసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ తన రాజీనామా లేఖను సీఎంవో కార్యాలయ సిబ్బందితో గవర్నర్‌కు పంపించారు. సీఎం రాజీనామాను ఆమోదించిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సూచించినట్టు సమచారం. కాగా ఏ ముఖ్యమంత్రి ఆయనా ఓటమి చవిచూసినప్పుడు ఆనవాయితాగా గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పిస్తారు. అయితే కేసీఆర్ మాత్రం గవర్నర్‌ను నేరుగా కలువకుండా సిబ్బందితో రాజానామా లేఖను పంపించడం చర్చనీయాంశంగా మారింది. కాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం.

కాంగ్రెస్ విజయాన్ని స్వాగతిస్తున్నాం

- అప్రజాస్వామిక, అవకాశవాద వైఖరిని తిరస్కరించిన ప్రజలు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయిందనీ, కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందనిసీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అప్రజాస్వామిక, అవకాశవాద వైఖరిని ప్రజలు నిర్ద్వందంగా తిరస్కరించడాన్ని ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యతిరేకతను వినియోగించుకుని కాంగ్రెస్ పార్టీ పూర్తి విజయం సాధించడాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ ఓట్లు, సీట్లు పెరగడం మతోన్మాద ప్రమాదం రాష్ట్రంలో తగ్గలేదని ఈ ఫలితాలు సూచిస్తున్నాయని వివరించారు. లౌకిక శక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని ...2లో

కొత్తగూడెంలో కూనంనేని జయభేరి

- 26,214 ఓట్ల మెజార్టీతో జలగంపై గెలుపు
- మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత కొనసాగింపు
- అహంకారపూరిత పాలనకు చరమగీతం: సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏకైక జనరల్ సీటు నియోజకవర్గమైన కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ఘన విజయం సాధించారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకటరావుపై 26,214 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అధికార పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఆదివారం పాల్వంచలోని అణుబాస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల ఓట్ల లెక్కింపు భారీ బందోబస్తు నడుమ జరిగింది. ఉదయం ...7లో

డీజీపీపై ఈసీ వేటు

- కోడ్ ఉల్లంఘించినందుకు సస్పెన్షన్
- ఇద్దరు అదనపు డీజీలకు నోటీసులు
- నూతన డీజీపీగా రవిగుప్తా నియామకం..ఉత్తర్వులు జారీ



అంజనీకుమార్ రవిగుప్తా

వివరాలు 7లో

ఆరుగురు మంత్రులు ఇంటికి

- తగ్గిన హరీశ్‌రావు మెజారిటీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బొల్తా పడి అధికార పార్టీకి నిరాశ ఎదురైంది. ప్రత్యర్థి కాంగ్రెస్‌కు గెలుపు దక్కింది. కాంగ్రెస్ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్నది. గత ...7లో

బీఆర్ఎస్ ఓటమికి కారణాలెన్నో..

- రివర్సయిన దళిత, బీసీ, మైనారిటీ బంధులు
- కొంపముంచిన 'సిట్టింగులు'
- ప్రభుత్వ వ్యతిరేకతను పసిగట్టలేని దళపతి 2లో..



సెంటిమెంట్‌ను తిరగ రాసిన పోచారం

నవతెలంగాణ - నిజామాబాద్ డెస్క్



గత ఆనవాయితీకి అడ్డుకట్ట వేస్తూ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నుంచి గెలిచారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్పీకర్ గా పనిచేసిన వారు వచ్చే ఎన్నికల్లో గెలవడం తెలుగు రాష్ట్రాల్లో కనిపించ లేదు. గతంలో స్పీకర్లుగా పనిచేసిన మధుసూదనా చారి, ...2లో

బీజేపీ ఎంపీలకు షాక్..

కాంగ్రెస్ ఎంపీలు విన్

- దుబ్బాకలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన మెదక్ ఎంపీ




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా నలుగురు గెలుపొందారు. ముగ్గురు ఓడిపోయారు. బీజేపీ నుంచి బరిలో దిగిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు గట్టి షాక్ తగిలింది. కరీంనగర్ అసెంబ్లీ ...2లో


ఓట్లు రాల్చని మృదు హిందూత్వ

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమికి ఇది కూడా ఒక ముఖ్య కారణం

వివరాలు 2లో..







అసెంబ్లీకి అతివలు..

- ఆరు నుంచి తొమ్మిదికి పెరిగిన మహిళా ఎమ్మెల్యేలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీలో ఈ సారి మహిళల సంఖ్య కాస్త పెరిగింది. గత ఎన్నికల్లో ఆరుగురు మహిళా అభ్యర్థులు విజయం ...7లో

లౌకిక శక్తులు రెట్టింపు కృషి చేయాలి

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : "ప్రజలు వారి తీర్పును ఇచ్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ ...2లో

అసెంబ్లీకీ 15 మంది డాక్టర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో హెూరాహెూరీగా జరిగిన ఎన్నికల్లో 15 మంది డాక్టర్లు విజయం సాధించారు. వీరిలో 11 మంది కాంగ్రెస్ నుంచి గెలుపొందగా, ...7లో

ఓట్లు రాల్చని మృదు హిందూత్వ

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమికి

ఇది కూడా ఒక ముఖ్య కారణం

న్యూఢిల్లీ : బిజెపి, ఆరెస్సెస్ అనుసరించే కరడుగట్టిన హిందూత్వను మృదు హిందూత్వతో ఎదుర్కోలేమని మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరోసారి స్పష్టం చేశాయి. మృదు హిందూత్వతో బిజెపిని ఎదుర్కోగలమన్న కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు. ఈ మూడు హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యలను విడిచిపెట్టి మృదు హిందూత్వను ఆశ్రయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నుంచి కూడా వీరికి ఆ విధమైన ప్రోత్సాహం లభించింది.



మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ తరచూ తన మృదువైన హిందూత్వాన్ని విడిచిపెట్టి, రాడికల్ హిందూయిజం న్యాయవాదిగా ఓటు వేయడానికి వచ్చారు. స్వయం ప్రకటిత దైవసంభూతుడు బాగేశ్వర్ బాబా తన సొంత నియోజకవర్గం చింద్వాడలో జరిగిన సంఘటన ఒబిసి వర్గాన్ని పెద్దగా కలవరపరిచింది. హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారి ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయాలని ప్రకటించిన వివాదాస్పద వ్యక్తి బాగేశ్వర్ బాబా. బాగేశ్వర్ బాబాతో కలిసి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని ఒబిసి వర్గానికి విరోధాన్ని సంపాదించుకోవద్దని స్థానిక కాంగ్రెస్ నేతలు చేసిన హెచ్చరికలను కమల్‌నాథ్ పట్టించుకోలేదు.

అయోధ్యలోని రామ మందిర భూమి పూజ కార్యక్రమానికి కమల్‌నాథ్ 11 వెండి ఇటుకలను పంపడం కూడా చర్చనీయాంశమైంది. . భూమి పూజ రోజున కమల్‌నాథ్ తన నివాసంలో 'శ్రీరామ్ దర్బార్' నిర్వహించి, జై శ్రీరామ్ అంటూ పెద్దయెత్తున నినాదాలిచ్చారు.. అయోధ్యలోని రామ మందిర ఘనతను ఎవరూ హైజాక్ చేయవద్దని, 1985లో రామమందిరాన్ని పూజల కోసం తెరిచింది రాజీవ్ గాంధీయేనని కమల్‌నాథ్ పేర్కొన్నారు.

దేశంలో 82 శాతం మంది హిందువులు నివసిస్తున్నారని, దాని గురించి వాదించాల్సిన అవసరం లేదని కమల్‌నాథ్ స్పందించారు. సనాతన ధర్మానికి ఆయన చేసిన కృషిని ఎవరూ ప్రశ్నించలేరని కూడా కమల్‌నాథ్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద హనుమాన్ విగ్రహం తన నియోజకవర్గంలో ఉండడమే ఇందుకు నిదర్శనమని కమల్‌నాథ్ సూచించారు.

ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బాఘెల్ బిజెపికి మించిన హిందూత్వ వాదినని చాటుకునే ప్రయత్నం చేశారు. రాముడి తల్లి కౌసల్యా దేవి పేరుతో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించడం, రామవనానికి వెళ్లే అటవీ మార్గాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, గోవుల రక్షణకు గోదాన్ న్యాయ యోజన వంటి పథకాలను ప్రకటించి ఓట్లు రాబట్టువచ్చని లెక్కలు వేశారు. అవన్నీ దూది పింజల్లా తేలిపోయాయి.

రాజస్థాన్‌లో సాధ్వి ఆనందీసరస్వతి వంటి బిజెపి నేతలు ఎన్నికలకు నెలల ముందు కాంగ్రెస్‌లో చేరారు. గోసంరక్షణకు రూ.3,000 కోట్ల పథకాలు ప్రకటించారు. మేనిఫెస్టోలో పేడ సేకరిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ పునరుద్ధరణకు నిధులు, అర్చకుల ప్రోత్సాహకాలను పెంచారు. ఇలాంటి ప్రకటనలు, మెజారిటీని సంతృప్తి పరచడానికి చేసిన వాగ్దానాలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

ఎన్నికల అవగాహన లేక రాజస్థాన్‌లో చేజారిన ఫలితం

రాష్ట్రంలో ప్రభావం చూపుతున్న పలు పార్టీలతో అవగాహన కుదుర్చుకుని పోటీ చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించలేదు. దీని ఫలితంగా ఆ పార్టీ చాలా స్థానాల్లో ఓటమి పాలైంది. యుపికి అనుబంధంగా ఉన్న భరత్‌పూర్ బెల్ట్‌లో ప్రభావం చూపుతున్న సిపిఎం, హనుమాన్ బేనివాల్ రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, ఆర్ఎల్‌డి వంటి పార్టీలతో అవగాహన కుదుర్చుకునేందుకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. ఈ పార్టీలతకు రాజస్థాన్‌లో దాదాపు పది శాతం ఓట్లు ఉన్నాయి. ఇండియా వేదిక స్ఫూర్తితో కాంగ్రెస్ ఇతర పార్టీలతో అవగాహన కుదుర్చుకోవడానికి ప్రయత్నించి ఉంటే, బహుశా రాజస్థాన్ చిత్రం మరోలా ఉండేది.

లౌకిక శక్తులు రెట్టింపు కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గెలుపొంది భారత రాష్ట్ర సమితి నుండి అధికారాన్ని కైవసం చేసుకుంది. ప్రజల జీవనోపాధులను, భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించేందుకు లౌకిక శక్తులు తమ కృషిని రెట్టింపు చేయాల్సిన అవసరం వుందని ఈ ఎన్నికల ఫలితాలు నొక్కి చెబుతున్నాయి." అన్ని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు.

సుపరిపాలనా రాజకీయాలవైపే ప్రజలు వున్నారు : ప్రధాని మోడీ



"సుపరిపాలనా రాజకీయాల వైపే ప్రజలు మొగ్గు చూపారని తాజా ఎన్నికలు స్పష్టం చేశాయి." అని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌ల్లో బిజెపి మంచి విజయాలను నమోదు చేసిన నేపథ్యంలో మోడీ మాట్లాడుతూ, "ప్రజలకు సుపరిపాలనను, అభివృద్ధిని అందించాలన్నది బిజెపి లక్ష్యం, దానికే ప్రజలు ఓటు వేశారు. తిరుగులేని మద్దతునందించిన ప్రజలకు కృతజ్ఞతలు. వారి సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తాం." అని చెప్పారు. పార్టీ అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలియచేశారు.

ప్రజలకు కృతజ్ఞతలు : ఖర్గే

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్‌ను తెలంగాణాలో అధికారంలోకి తెచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలియచేశారు. "చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు, ఈ మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పనితీరు నిరాశాజనకంగా వుందనడంలో సందేహం లేదు. అయితే, కృత నిశ్చయంతో, ఈ మూడు రాష్ట్రాల్లో పార్టీని తిరిగి పునర్నిర్మించడానికి, పునరుద్ధరించడానికి ధృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ స్ఫూర్తిదాయకమైన పోరాటాన్ని సాగించింది. లక్షలాదిమంది పార్టీ కార్యకర్తల కృషిని అభినందిస్తున్నా. తాత్కాలికంగా ఎదురైన ఎదురుదెబ్బలను అధిగమించి, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదిక భాగస్వామ్య పక్షాలతో కలిసి పోరాడేందుకు సిద్ధమవుతాం" అని పోస్టులో పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో 16 మంది మంత్రులు ఓటమి

సీఎం గెహ్లోట్ రాజీనామా



జైపూర్ : రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌తో సహా పోటీ చేసిన 25 మంది మంత్రుల్లో తొమ్మిది మంది గెలుపొందగా, 16 మంది ఓటమి చెందారు. అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ నేత సిపి జోషి నాథద్వారా నియోజకవర్గంలో ఓటమి చెందారు. పోటీ చేసిన ఏడుగురిలో ముగ్గురు బీజేపీ ఎంపీలు ఓడిపోయారు. ప్రతిపక్షనేత, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ పునియా అంబర్ నియోజకవర్గం నుంచి ఓటమి చెందారు.కాగా రాజస్థాన్ సీఎం అశోక్‌గెహ్లోట్ తన రాజీనామాను గవర్నర్‌కు అందజేశారు.మరోవైపు మధ్యప్రదేశ్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ఓటమి పాలయ్యారు.

6న ఇండియా కూటమి భేటీ

- లోక్‌సభ ఎన్నికల వ్యూహంపై చర్చ



న్యూఢిల్లీ : ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఈ నెల 6న ఢిల్లీలో సమావేశమవుతున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరుగుతుంది. వచ్చే సంవత్సరం జరిగే లోక్ సభ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో చర్చిస్తారు. ఎన్నికలకు ముందు బీజేపీని ఎలా ఎదుర్కోవాలనే విషయంపై చర్చించి కార్యాచరణను ఖరారు చేస్తారు. ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వివిధ రాష్ట్రాల్లో జరుపుతున్న ర్యాలీలను ప్రతిపక్ష కూటమి నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఎన్నికలు పూర్తవడంతో మళ్లీ ఈ ర్యాలీలను ప్రారంభిస్తారు. ప్రతిపక్ష కూటమిలోని 26 భాగస్వామ్య పక్షాలు ఇప్పటి వరకూ మూడు దఫాలుగా సమావేశమయ్యాయి. పాట్నా, బెంగళూరు, ముంబయిలో ఈ భేటీలో జరిగాయి.

కాంగ్రెస్ విజయాన్ని స్వాగతిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరిస్తున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) చివరి దశలో ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య హోరాహోరీగా సాగిన పోటీ, రూ.కోట్ల డబ్బు ప్రవాహం, చివరి నిమిషంలో ఒంటరిగా పోటీ చేయాల్సి రావడంతో పార్టీ ఓటింగ్ కొంత చెదిరినట్టు గమనించామని వివరించారు. ఏమైనా ఫలితాలను లోతుగా పరిశీలించి లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కొత్త ప్రభుత్వం పట్ల ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో సీపీఐ(ఎం) నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పార్టీకి ఓటేసిన ఓటర్లకు, అననుకూల పరిస్థితుల్లోనూ అహర్నిశలూ కృషి చేసిన పార్టీ శ్రేణులకు, సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ ఎంపీలకు షాక్..

(మొదటిపేజీ తరువాయి)

స్థానం నుంచి బండి సంజయ్ కుమార్ పోటీచేయగా ఆయన ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్ చేతిలో స్వల్ప ఓట్లతో పరాజితులయ్యారు. కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ పోటీచేశారు. అక్కడ తొలిసారి బరిలోకి దిగిన కల్వకుంట్ల సంజయ్ చేతిలో అర్వింద్ ఓట్లతో ఓడిపోయారు. ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు బోథ్ స్థానం నుంచి బరిలోకి దిగి బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. ఈ ముగ్గురూ గెలుస్తారని బీజేపీ అధిష్టానం గంపెడాశలు పెట్టుకోగా నిరాశే మిగిలింది. బీజేపీ ఎంపీలకు ఇలా జరగ్గా..కాంగ్రెస్ ఎంపీలు మాత్రం ఎమ్మెల్యేలుగా పోటీ చేసి విజయం సాధించారు. యాదాద్రి భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేశారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిపై వెంకటరెడ్డి ఘనవిజయం సాధించారు. నల్లగొండ ఎంపీగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగి సైదిరెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజిగిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి కొడంగల్, కామారెడ్డి నుంచి పోటీ చేశారు. కొడంగల్‌లో విజయం సాధించారు. కామారెడ్డిలో ఓడిపోయారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసి బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై ఘన విజయం సాధించారు.

సెంటిమెంట్‌ను తిరగ రాసిన పోచారం

(మొదటిపేజీ తరువాయి)

కిరణ్ కుమార్ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సురేష్ రెడ్డి , ప్రతిభా భారతి తదితరులు ఓడిపోయారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండోసారి భూపాల్‌పల్లిలో మధుసూధనాచారి ఓటమితో ఈ నమ్మకం మరింత బలపడింది... ఈ భయంతో అసెంబ్లీ స్పీకర్ పదవి అంటేనే ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడున్న పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ పోచారంను ఒప్పించి స్పీకర్ సీట్లో కూర్చోబెట్టారు. స్పీకర్ల ఓటమి ఆనవాయితి భయంతో ఒక దశలో పోచారం కూడా బాన్సువాడ స్థానం నుంచి తన బదులు కుమారుడిని బరిలో నిలపాలని అనుకున్నప్పటికి చివరికి పోచారాన్నే అభ్యర్థిగా ప్రకటించారు. కానీ స్పీకర్లు తిరిగి గెలవలేరనే సెంటిమెంట్‌కి స్వస్తిపలుకుతూ నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నుంచి ఆయన. వరుసగా ఐదోసారి ఘన విజయం సాధించారు.

దక్షిణాదిన బీజేపీకి నో ఎంట్రీ

- హిందీ ప్రాంతాలకే కాషాయపార్టీ పరిమితం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్రంలో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ దక్షిణాది రాష్ట్రాలు బీజేపీకి అందని ద్రాక్షలానే మారాయి. ఈ ఎన్నికల ఫలితాలతో కర్నాటక ప్రభుత్వం నుంచి వైదొలిగిన తరువాత, తెలంగాణతో బీజేపీ దక్షిణ భారతదేశంలోకి చొచ్చుకుపోతుందని ప్రధాని నరేంద్ర మోడీతో సహా బీజేపీ నేతలు వాదన. నిజానికి పది రాష్ట్రాల హిందీ పార్టీగా బీజేపీ మారిపోయింది. ఈ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్, హర్యానా, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఒడిశా, ఢిల్లీ ఉన్నాయి. పొరుగున ఉన్న పంజాబ్‌లో కూడా బీజేపీ ఉనికిలో లేదు.

అధికారానికి బీజేపీ దూరంగా...:బీహార్

ఆగస్ట్ 2022లో జేడీయూ నాయకుడు నితీశ్ కుమార్ మహాకూటమికి ముఖ్యమంత్రి అయ్యారు, బీజేపీని అధికారం నుంచి తొలగించారు. 243 మంది సభ్యులున్న సభలో మహాకూటమికి 160 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి 78 మంది ఉన్నారు.

ఒడిశా : బీజేపీకి ఇంకా ప్రభుత్వం ఇవ్వని రాష్ట్రం. బీజేడీ నేత నవీన్ పట్నాయక్ 24 ఏండ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. బీజేడీ పార్లమెంటులో బీజేపీకి సహాయం చేస్తోంది. అయితే రాష్ట్రంలో వారితో విభేదిస్తోంది. బీజేడీకి 112 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 23 మంది ఉన్నారు.

జార్ఖండ్ : 2019లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) నేతృత్వంలోని ఫ్రంట్ బీజేపీని అధికారం నుంచి దింపింది. 81 మంది సభ్యుల అసెంబ్లీలో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి 47 సీట్లు గెలుచుకుంది. బీజేపీకి 25 సీట్లు వచ్చాయి.

హిమాచల్ ప్రదేశ్ : గతేడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మొత్తం 68 స్థానాలకు గానూ కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 25 స్థానాలతో సరిపెట్టుకుంది.

ఢిల్లీ :2020 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ మరో ఘోర పరాజయం ఎదుర్కొంది. మొత్తం 70 స్థానాలకు గాను ఆప్ 62 స్థానాలను కైవసం చేసుకోగా, బీజేపీ ఆరుగురికి పడిపోయింది. ఈ ఏడాది జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ బీజేపీ కథ ముగిసింది.

బీఆర్ఎస్ ఓటమికి కారణాలెన్నో..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు...' అన్నట్టు ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమికి కారణాలు ఎన్నో. 'అంతా తానే' అనుకోవటం, అతి విశ్వాసం.. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను పట్టించుకోకపోవటం.. ప్రతిపక్షాలను తక్కువగా అంచనా వేయటం... వెరసి కారు బొక్క బోర్లా పడింది. పదేండ్ల అధికారం తర్వాత సహజంగా ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించటంలోను, గుర్తించినా జాగ్రత్త పడటంలోనూ ఆ పార్టీ పూర్తిగా విఫలమైంది. దాదాపు 40 మంది సిట్టింగులపై వ్యతిరేకత నెలకొన్నప్పటికీ, వారిని మారిస్తే అంతర్గత కుమ్ములాటలు, లేనిపోని తలనొప్పులు వస్తాయని భావించిన కేసీఆర్... ఆ పని చేయలేకపోయారు.

అన్ని పార్టీలకంటే ముందుగా 115 మంది అభ్యర్థులతో ఆగస్టు 21న తొలి జాబితాను ప్రకటించటం ద్వారా ప్రతిపక్షాలను డైలమాలో పడేయాలని ఆయన భావించారు. కానీ అది వర్కవుట్ కాలేదు. ఆగస్టు నుంచి నవంబరు వరకూ మధ్యలో అనేక చిత్ర విచిత్ర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. కీలక నేతలు కొందరు బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లోకి జంపవగా.. మరికొందరు కాంగ్రెస్, బీజేపీ లీడర్లు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. చివరి నిమిషంలో మహబూబ్‌నగర్ నుంచి రావుల చంద్రశేఖరరెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి, వరంగల్ నుంచి పొన్నాల లక్ష్మయ్య తదితరులను చేర్చుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

కేసీఆర్ ప్రతిష్టాత్మక పథకాల్లో ఒకటైన దళిత బంధు కూడా బీఆర్ఎస్‌కు ప్రతికూల ఫలితాన్నిచ్చింది. వాస్తవానికి ప్రస్తుత ఎన్నికల్లో ఆ అస్త్రాన్ని సంధించాలని కేసీఆర్ నిర్ణయించారు. కానీ మధ్యలో హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారటంతో వ్యూహాత్మకంగా అప్పుడే దాన్ని ప్రకటించారు. కానీ కొద్ది మందికి ఆ పథకం కింద ఆర్థికసాయం చేసి.. ఎక్కువ మందిలో వ్యతిరేకత కొనితెచ్చుకున్నారు. బీసీ, మైనారిటీ బంధులు కూడా ఇదే తరహాలో వ్యతిరేకతను తెచ్చిపెట్టాయి. అర్హుల్లో ఎక్కువ మందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు రాకపోవటం, కట్టిన వాటిని కూడా లబ్దిదారులకు పంపిణీ చేయకపోవటంతో ఆ పథకం గులాబీ పార్టీకి లబ్ది చేకూర్చకపోగా.. నష్టాన్ని మిగిల్చింది. 2014లో ప్రకటించిన దళితులకు మూడెకరాల భూ పంపిణీ అటకెక్కటంతో దానిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నిరుద్యోగులు గుస్సా...

తెలంగాణ వచ్చిన నాటి నుంచి ఆశించిన స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకపోవటం యువతలో ఆగ్రహాన్ని తెప్పించింది. టీఎస్‌పీఎస్సీ వేసిన నోటిఫికేషన్లు రద్దు కావటం, పరీక్షా పేపర్లు అనేకసార్లు లీకవటాన్ని నిరుద్యోగులు జీర్ణించుకోలేకపోయారు.

ఎమ్మెల్యేల వ్యవహారశైలి సైతం...

బీఆర్ఎస్ సిట్టింగు ఎమ్మెల్యేల్లో అనేక మంది వ్యవహారశైలిని ప్రజలు సహించలేకపోయారు. అవినీతి, అక్రమాలు, దందాలు వారిని ఇబ్బంది పెట్టాయి. అలాంటి బాధితులందరూ ఇప్పుడు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా తమ ప్రతాపాన్ని చూపారు. సీఎం హోదాలో కేసీఆర్ ప్రజాదర్బారును నిర్వహించకపోవటం, ప్రజలను, ప్రతిపక్షాలను, ఆఖరికి సొంత పార్టీ నేతలకు కూడా అందుబాటులో ఉండకపోవటం, కీలక నేతలకు సైతం అపాయింట్‌మెంటు ఇవ్వకపోవటం లాంటి అంశాలను ప్రజలు గమనించారని చెప్పొచ్చు. ఆయా విషయాలపై వారు తమ తీర్పును ఇప్పుడు స్పష్టీకరించారు. పార్టీలో కుటుంబ ఆధిపత్యం మితిమీరిందన్న అభిప్రాయం కూడా సర్వత్రా నెలకొనటం నష్టం చేసింది. దీంతో 'సారు' అంచనాలన్నీ తలకిందులై బీఆర్ఎస్ ఓటమి పాలైంది.

'కారు' ఫల్టీ కొట్టిన వేళ..
బోసిపోయిన తెలంగాణ భవన్...
ఒక్కరంటే ఒక్క నేతా కనపడని వైనం

'విజయానికి అందరూ బంధువులే.. అపజయమే అనాథ...' ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌ను చూసిన వారికి ఇదే కొటేషన్ గుర్తొచ్చింది. నిన్నటిదాకా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, ఇతర ప్రజా ప్రతినిధుల రాకపోకలతో కళకళలాడిన ఆ భవన్ పూర్తిగా బోసిపోయింది. ఒక్కరంటే ఒక్క నాయకుడూ అటువైపు రాకపోవటం గమనార్హం. మొన్నటిదాకా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితర అగ్రనేతలు వచ్చినప్పుడు పోలీసులు, బారికేడ్లు, మందీ మార్బలంతో హడావుడిగా, అంతకు మించిన హంగామాతో కనిపించే ఆ పరిసర ప్రాంతాల్లో నిశ్శబ్దం రాజ్యమేలింది. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు, వివిధ ఎన్నికల్లో గెలిచిన సందర్భాల్లో కార్యకర్తలు, లీడర్లు అక్కడ చేసే హంగామా అంతా ఇంతా కాదు. బాణాసంచా పేలుళ్లతో ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ దద్దరిల్లేవి. ముఖ్యంగా కేసీఆర్ అక్కడకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరేవి. దాదాపు అరగంట, గంట వరకూ ట్రాఫిక్ క్లియర్ అయ్యేది కాదు. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్ చుట్టూ అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. కార్లు లేవు.. పోలీసులు లేరు..ఎలాంటి హంగామా లేదు. కొద్ది మంది జర్నలిస్టులు తప్ప బీఆర్ఎస్ క్యాడర్ గానీ, లీడర్ గానీ అక్కడ కనపడకపోవటం గమనార్హం.



'హస్తగతం'

(మొదటిపేజీ తరువాయి)

పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చిన ఆ పార్టీ అధిష్టానం... ప్రతీ నిమిషం దిశా నిర్దేశం చేస్తూ నేతలు గాడి తప్పకుండా చూసుకోగలిగింది. దీనికితోడు రాహుల్, ఖర్గేల పర్యవేక్షణ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యూహరచన కాంగ్రెస్‌కు మరింత బలాన్నిచ్చింది.

ఢీ అంటే ఢీ...

మాటల మాంత్రికుడు సీఎం కేసీఆర్‌పై ఎదురుదాడి చేయటం ఏ నాయకుడికైనా అంత ఈజీ కాదు. కానీ ఒక విధంగా పీసీసీ చీఫ్ రేవంత్... ఆ లోటును భర్తీ చేశారనే చెప్పొచ్చు. ప్రస్తుత కాంగ్రెస్ విజయంలో ఆయన 'మాటల దాడి' పాత్ర ఎంతో ఉందని చెప్పక తప్పదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చేసిన విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తూ, సవాళ్లకు ప్రతి సవాళ్లు విసురుతూ రేవంత్ ఢీ అంటే ఢీ అనే రీతిలో వ్యవహరించారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌లో జోష్ నింపేందుకు, సీఎం దృష్టిని మరల్చేందుకు ఆయన కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్‌పై పోటీ చేశారు. తద్వారా యావత్ రాష్ట్రం దృష్టిని ఆకర్షించారు. బీఆర్ఎస్‌కు, బీజేపీకి పదుల సంఖ్యలో స్టార్ క్యాంపెయినర్లు ఉండగా... కాంగ్రెస్‌కు మాత్రం తానొక్కడే అయి... ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్న రేవంత్... హెలికాప్టర్‌లో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రచారాన్ని హోరెత్తించారు.

అన్నింటిలోనూ అదే జాగ్రత్త...

మరోవైపు టిక్కెట్ల కేటాయింపులోనూ కాంగ్రెస్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించింది. సీనియర్ నేతలు, సిట్టింగులు, ఆశావహుల పేర్లను అనేక దఫాలుగా వడబోసిన ఆ పార్టీ అధిష్టానం... ఆ తర్వాతే తుది జాబితాను ప్రకటించింది. టిక్కెట్ల కేటాయింపునకు సంబంధించి ఎక్కడా ఎలాంటి అసంతృప్తులకు తావు లేకుండా చూసుకోవటంలో ఆ పార్టీ సక్సెస్ అయింది. అసంతృప్తులు, రెబల్స్‌ను బుజ్జగించటంలోనూ, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూసుకోవటంలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించి, అందులో విజయం సాధించింది. బీఆర్ఎస్, బీజేపీల్లో సీనియర్లుగా ఉండి, అసంతృప్తితో రగిలిపోతున్న నేతలతో మంతనాలు జరిపి, వారిని తన వైపునకు తిప్పుకోవటంలో హస్తం పార్టీ సఫలీకృతమైంది.

'ఆరింటి'తో కొట్టి.. గెలుపుబాట పట్టి...

కన్నడనాట ఐదు గ్యారెంటీలతో ప్రజల నాడిని పట్టిన కాంగ్రెస్.. మన రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో ప్రజామోదం పొందింది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే వంటగ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, కౌలు రైతులు, భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ తదితర కాంగ్రెస్ వాగ్దానాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ యువతను ఆకర్షించింది. వెరసి ఇవన్నీ కాంగ్రెస్ గెలుపుబాటకు కారణమయ్యాయి.

గాంధీభవన్‌లో సంబురాలు

కాంగ్రెస్ విజయం సాధించడంతో గాంధీభవన్‌లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంబురాలు చేసుకున్నారు. పెద్ద ఎత్తున గాంధీభవన్‌కు చేరుకున్నారు. జై కాంగ్రెస్, జై జై కాంగ్రెస్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. బ్యాండ్‌మేళాలు, డీజేలు పెట్టి నృత్యాలు చేశారు. టాపాసులు పేల్చారు. స్వీట్లు పంచుకున్నారు. రాహుల్‌గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. రేవంత్ ముఖ్యమంత్రి అంటూ గాంధీభవన్ ఆవరణ మార్మోగింది. జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా రేవంత్ గాంధీభవన్‌కు చేరుకున్నారు. కార్యకర్తలతో ఆడిపాడి ఉత్సాహపరిచారు. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా గాంధీభవన్‌కు రావడంతో ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు నృత్యం చేసి ఉత్సహపరిచారు.

బీఆర్ఎస్ ఘోర పరాజయం

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ కుమార్‌లకు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కాంగ్రెస్‌లో కొత్త ముఖ్యమంత్రి రేసులో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్క పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఆదివారం రాత్రికి దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. 2018 శాసనసభ ఎన్నికల్లో కేవలం ఒకే స్థానంలో గెలుపొందిన బీజేపీ, ఆ తర్వాత జరిగిన హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించి మూడుస్థానాలకు చేరింది. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ 8 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. వీరిలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్ప మిగిలిన వారెవరూ గతంలో బీజేపీ నుంచి పోటీచేసిన వారు కాకపోవడం గమనార్హం. ఆ పార్టీ ముఖ్యనేతలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందనరావు వంటి వారు ఓటమి పాలయ్యారు. గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపొందారు. ఆదే సమయంలో కామారెడ్డిలో మూడోస్థానానికి పరిమితమయ్యారు. 2018 ఎన్నికలతో పోలిస్తే గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ మెజారిటీ దాదాపు 13వేలకు పైగా తగ్గింది. 2018 లో లక్షకు పైగా మెజారిటి సాధించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు, 80వేలకు పైగా మెజార్టీ సాధించిన మరో మంత్రి కే తారకరామారావులకు ఈసారి దాదాపు 30వేల మెజారిటీ మాత్రమే వచ్చింది. పలువురు మంత్రులూ ఓడిపోయారు. పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య నువ్వా...నేనా అన్నట్టు జరిగిన పోటీలో మధ్యస్థంగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు.

హుజూరాబాద్, గజ్వేల్ నుంచి పోటీచేసిన ఈటల రాజేందర్ రెండుచోట్లా ఓడిపోయారు. ఆయనపై బీజేపీ పెట్టుకున్న ఆశలు నెరవేరలేదు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు నుంచే కాంగ్రెస్ హవా కొనసాగింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. కామారెడ్డిలో మూడో స్థానంలో నిలిచారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత ఎంఐఎంపై కూడా పడింది. ఆపార్టీ ఏడు స్థానాల్లో గెలుపొందినా, నాలుగు స్థానాల్లో కాంగ్రెస్‌తో గట్టిపోటీ ఎదుర్కోవలసి వచ్చింది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని కొత్తగూడెం నుంచి పోటీచేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. ఓటమి భారంతో తెలంగాణ భవన్ బోసిపోయింది. బీఆర్ఎస్ నేతలు ఎవరూ ఆ ఛాయల్లో కనిపించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో సగం మందికి పైగా కాంగ్రెస్ గూటికి చేరతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆ వెంటనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించడం గమనార్హం.

నేడు సీఎల్పీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సాధించింది. తెలంగాణలో మొత్తం 119 స్థానాలు ఉండగా.. ప్రభుత్వం ఏర్పాటుకు 60 స్థానాలు అవసరం. ఇప్పటికే గెలుపొందిన ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హెూటల్‌కు చేరుకున్నారు. మరోవైపు పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను ఏఐసీసీ పరిశీలకులు సేకరించనున్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిశీలకులు అధిష్ఠానానికి పంపిన తర్వాత సీఎం అభ్యర్థి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇదిలా ఉండగా అభ్యర్థులు ఆగమేఘాల మీద హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇప్పటికే తాజ్‌కృష్ణ హోటల్‌లో 58 రూమ్స్ బుక్ చేసిన కాంగ్రెస్...ఆ తర్వాత గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌కు మార్చింది. మ్యాజిక్ ఫిగర్ వచ్చిన నేపథ్యంలో ప్రమాణస్వీకారం ఆలస్యం చేయడం ద్వారా ఎమ్మెల్యేలు చేజారిపోకుండా వెనువెంటనే ప్రమాణస్వీకా రం చేయాలని అధిష్టానం నిర్ణయం చేసింది. మరోవైపు క్యాంపు రాజకీయాలు అవసరం లేకుండా



చేయాలని భావిస్తున్నది. సీఎం ఎంపిక విషయంలో ఏఐసీసీ సూచన మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేయనున్నారు. రేవంత్ సీఎంగా ఉంటే బాగుంటుందని మెజార్టీ ఎమ్మెల్యేలు మద్దతు పలకనున్నారు.

బీఆర్ఎస్‌కు నిరుద్యోగుల వాత

ఎన్నికల్లో హామీ ఇచ్చినా అమలు కాని 'భృతి'

- ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం
- టీఎస్‌పీఎస్సీ తీరుపై అసంతృప్తి
- ప్రశ్నాపత్రాల లీకేజీతో ఇబ్బందులు
- కాంగ్రెస్‌వైపు మొగ్గిన యువత


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ పార్టీ మ్యానిఫెస్టోలోనూ ప్రకటించారు. ఎన్నికల్లో మామీ ఇచ్చినా ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో నిరుద్యోగుల్లో ఈ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే ఈ ఎన్నికల సందర్భంగానైనా నిరుద్యోగుల కోసం బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని ఆశించారు. కానీ అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలనే ప్రస్తావించలేదు. దీంతో బీఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మోసం చేసిందన్న అభిప్రాయానికి వచ్చారు. అదును కోసం ఎదురుచూసిన నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకున్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలిచి బీఆర్ఎస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్‌ను ఓడించాలంటూ ఓయూ జేఏసీ నేతలు, యువజన సంఘాలు గ్రామగ్రామాన తిరిగి ప్రచారం చేశాయి. జాగో తెలంగాణ పేరుతో నిరుద్యోగ చైతన్య బస్సుయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బు, మద్యానికి ఓటు వేస్తే తమ జీవితాలు ఆగమవుతున్నాయని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇది ప్రజలను ఆలోచింపచేసింది. అందుకే అటు నిరుద్యోగులు, ఇటు ఉద్యోగులు, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు సైతం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేశారు. అందుకే అధికార పార్టీ ఓటమిని చవిచూసింది.

కొలువులు రాక మానసిక వేదన

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదం పేరుతో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయని యువకులు ఆ ఉద్యమంల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎంతో మంది ఆత్మబలిదానాలు చేశారు. తెలంగాణ వచ్చినా బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయమే తెలంగాణలోనూ జరిగిందన్న అభిప్రాయానికి నిరుద్యోగులొచ్చారు. ఇంకోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వ్యవహరించిన తీరు నిరుద్యోగుల్లో ఆగ్రహానికి కారణంగా ఉన్నది. ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు రద్దు కావడం, వాయిదా పడడం వంటి కారణాలతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా మొదటిసారి, హైకోర్టు ఆదేశాలతో రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను కూడా టీఎస్‌పీఎస్సీ, ఎన్నికల కారణంగా డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేశాయి. దీంతో జీవితాలు నాశనమయ్యాయన్న అభిప్రాయానికి నిరుద్యోగులు బలంగా వచ్చారు. ఒకవైపు విలువైన సమయం, ఇంకోవైపు డబ్బు వృధా అయ్యాయన్న మానసిక ఆవేదనకు వచ్చారు. ఎన్నికల్లో నిరుద్యోగుల అంశం కీలకంగా పనిచేసింది. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. ఇంకోవైపు పరీక్షలు వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ప్రవళిక ఆత్మహత్య సంచలనమైంది. ప్రేమకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదంటూ మంత్రి కేటీఆర్ ప్రకటించి అభాసుపాలయ్యారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. అందుకే నిరుద్యోగులు ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపులో కీలక భూమిక పోషించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గం నుంచి పోటీచేసిన బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విషయం తెలిసిందే.ఆయనకు 44,646 ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలో బీఎస్‌పీ అభ్యర్థులకు మొత్తం 3,21,048(1.37 శాతం) ఓట్లు రావటం విశేషం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తన ప్రచారానికి ఎన్ని ఆటంకాలు సృష్టించినా..బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవటం వల్లనే ఆ మాత్రం ఓట్లు వచ్చాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.మరో పక్క డబ్బు, మద్యంతోపాటు ప్రభుత్వ యంత్రాంగం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కదిలికలపై కేంద్రీకరించి స్వేచ్ఛగా ప్రజలను కలవకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు.

ఎంపీలో కౌన్ బనేగా సీఎం..?

చౌహాన్ కాకపోతే, ముఖ్యమంత్రి ఎవరు?



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బీజేపీ పెద్ద పార్టీగా అవతరించింది. అయితే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్నది పెద్ద ప్రశ్న. ఈ ఎన్నికలలో శివరాజ్ సింగ్ చౌహాన్ పనిచేసిన తీరు. మహిళా సంక్షేమ విధానాలకు ఉన్న ప్రజాదరణ చూసి పార్టీ ఆయనను పక్కన పెడుతుందా? అనే దానిపై బిగ్ డిస్కర్షన్. కర్నాటకలో బసవరాజ్ బొమ్మైని సీఎం చేసి చేతులు కాల్చుకున్న బీజేపీ.. రాష్ట్రంలో అధికార వ్యతిరేకత లేకుండా చేసేందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎంగా చేయలేదు. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జరిగింది. ప్రజలు, ముఖ్యంగా మహిళలు, శివరాజ్ చౌహాన్ పథకాలకు ఎంతో ఆకర్షితులయ్యారు. వారు బీజేపీకి అధిక సంఖ్యలో ఓటేశారు.

అయితే సీఎంను సీఎం చేయని పార్టీ ఐదోసారి కూడా శివరాజ్ సింగ్ పేరును సీఎంగా ప్రతిపాదిస్తారా? మరి శివరాజ్ కాకపోతే పోటీదారు ఎవరు? శివరాజ్ సీఎం కాకపోతే ఎవరి పేరు పైకి వెళ్తోంది? శివరాజ్ సీఎం కాకపోతే పార్టీ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్ర సింగ్, కైలాష్ విజయవర్గీయ, వీడీ శర్మ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో బీజేపీలో అలాంటి సంప్రదాయం ఏర్పడి చివరి క్షణంలో ఆ పార్టీ సర్ ప్రైజ్‌లు ఇస్తోంది.

శివరాజ్‌కు పాపులారిటీ ఉన్నా సీఎం చైర్ డౌటే..!.

సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఉన్న పాపులారిటీని పరిశీలిస్తే.. పార్టీ ఆయనకు సీఎం పదవిని అందించేలా కనిపించడం లేదు. అయితే కేంద్ర నాయకత్వంతో ఆయన సంబంధాలు చెడిపోతే ఐదో సారి ఆయనకు సమస్యగా మారొచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల వరకు పార్టీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎంగా కొనసాగించే అవకాశమూ లేకపోలేదు. ఆ తర్వాత శివరాజ్ కేంద్ర రాజకీయాల్లో తన భవిష్యత్తుకు సిద్ధపడవచ్చు. శివరాజ్ వయస్సు అతని తోటి నాయకుల కంటే తక్కువ కాబట్టి, ఆయన దీని నుండి ప్రయోజనం పొందవచ్చు. ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో నడిచే బీజేపీ ముందస్తు నిర్ణయాలు తీసుకుంటుందని గుప్తా సంకేతాలిస్తోంది.

8 స్థానాల్లో బీజేపీ గెలుపు

- 68 నియోజకవర్గాల్లో డిపాజిట్ గల్లంతు
- ప్రభావం చూపని జనసేన..ఆదరించని సెటిలర్లు
- కూకట్‌పల్లిలో మినహా మిగతా చోట్ల 4వేల లోపే
- అన్నిచోట్లా డిపాజిట్ గల్లంతు
- గెలుస్తారనుకున్నోళ్ల ఓటమి..అంచనా లేనోళ్ల గెలుపు
- కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి గెలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రంలో 20కిపైగా సీట్లు వస్తాయనీ, తద్వారా కింగ్‌మేకర్ పాత్ర పోషించాలనే ఆశ ఆదిలోనే ఆవిరైంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఊహించిందేమీ జరగలేదు. బెంగాల్‌లో మమతాబెనర్జీపై సువేందు సర్కారును ప్రయోగించినట్టే ఇక్కడ సీఎం కేసీఆర్‌పై ఈటలను బీజేపీ ఎక్కుపెట్టింది. కానీ, అది బూమరాంగ్ అయింది. సీఎం కేసీఆర్ చేతిలో 45031 ఓట్ల భారీ తేడాతో ఈటల ఓటమి చవిచూశారు. తన సొంత నియోజకవర్గమైన హుజురాబాద్‌లో తగిన ప్రచారం చేసుకోకపోవడంతో ఆయన అక్కడా 16 వేల పైచిలుకు ఓట్లతో పరాజయం పాలయ్యారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి కృష్ణయాదవ్ ఓడిపోయారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో గట్టెక్కలేకపోయారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అధిష్టానం వద్ద పట్టుబట్టిమరీ తన అనుచరుడు పూసరాజుకు ముషీరాబాద్ సీటును ఇప్పించుకున్నాడు. కానీ, గెలిపించుకోలేకపోయాడు. అధిష్టానం విజయం సాధిస్తారని భావించిన నేతలంతా ఓడిపోయారు. ఊహించని నేతలు గెలిచారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను, టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డిలను వెనక్కి తోచి బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి సంచలన విజయం సాధించారు. బీజేపీ గెలిచిన ఎనిమిది స్థానాల్లో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే నాలుగున్నాయి. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టి రెండేండ్లుగా ఆ పార్టీ పనిచేసినప్పటికీ ఆ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదు. ఎస్సీ వర్గీకరణను చూపెట్టి మందకృష్ణ మాదిగతో విశ్వరూపసభ పెట్టించి దళితుల ఓట్లు పొందాలనే ఆశ నెరవేరలేదు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కమలం పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తామే ప్రత్యామ్నాయం అని ప్రచారం చేసిన ఆ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మలేదు. బీసీని సీఎం చేస్తామన్న మాటల్ని విశ్వసించలేదు. మొత్తం 68 స్థానాల్లో ఆ పార్టీ డిపాజిట్లను కోల్పోయింది. అమిత్‌షా 11 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా ఎక్కడ కూడా గెలవలేదు. మోడీ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో రెండు చోట్లనే (కామారెడ్డి, నిర్మల్)లో విజయం సాధించింది. యోగి ఆదిత్యనాథ్ 8 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. అందులో సిర్పూర్, గోషామహల్ స్థానాల్లోనే గెలిచింది. నడ్డా ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఆ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. కేంద్ర మంత్రులు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇతర రాష్ట్రాల నేతలు ప్రచారం చేసిన చోట ఆ పార్టీకి ఆశించిన ఓట్లు రాలలేదు. రాష్ట్రంలో మొత్తం 111 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 68 నియోజకవర్గాల్లో డిపాజిట్లను కోల్పోయింది. అయితే, బీజేపీ బలం గత ఎన్నికలతో పోలిస్తే పెరిగింది. 2018 ముందస్తు ఎన్నికల్లో 7.1 శాతం ఓట్లను పొందిన ఆ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో 13.90 శాతం ఓట్ల సాధించి మూడోస్థానంలో నిలిచింది. జనసేనతో పొత్తు పెట్టుకుని ఏపీ సెటిలర్ల ఓట్లు దక్కించుకోవాలనే ఎత్తుగడ పారలేదు. పైగా, జనసేనకు కేటాయించిన సీట్లలో ఎక్కడ కూడా డిపాజిట్ దక్కలేదు. ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే ఆ పార్టీ అభ్యర్థి అత్యధికంగా 39711 ఓట్లు సాధించారు. మిగతా ఏడు నియోజకవర్గాల్లో 4080 ఓట్లను మించలేదు.

4 రోజుల హైడ్రామాకు తెర

- డ్యామ్ పూర్తిగా కేంద్ర బలగాల ఆధీనంలోకి..
- సాగర్ డ్యాంపై భారీకేడ్లు, కంచె తొలగింపు
- కుడి కాల్వకు నీటి విడుదల బంద్
- డిసెంబర్ 6 వరకు కేంద్ర బలగాల ఆధీనంలోనే డ్యామ్



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్‌పై నాలుగు రోజుల హైడ్రామాకు తెరపడింది. డ్యాంను సీఆర్పీఎఫ్ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. డ్యాంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా వేసిన కంచెను, భారీకేడ్లను ఆదివారం ఉదయం తొలగించారు. ప్రాజెక్ట్ పర్యవేక్షణ బాధ్యతలను కృష్ణా బోర్డు, కేంద్ర బలగాలకు అప్పగించడం, దానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించిన నేపథ్యంలో డ్యామ్‌ను స్వాధీనం చేసుకున్నాయి. కుడి కాలువకు నీటి విడుదల కూడా బంద్ చేశారు. గురువారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో శుక్రవారం కేంద్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష లో నిర్వహించిన డ్యామ్ నిర్వహణను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగించేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించిన విషయం తెలిసిందే. సీఆర్పీఎఫ్ బలగాల రాకతో తెలంగాణ పోలీసులు శనివారమే డ్యామ్ నుంచి వెనుదిరిగారు. కానీ, ఏపీ పోలీసులు ఆదివారం ఉదయం వరకు డ్యామ్‌పై పహారా కాశారు. దీంతో ఆంధ్ర, తెలంగాణ వైపు నుంచి కేంద్ర బలగాలు డ్యామ్‌పైకి చేరుకొని ఆంధ్ర పోలీసులు వేసిన కంచెను, భారీకేడ్లను తీసివేయాల్సిందిగా కోరారు.

6వ తేదీ వరకు డ్యామ్ కేంద్ర బలగాల ఆధీనంలోనే ఉండనుంది. 6వ తేదీన సమావేశం వరకు డ్యామ్ వదిలి వెళ్లిపోవాలని తెలంగాణ వైపు అసిస్టెంట్ కమాండెంట్ షరీఫ్ అలీ, ఆంధ్ర వైపు అసిస్టెంట్ కమాండెంట్ కుల్దీప్‌కు సూచించారు. దీంతో ఆంధ్ర పోలీసులు డ్యామ్ వదిలి వెళ్లిపోయారు. శనివారం అర్ధరాత్రి నాగార్జునసాగర్ కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు. గతంలో సాగర్ డ్యామ్‌కు భద్రత కల్పించిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్స్ తెలంగాణ వైపు ఉన్న ఎర్త్ డ్యామ్, మెయిన్ గేట్ వరకే పరిమితం కానున్నారు. కేంద్ర బలగాలతో పాటు ఎన్ఎస్పీ ఎస్ఈ నాగేశ్వరావు, ఈఈ మల్లికార్జున, డిఈ శ్రీనివాస్, ఏఈ కృష్ణయ్య ఉన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థులకు పెరిగిన ప్రజాదరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులకు ప్రజాదరణ పెరిగింది. 200 స్థానాలకు 17 స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ చేయగా 0.96 శాతం ఓట్లు సాధించారు. రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానంలో ఉండగా, అందులో ఒక స్థానంలో స్వల్ప ఓట్ల (1,033) తేడాతో రెండో స్థానంలో నిలిచారు. భద్ర నియోజకవర్గం నుంచి బల్వాన్ పునియా 99,929 ఓట్లు (రెండో స్థానం, కేవలం 1,033 ఓట్ల తేడాతో ఓటమి), థాడ్ నియోజకవర్గం నుంచి పేమారామ్ 72,165 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. శ్యోపత్ రామ్ (రైసింగ్‌నగర్) 61,057 ఓట్లు, గిరిధరీలాల్ (దుంగార్గ్) 55,981 ఓట్లతో మూడోస్థానాల్లో నిలిచారు.

సీపీఐ(ఎం) అభ్యర్థులు సాధించిన ఓట్లు

1. బల్వాన్ పునియా (భద్ర) 99,929 ఓట్లు
2. పేమారామ్ (థాడ్) 72,165 ఓట్లు
3. శ్యోపత్ రామ్ (రైసింగ్‌నగర్) 61,057 ఓట్లు
4. గిరిధరీలాల్ (దుంగార్గ్) 55,981 ఓట్లు
5. మంగేజ్ చౌదరి (నోహర్) 24,601 ఓట్లు
6. అమ్రారామ్ (దంతరామ్ ఘడ్) 20,891 ఓట్లు
7. నిర్మల్ కుమార్ (తారానగర్) 6,755 ఓట్లు
8. శోభాసింగ్ (అనుప్ ఘడ్) 8,886 ఓట్లు
9. సునీల్ కుమార్ (సదుల్పూర్) 5,657 ఓట్లు
10. భగీరథ మాల్ (లద్నున్) 5,512 ఓట్లు
11. ప్రేమ్‌చంద్ పర్గీ (ఝూడోల్) 4,517 ఓట్లు
12. రఘువీర్ సింగ్ (హనుమన్‌ఘడ్) 2,828 ఓట్లు
13. గోటమ్‌లాల్ (దుంగార్‌పూర్) 2,318 ఓట్లు
14. ఛగన్‌లాల్ చౌదరి (సర్దార్‌షహర్) 1,942 ఓట్లు
15. ఉస్మాన్ గనీ (సికర్) 1,760 ఓట్లు
16. వీజేంద్ర థాకా (లచ్మాన్‌గఢ్) 1,202 ఓట్లు
17. కనరం (నవన్) 1,095 ఓట్లు

నోటాకు 1,71,885 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నన్ ఆఫ్ ది ఎబో (నోటా) కు 1,71,885 ఓట్లు పోలయ్యాయి. పోటీ చేసిన అభ్యర్థుల్లో తమకు ఎవరు నచ్చని సందర్భంలో నోటాకు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజక వర్గాల్లో అత్యధికంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 4,079 ఓట్లు నోటాకు పోల్ కాగా, అత్యల్పంగా ఆలేరు నియోజకవర్గంలో 73 ఓట్లు మాత్రమే పోల్ అయినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. 500 ఓట్ల లోపు అదిలాబాద్, హుస్నాబాద్‌లలో నోటాకు ఓట్లు పోల్ కాగా శేరిలింగంపల్లి, వర్ధన్నపేట, మేడ్చల్ నోయోజకవర్గాల్లో మూడు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. రెండు వేలకు పైగా ఉప్పల్, సిర్పూర్, పటాన్‌చెరు, పాలకుర్తి, నిజామాబాద్ రూరల్, అచ్చంపేట, ఆలంపూర్, బెల్లంపల్లి, బోథ్, ధర్మపురి, దుబ్బాక, ఖానాపూర్, కొండంగల్, కూకట్ పల్లి, ఎల్బీనగర్, మహేశ్వరం, మల్కాజిగిరి,మొత్తం 17 స్థానాల్లో నోటాకు రెండు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

వారసులు.. కుటుంబ సభ్యులు..

ఎన్నికల్లో గెలుపోటములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనున్నది. అయితే ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి (అన్నా, తమ్ముళ్లు, మామా అల్లుళు ,, భార్యా భర్తలు)పలువురు బరిలో నిలవగా కొందరు ఓటమి, మరికొందరిని గెలుపు వరించింది.

కోమటిరెడ్డి బ్రదర్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఘన విజయం సాధించారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ తరపున వీరు పోటీ చేశారు.మునుగోడులో రాజగోపాల్ రెడ్డి 21వేల మెజార్టీతో గెలుపొందగా, ఆయన అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండలో 54వేలకు పైగా మెజార్టీతో భారీ విజయాన్ని అందుకున్నారు.

గడ్డం సోదరులు..

గడ్డం వినోద్, గడ్డం వివేక్ విజయం సాధించారు. వినోద్ బెల్లంపల్లి నియోజక వర్గం నుంచి ఆయన సోదరుడు వివేక్ చెన్నూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఇద్దరూ విజయం సాధించటం గమనార్హం.

భార్యాభర్తలు..

ఎన్నికల్లో భార్యభర్తలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పద్మావతి రెడ్డి భారీ విజయాన్ని అందుకున్నారు. హుజూర్‌నగర్‌నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పోటీలో నిలిచిన ఆయన భార్య పద్మావతిరెడ్డి ఘన విజయం సాధించారు.

మామా అల్లుళ్లు..

మేడ్చల్ నియోజక వర్గం నుంచి మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరిలో ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు.

కేసీఆర్..కేటీఆర్..

తండ్రికొడుకులు సీఎం కేసీఆర్, కేటీఆర్ పోటీలో ఈ సారి కూడా ఉన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేయగా కామారెడ్డిలో ఓటమి చవిచూశారు. గజ్వేల్‌లో గెలుపొందారు. కుమారుడు కేటీఆర్ సిరిసిల్లలో బరిలో దిగారు. భారీ మెజారిటీతో గెలుపొందారు.

మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ తరపున బరిలోకి దిగారు.

మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన రోహిత్ గెలుపొందగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన మైనంపల్లి హనుమంతరావు ఓటమి పాలయ్యారు.

ఓడిన బంధువులు..

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్ బీజేపీ తరపున పోటీలో నిలిచారు. ఆయన సోదరుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచారు. ఇద్దరూ ఓటమి పాలయ్యారు.

అత్త..అల్లుడు..

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున బాల్కొండ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో ఉండగా..ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ బీజేపీ తరపున బరిలో నిలిచారు. చివరకు వేముల ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించారు.

మౌనమోడీ

- సమస్యలపై స్పందన లేదు : బీజేపీ ప్రభుత్వంపై విద్యావేత్తలు, పౌర సమాజ సంఘాల ఆగ్రహం
- పెరుగుతున్న అవినీతి, అసమానతలు
- కనుమరుగవుతున్న ప్రజాస్వామ్యం





న్యూఢిల్లీ : అసమానతలు, ప్రజాస్వామ్యంపై దాడి వంటి సమస్యలను పరిష్కరించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ స్పందన నత్తనడకను తలపిస్తోందని పలువురు విద్యావేత్తలతో పాటు, పలు పౌర సమాజ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సంఘాలు, విద్యావేత్తల బృందం 'వాదా నా తోడో అభియాన్' శీర్షికతో మోడీ ప్రభుత్వ పనితీరుపై నివేదికను రూపొందించింది. '2019-2023 హామీలు..వాస్తవాలు : ఎన్డీఏ-2 ప్రభుత్వ పాలనపై పౌర సమీక్ష' పేరిట రూపొందించిన ఈ నివేదిక తాను లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వ స్పందనను కోరింది.

దేశంలో ప్రజాస్వామ్యం తీరుతెన్నులను ఈ నివేదిక ప్రస్తావిస్తూ 'ఎలాంటి చర్చ జరపకుండానే బిల్లులను ఆమోదిస్తున్నారు. పార్లమెంటరీ కమిటీలను ఏర్పాటు చేసిన సందర్భాలు చాలా తక్కువ. పార్లమెంట్ సమావేశాలు జరిగే రోజులను కుదిస్తున్నారు. బడ్జెట్‌పై చర్చలు పరిమితంగా ఉంటున్నాయి. పార్లమెంట్ సభ్యులకు కూడా సమాచారం అందకుండా చేస్తున్నారు. క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తులు చట్టసభలకు ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. ఇవన్నీ ఆందోళన కలిగించే విషయాలు. మీడియా తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతోంది. ఎందుకంటే వ్యాపార ప్రయోజనాలు కలిగిన వారు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం పెరుగుతోంది. దేశంలో మతతత్వం పెచ్చరిల్లుతోంది. విమర్శకులకు తావు లేకుండా పోతోంది. పాత్రికేయులు, మీడియా సంస్థలపై దాడులు పెరుగుతున్నాయి. విద్యార్థులు, హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు, పాత్రికేయులు, కళాకారులు, కమెడియన్లు, నిజ నిర్ధారణ బృందాలు, ప్రచురణకర్తలు, అనేకమంది ప్రజలపై క్రూరమైన చట్టాలను ప్రయోగించి వారు తమ భావ ప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకోకుండా అడ్డుకుంటున్నారు' అని వివరించింది.

దేశం జీడీపీ వృద్ధిని సాధిస్తున్నప్పటికీ అసమానతలు అధికంగా ఉన్నాయని నివేదిక ఎత్తిచూపింది. దేశ ఆదాయంలో 22% కేవలం ఒక శాతం మంది చేతిలోనే ఉన్నదని, 57% ఆదాయం మొదటి పది స్థానాల్లో ఉన్న వారి సొంతం అయిందని తెలిపింది. ఈ పరిణామం అసమానతలకు దారి తీస్తోందని చెప్పింది. '2014-15 నుండి 2021-22 మధ్యకాలంలో పురుష వ్యవసాయ కార్మికుల వాస్తవ వేతనాలు కేవలం ఒక శాతం మాత్రమే పెరిగాయి. 2017-22 మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న 53 వేల మంది ఆత్మహత్య చేసుకున్నారు. నివాస గృహాలు, నీరు, పారిశుధ్యం, ఆరోగ్య సేవలు, విద్య, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత వంటివి లేకపోవడంతో పట్టణ ప్రాంతాల్లో పేదరికం పెరుగుతోంది. అక్కడ 30%కి పైగా ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు' అని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

పరిపాలనలో పారదర్శకత లేకపోవడంపై నివేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు కేంద్రమే కారణమని ఆరోపించింది.

సూర్య వనాలను సృష్టించిన 'కవిరాజు'

'నిన్న నేను సూర్యుణ్ని చూశాను/ నీలి మైదానంలో ఆడుకొంటూకాదు/ హరిత శాద్వలాలు ఆరబోస్తూ కాదు/ మబ్బు పడవలకు తెరచాపలెత్తుతూ కాదు... గడ్డు బ్రతుకులు మోసే కండలమీది స్వేద ముత్యంలోంచి/ నిన్న నేను సూర్యుణ్ని చూచాను' (సూర్యధ్వజం, 1989).

ఈ కవిత రాసింది ఎవరో కాదు, 'కవి రాజు'. అసలు పేరు పెన్మత్స సత్యనారాయణ రాజు. 'కవిరాజు' బిరుదం వారికి ఆప్యాయంగా ఒసగింది. కవిరాజు పదఅల్లికల్లోని అల్లసాని జిగిబిలకు, ప్రకృతి, భావుకతల సంగమానికి ముగ్ధుడై, రాజుగారి 'సూర్య కఠారి' (1994) కవితా సంపుటికి ముందు మాట కూడా రాశారు శేషేంద్రశర్మ. రాయటమే కాదు, సౌమ్యుడైన రాజు 'సూర్య కఠారి'లో మార్క్సిజంను దర్శించాడు శేషేంద్రశర్మ. అంతేగాదు, సమాజంలోని 'హింస'ను ప్రతిఘటించేందుకు మార్క్స్ 'ప్రతిహింస' అనివార్యం అన్నాడే కానీ, 'మార్క్స్' సౌమ్యుడని, అహింసావాది అని ప్రతిపాదించాడు శేషేంద్ర. సమాజ చలనగతుల్లో, పదార్థ గతితార్కికవాద రీతులలో ఇది 'అనివార్య పరిణామం' అని గూడా శేషేంద్ర వివరించాడు. వీరి కవితల్లో వాకాటిగారు రవీంద్రుడిని, దేవులపల్లి కృష్ణ శాస్త్రిని దర్శిస్తే, వాడ్రేవు చిన వీరభద్రుడు శ్రీశ్రీ 'సర్రియలిజం' దర్శించారు. ఆ 'సర్రియలిజం'లో రెండు మార్గాలున్నాయని, ఒకటి 'లక్ష్యం కల సర్రియలిజం' అని, రెండవది 'లక్ష్యం లేని సర్రియలిజం' అని వివరిస్తూ, శ్రీశ్రీ లాగానే 'కవిరాజు' రెండు పద్ధతులను పాటించాడని వివరించారు వాడ్రేవు చిన వీరభద్రుడు. ఇలా బహుముఖీయమై, బహుకోణాల్లో అభివ్యక్తమయ్యేదే కవిరాజు కవితా ఝరి.

కవి రాజు 'సూర్య' శబ్దానికి తన కవితలలో విస్తారమైన నిర్వచనం కలిపించారు. వారు వెలువరించిన కవితా సంపుటాలలో 'సూర్య రథం' (1983), సూర్య ధ్వజం (1989), సూర్య కఠారి (1994), సూర్యాంశువులు (1996), సూర్య పుత్రి (2009), సూర్యోదయం (2011), సూర్య పర్వాలు (2013) వరకూ ఏడు సంపుటాలు ఒక్కొటి సూర్యుడు పూంచిన ఒక్కో రథంగా భావించవచ్చు. వీటిని సూర్యుడి ఏడు వర్ణాలుగా కూడా అనుకోవచ్చు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'కీర్తి పురస్కారం' అందుకొన్న 'కవిరాజు'కు పలు సాంస్కృతిక సాహిత్య సంస్థలు పలు బిరుదులు ఇచ్చాయి.



అనువాదశ్రీ రంగయ్య గారు హిందీలోకి వీరి 'సూర్య పుత్రి' (2009)ని, 'సూర్య కఠారి' (1994)ని, సూర్యోదయం (2011) ని అనువదించారు 2013 లో. వీరి 'సూర్య కఠారి' (1994) కవితా సంపుటిని వదలి మందేశ్వరరావు ఆంగ్లంలో అనువాదం చేశారు.

కవిరాజు మే 8, 1944 లో కాకరపర్రు గ్రామం (తణుకు)లో జన్మించారు. ప్రీ యూనివర్సిటీ కంటే ఎక్కువ చదువుకోను వీలు కాని కుటుంబ పరిస్థితుల్లో, పొట్టపట్టుకొని హైదరాబాద్ చేరారు ఉద్యోగం వేటలో. తొలుత బయోలాజికల్ ఇవాన్స్‌లో ఉద్యోగ జీవితం ఆరంభించిన రాజు, 1964 లో అప్పుడే కొత్తగా పెట్టిన సింథటిక్ డ్రగ్స్ ప్లాంట్‌లో (దీన్నే తరువాత కాలంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ గా మార్చారు) చేరారు. దాదాపు 36 ఏళ్ళు అక్కడే పనిచేసి ఆయన హృది పలికించిన కవితా ఝురికి 2000 లలో రిటైర్ అయ్యారు. ఆయన చదివిన చదువుకు, చేసిన ఉద్యోగానికీ ఎంతమాత్రం సంబంధం లేదు.


అయినా ఆయన పలికిన భావ, రసవిస్ఫోటాలు అనితర సాధ్యం. 'కొంపలు తగలబెడుతోంది/ కుటిల రాక్షస రూపం/ అంతం చేయి దాని ప్రతాపం/ ఇదిగో దీపం/ ఇది భావాగ్ని చాపం' అంటారు కవిరాజు 'సూర్య కఠారి' లో. 'ఆయన కవితా ప్రయాణంలో 'బింబాల జల్లులు' పడతాయి. 'ప్రతీకల గాలులు' వీస్తుంటాయి' - అంటారు వాకాటి పాండురంగా రావుగారు. ఇంకో చోటు'నా నెత్తురునే తాగుతూ దప్పిక తీరక తపించి పోతున్నాను/ ఏ ఉదయకిరణం అంచు మీదగానో ఒక అమృతబిందువు నా గొంతులోకి జార్చు' అని అంటారు (సూర్య కఠారిలో).

వారి కవితా వాక్యాలు ఎవరినో సంబోధిస్తున్నట్లు ఉంటాయి. ఆ ఎవరన్నది పాఠకుడి జన్మ ససంస్కారాన్ని బట్టి బహిర్గత మవుతుంది. ఒక్కోసారి ఆత్మాశయమ్ అయినట్లు ద్యోతకమవుతుంది. కానీ, రూఢిగా ఇది 'ఆత్మాశ్రయం' అని చెప్పలేము. ఎందుకంటే అక్కడో మెలిక వేస్తారు. ఆ మెలికలో ఒక అభ్యుదయ వాదం, ఓ ఆశావాదం, ఒక ప్రకతి చైతన్యం, ఒక జీవన సత్యం తొంగిచూస్తుంది.

వాక్యాలలో పదాల పొదుగు రవీంద్రుడి 'గీతాంజలి' గేయాల్లా మదువుగా సాగిపోతాయి. అలలులేని నిశ్చల నదీ ప్రవాహంపై మృదువుగా సాగే పడవ ప్రయాణంలాగ ఉంటుంది. అలాంటి వాక్యాలు అలవోకగా వారి నుంచి జాలు వారుతాయి. ఆ విధమైన వాక్య నిర్మాణం కవిరాజు గారి 'సంతకం' లా, వారికే ప్రత్యేకమైన డి.ఎన్.ఏ గా మరొకరికి అసాధ్యంగా ఉంటుంది. ఠాగోర్ బెంగాలీ 'గీతాంజలి'లోని గీతాలను తెలుగులోకి అనువదించిన బెల్లంకొండ రామదాసు అనువాదాలలోని పదభంగిమలను గమనిస్తే, వాటికంటే సహజమై భావోన్నతమై ఒప్పారుతాయి. ఈ రసోస్ఫోటనలు. 'జన్మనిచ్చి అమ్మ నన్ను సూర్యుడికి ఒప్పగించి పోయింది/ ఆలనా పాలన చూస్తుండమని' అని సూర్యుడిని తన తండ్రిగా భావించిన కర్షుడు 'కవిరాజు'. ఇక ఠాగోర్ ఈ భావశకలాన్ని ఇలా పలికాడు. 'నీవు నన్ను అంతగా సృష్టించావు/ అది నీ విలాసం/ తాకితే చాలు పగిలిపోయే యీ పాత్రికను (గీతాంజలి 1, మొదటి పంక్తి).

> నిజానికి కవి రాజు గారి కవితలు 'గీతాంజలి'కి ఎందునా తీసిపోవు. కానీ, తెలుగు వారికి ఠాగోర్‌కి వున్న ప్రచార ప్రజ్ఞ లేదు. ఠాగోర్‌కు 'బెంగాలీ 'గీతాంజలి'ని ఆంగ్లంలో అనువదించే ఒక 'ఐరిష్' దేశస్థుడు, యువకుడు అయిన డబ్ల్యూ.బి.యేట్స్ దొరికాడు.

ఇలా సూక్ష్మంగా తులనాత్మక పరిశీలన చేస్తే ఠాగోర్ భావశకాలాలు, కవిరాజు రసోస్ఫోటనాలు సమాంతరంగానే సాగినట్టు సులువుగా తెలుస్తుంది.



> వారి కవితా వాక్యాలు ఎవరినో సంబోధిస్తున్నట్లు ఉంటాయి. ఆ ఎవరన్నది పాఠకుడి జన్మ ససంస్కారాన్ని బట్టి బహిర్గత మవుతుంది. ఒక్కోసారి ఆత్మాశ్రయమ్ అయినట్లు ద్యోతకమవుతుంది.

కవిరాజు తన కవితాలోకంలో ఎవ్వరూ గమనించనిదాన్ని ఇట్టే పట్టేశాడు. మన దేవుళ్ళు, మతం ఎదో కోల్పోయి వెతుక్కొంటూ అని. ఏమిటది? 'కొల్లలుగా దేవుళ్ళని కానీ వీధి కొక్కరుగా విసిరిపోయిన ఆ ఋషులకేం తెలుసు?/ అమృతం ప్రవహించవలసిన గడ్డ మీద నెత్తుటేరులు పారుతున్నాయని ప్రకృతిని విస్మరించిన మనిషి/ వికృత రూపమెత్తి శిలలతో శివాలుతొక్కుతున్నాడని' (సూర్య పర్వాలు 2013) అర్థమయిందా? దేవుళ్ళ కోసం మనుషులు కొట్టుకోకుండా చూసే ధర్మాన్ని మన దేవుళ్ళు, మతం కోల్పోయినై! అని. ఎంత సున్నితంగా చెప్పారు దేవుళ్ళు, మతాలూ ఎలా దిగజారిపోయాయోనన్న విషయం

'నిన్ను నేను తలచుకొన్నాను, నన్ను నీలా మార్చుకొన్నానుఅన్న 'థీమ్' తో రాసిన పద్యాలు 'నందనందనం' లో కనిపిస్తాయి (2016). ఠాగోర్ 'గీతాంజలి' లో ఎక్కువగా ఈ ఛాయలున్న గేయాలు కనిపిస్తాయి. ఠాగోర్ ప్రకృతి కవే గాదు, కృషి వలుల స్వేదంలో కూడా 'ఈశ్వరుడిని' దర్శించిన విశ్వమానవుడు. అదే రీతిలో సాగుతాయి 'నందనందనం' (2016) కవితాసంపుటిలోని కవితలు. 'విహారం పేరుతో వనమంతా కలియతిరిగి చక్కా వచ్చి/ ఈ గట్టుమీద విలాసంగా పాడుకొంటూ కూర్చొన్నావా నాన్నా!/ నిన్ను అనుసరిస్తూ వచ్చి భ్రమరాలు/, నీ చుట్టూ ముసురుకొని తిరిగి అటు చూడటం లేదని వనాలు బెంగ పెట్టుకున్నాయి తెలుసా-/ ఎక్కడ వక్షసంపద నిర్వీర్యం అయిపోతుందోనని/.

కవిరాజు కడపటి సంవత్సరంలో రెండు సంపుటాలను వెలువరించారు . ఒకటి 'కలహారం' (2022), రెండవది 'నీ రూపం' (2022). కలహారం వచ్చిన కలలలోని కవితలు. ఇటువంటి కవితానుభవం గతంలో ఏ కవులకు వచ్చినట్టు దాఖలాలు లేవు. కానీ, 'సూర్య కఠారి' సంపుటికి ముందు నుంచే కవిరాజు తన కవితలను తొలుత కలలలో గాంచి, వాటిని మెలుకువ వచ్చాక గ్రంథస్తం చేసేవాడినని చెబుతుండేవారు. ఎందరో గొప్ప గొప్ప విమర్శకులు కవిరాజు కవితాలపై వ్యాఖ్యానించినా ఎవ్వరూ ఈ విషయం పై దృష్టి సారించలేదు. అందుకేనేమో కవిరాజు ఈ నేపథ్యం ఉన్న కవితా సంపుటాలనే వెలుగులోకి తెచ్చారు. నిజానికి కలలో వచ్చినవైనా పుస్తకం రూపంలో చూసినప్పుడు చదువరులకు వీటిలో విషయమేమి వింతగా కనిపించదు. కానీ, ఇవి కొంత తాత్వికతతో, కొన్ని అభ్యుదయ వాదంతో ఉండటంతో పాఠకుడు తిరిగి తొలుత చెప్పినట్టే 'ఆత్మాశయవాదం' కిదకు వస్తాయా, రావో తేల్చుకోలేని డోలాయమానంలో పడతాడు. భావశకలాలో గాని, రసోస్ఫోటనంలో గాని 'సూర్య కఠారి' కవితలకు, వీటికి మధ్య పెద్ద తేడా యేమి ఉండదు.

ఈ రకంగా ప్రాకృతికమైన మానవ హృదయం కలలో గాంచినది 'నిజమై' నిలవటం రసాయనశాస్త్ర పరిశోధనలలో జరిగింది. 'బెంజీన్' అనే సేంద్రియ రసాయనం నిర్మాణం కనుగొనటం 19వ శతాబ్దంలో చాలా క్లిష్టమైన సమస్యగా ఉండేది. అప్పట్లో ఆగస్టు కేకులీ (1829-1896) అనే జర్మనీ రసాయన శాస్త్రవేత్త ఈ 'బెంజీన్' రసాయన అణువు నిర్మాణంపై విస్తృతంగా పరిశోధన చేస్తుండేవారు. ఎన్ని రకాలుగా ఒక నిర్మాణం ప్రతిపాదించి దాని రసాయన ధర్మాలు వివరించాలని చూసినా సంతృప్తి కరంగా దాని నిర్మాణం ఉండేది కాదు. ఈ పరిస్థితుల్లో ఒకసారి ప్రయోగ శాలలోనే నిద్రపోయిన కేకులీ కి ఆ 'బెంజీన్' నిర్మాణం 'తల, తోక ఒకదానితో ఒకటి కలిసి వలయంలా చుట్టుకుపోయిన సర్పం' లా కనిపించింది. వెంటనే మెలుకువ వచ్చిన కేకులి 'బెంజీన్' నిర్మాణం తాను కనుక్కోగలిగినట్టు ప్రకటించి ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాడు. ఇలాంటిదే డి.ఎన్.ఏ నిర్మాణ వివరణ విషయంలోనూ జరిగింది వాట్సన్ (1928), క్రిక్ (1916-2004) లకు. అయితే కల వచ్చింది జేమ్స్ డి వాట్సన్ కే. కానీ, ఆ కల ఫలితంగా నోబెల్ బహుమతి విరిరువురికే గాక మొత్తం అయిదు గురికి వచ్చింది. పాతే 'డ్రీమ్ ఎనాలిసిస్' చేస్తూ ఫ్రాయిడ్ మానవ చేతన, ఉపచేతన మధ్య జరిగే అంతర్గత కల్లోలం నుంచీ కలలు వస్తాయని భావించాడు. అలా వచ్చిన కలలో కొన్ని వాస్తవాలు, వ్యక్తిత్వ సమస్యలు, జీవిత ప్రేరణలు ఉండవచ్చని కూడా భావించాడు. ఈ నేపథ్యంలో వాడ్రేవు చిన వీరభద్రుడు గారి విశ్లేషణ, రాజుగారి కవితల్లో 'సర్రియలిజం' కొంత వాస్తవం అనిపిస్తుంది. రాజు గారి 'కలహారం' (2022) చదివితే ఈ వాస్తవ, అధివాస్తవ చిత్రాలు అర్థం చేసికోవటం కష్టం కాదు సరి కదా రసాస్వాదన కూడా హాయిగా చేయవచ్చు.

నిజానికి కవి రాజు గారి కవితలు 'గీతాంజలి'కి ఎందునా తీసిపోవు. కానీ, తెలుగు వారికి ఠాగోర్‌కి వున్న ప్రచార ప్రజ్ఞ లేదు. ఠాగోర్‌కు 'బెంగాలీ 'గీతాంజలి'ని ఆంగ్లంలో అనువదించే ఒక 'ఐరిష్' దేశస్థుడు, యువకుడు అయిన డబ్ల్యూ.బి.యేట్స్ దొరికాడు. అతనికి అప్పటికే నోబెల్ బహుమతి రావటం వలన, అతని అనువాదానికి, సిఫార్సుకు గౌరవం లభించింది. ఠాగోర్కు నోబెల్ బహుమతి లభించింది. మరి 'కవిరాజు' కు తాళ్ళ లాగటం తెలియదు. అందుకే అవార్డులు, గుర్తింపులూ ఇంకా రావలసి ఉన్నా రావలసినంత రాలేదు. అందుకేనేమో కవిరాజు ఇలా అంటారు ః'ఎప్పటిదో నాకీ వరం /దురూసులకు దురాశలకు దూరం చేసి/కంటకాల సంకటాలు దరిచేరకుండా చేశావు/ అడగకనే అన్నీ ఇచ్చి అక్షయసంపదతో అక్షరాన్ని చేశావు. నిస్సందేహంగా కవిరాజు ఒక నూతన కవితా ఒరవడికి 'వైతాళికుడు' అనడానికి ఏ సందేహం అవసరం లేదు.



- డా॥కొప్పరపు నారాయణ మూర్తి, 7671909759

యుద్ధం మిగిల్చిన విషాదం

ఆకాశంలో దట్టమైన పొగ ఆవహించింది
ధూళి కణాల చాటున
సూరీడు దాక్కుండిపోయాడు
ఉన్నట్లుండి ఒక్కసారిగా అలజడి మొదలైంది
యుద్ధ సైరైన్ లతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది

ఆకాశానికి చిల్లులు పడి గ్రహశకలాలు
నేరుగా భూమిని ఢీకొడుతున్నట్లు
ఫైటర్ జెట్ విమానాల నుంచి
జారి పడుతున్న క్షిపణులు
నేరుగా జనావాసాలని తాకుతున్నాయ్
ఏం జరుగుతోందో తెలియడం లేదు
కళ్ళు మూసి తెరిచేలోపే అంతా బూడిదైపోయింది



ఆధిపత్యం కోసం ఆరంభమైన యుద్ధం
అంతమొందించే దాక ఆగనంటోంది
ఆయుధ వ్యాపారాన్ని రెట్టింపు చేసుకోవడానికి
అగ్రరాజ్యాలు యుద్ధాన్ని ఉసిగొల్పుతున్నాయ్
ఆయుధ యంత్రాలు అమ్ముకొని
అంతా స్మశానం ఐన తర్వాత
శాంతి మంత్రాలు ఎవరికి కావాలా

భవిష్యత్ కు బంగారు బాట వేసుకోవాల్సిన
యువత బంకర్లలో తలలు దాచుకుంటున్నారు
పాలు తాగాల్సిన శిశువులు
శిథిలాల కింద నలిగిపోతున్నారు
బడికెళ్లాల్సిన బాలలు
ప్రాణభయంతో వణికి పోతున్నారు

యుద్ధం వల్ల సాధించేదేముంది
తలలు ఛిద్రమైన శవాల దిబ్బల మధ్య
చిన్నారి కారుస్తున్న అశ్రు బిందువులు తప్పా
అక్కడ ఎవరున్నారని పాలించడానికి
సెలయేరులా పారుతున్న ప్రజల రక్తపుటేర్లు తప్పా
శిథిలాల కింద నలిగిపోయిన
శిశువుల దేహాల తప్పా
అక్కడ ఏముందని పాలించడానికి
కాలిపోయిన బూడిద తప్పా ???

- కోనేటి నరేష్, 8499847863

శాంతి కోసం

"The blood of innocents
flowed freely like a river
swollen with injustice" and
"for days the city endured
terror, misdeeds darker than
night itself descended"
- Ghalib

పాలస్తీనా
పాలస్తీనా
పసిపాపల
కలవరింతలో
నువ్వొక కలగానైనా
రాగలవా?

ఈ నేలను బూడిద చేసి
పసిపాపల నెత్తుటితో
యుద్ధమాడుతున్న
వానికి ఎవరు చెప్పగలరు?
వాడి వికట్టాట్టాసాల వెనక
వాడి పొగరుబోతు మాటల వెనక
ఎంతటి క్రూరత్వం!

గాజా నగరం
చీకటి కమ్ముకున్న
చందమామలా
నెత్తుటి మరకలతో
దు:ఖిస్తున్నది


క్రీస్తు పవిత్ర స్నానమాచరించిన
జోర్డాన్ నది ఎండిన
గాజా నెత్తుటి
చారికలతో నిండుకున్నది
ప్రవక్తల గొంతులన్నీ
దుఃఖంతో పూడుకున్నవి

వాడికొక్కటే ధ్యాస
ఈ నేలను దురాక్రమించాలని
మాదొక్కటే ఆశ
మిగిలిన ఈ నేలను
చివరి శ్వాస వరకు
వీడిపోరాదని..

గెలుపు కాదు
శాంతి కోసమే
ప్రతిఘటనని!!

- కెక్యూబ్ వర్మ, 9493436277

ఒక విషాదం, పడి లేచిన కెరటం



కాలం మారినా, నాగరికత ఎంత అభివృద్ధి చెందినా సాంకేతికత మనల్ని చంద్రుని మీద కాలూన్చ గలిగినా ఆడవాళ్ల బతుకు ఇంకా అరటి ఆకే!

ఏపుగా పెరిగి నిండుగా కాయలున్న గున్నమామిడి చెట్టుకు రక్షణ కంచె వుండాలి. లేకపోతే ఆకతాయిలు, దారెంట వెళ్లే వారు రాళ్లేసి కాయలు రాల్చుకుంటారు. కొమ్మలు విరిచేసి రాక్షసానందం పొందుతారు.

ఇదే విషయాన్ని ప్రపంచ నైజాన్ని, కఠోర సత్యాన్ని రచయిత శొంఠి జయప్రకాష్ తన 'ఆకుల నరసమ్మ' నవలలో వివరిస్తారు. బ్యాంకు ఉద్యోగిగా, తన చుట్టూ చోటు చేసుకుంటున్న సమాజ పోకడలను ఒక మౌన ప్రేక్షకుడిగా గమనిస్తూ వాటిని తన రచనల్లోకి వంపుకుంటూ, అర్థవంతమైన సమాజం ప్రస్తుతం కావాలన్న అభ్యుదయకామనతో రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.

రెండు భాగాలుగా, రెండు వందల పాతిక పేజీలుగా, రెండు పాతికల దేశ పరిణామాల్ని చూసిన, ఒకే అర్థం వచ్చే రెండు పదాల సమ్మేళనంగా ఆ ఊరు 'నాగలి సుడక'లో ఈ కథ మొదలవుతుంది. 50 ఏళ్లకే వందేళ్ల అనుభవం గడించి ఆ వూరు కొండలా నిశ్చలంగా నిలిచిన పండుటాకు లాంటి ఆకులు అమ్ముకునే నరసమ్మ అనే ధీరోదాత్త దళిత మహిళ కథే ఈ నవల.

నాలుగేళ్ల పసిప్రాయంలోనే అనాథగా తిరునాళ్లలో వదిలిపెట్టబడితే, జోగప్ప అనే దళిత కులస్తుడు, ఆమెను పెంచుకుంటాడు. జోగప్ప ఆ ఊరి పెద్ద కమతం దారు. చాతుర్వర్ణం అనే నిచ్చెన మెట్ల సమాజంలో నాలుగో మెట్టుకి చెందినవాడు. ఉన్నతాశయాలు, లోకజ్ఞత కలిగినవాడు. తన సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు కలవాడు.

జోగప్ప ప్రాపున పెరిగిన నరసమ్మ పదారేళ్ల ప్రాయానికి వస్తుంది. వయసు, వయసుతో పాటు వచ్చిన ప్రాయంతో నాగలి సుడక ఊరికే అందగత్తె అవుతుంది. ఎందరో నరసమ్మ మీద కన్ను వేసినా, బలమైన రక్షణ కంచెలాంటి జోగప్పకు వెరిసి దూరంగా వుంటారు.

జోగప్ప తన మేనల్లుడైన ఏటప్పకిచ్చి నరసమ్మ పెళ్లి జరిపిస్తాడు. ఏటప్ప పుట్టు అవిటివాడు అవటంతో నరసమ్మలో ఏహ్యత కలుగుతుంది. దీనికి తోడు నరసమ్మను రక్షించే క్రమంలో ఒక పోట్లాటలో గాయపడి వెన్నెముకకు దెబ్బతగిలి సంసారానికి రాకుండా అవుతాడు.

ప్రాయానికి వచ్చిన నరసమ్మ శారీరక సుఖం కోసం వెంపర్లాడుతుంది. ఆత్మ న్యూనతకు లోనైన ఏటప్ప నరసమ్మ ఛాయలకు కూడా చేరటానికి జంకుతుంటాడు. భర్త వల్ల దొరకని సుఖం ఆమె నాగేశ్వర్ అనే ఆకతాయి, అబద్దాల కోరులో వెదుక్కుంటుంది. ఇదివరకే పెళ్లయి ఇద్దరు పిల్లలున్న నాగేశ్వర్ నరసమ్మకు అరచేత స్వర్గం చూపుతాడు.

> పతనం మొదలయిందంటే అధ:పాతాళానికి కూరుకుపోవటానికి ఒక్క క్షణం చాలు. తిరిగి కోలుకోలేనంతగా నడ్డి విరిగి కూలబడటానికి. సరిగ్గా నరసమ్మ జీవితం ఇలాంటి మలుపే తిరిగింది. భూతల స్వర్గం లాంటి జోగప్ప తోట నుండి భూతాల కోటలాంటి నాగేశ్వర్ పాలబడింది.

పతనం మొదలయిందంటే అధ:పాతాళానికి కూరుకుపోవటానికి ఒక్క క్షణం చాలు. తిరిగి కోలుకోలేనంతగా నడ్డి విరిగి కూలబడటానికి. సరిగ్గా నరసమ్మ జీవితం ఇలాంటి మలుపే తిరిగింది. భూతల స్వర్గం లాంటి జోగప్ప తోట నుండి భూతాల కోటలాంటి నాగేశ్వర్ పాలబడింది.

వెనుదిరిగి వెళ్లలేక శిథిలమైన తన జీవితాన్ని వీలైనంత మేర లాక్కురావాలని ధైర్యం చిక్కబట్టుకుంది.

ఆమె ఇప్పుడు 'ఆకుల నరసమ్మ' అయి ఊరి ప్రయివేటు బస్టాండ్‌లో పెద్ద వేపచెట్టు నీడన తమలపాకుల బుట్టతో తనను, నాగేశ్వర్‌ను వారి కుటుంబానికి ఆసరా అయి నిలదొక్కుకుంటుంది. తనలాంటి విధి వంచితులకు ఆమే ఆసరా అవుతుంది.

కొన్నాళ్లకు ఏటప్ప ఆమెకు తారసపడుతాడు. జోగప్ప మరణానంతరం ఆయన ఎస్టేట్‌కు తిరిగి వచ్చిన నరసమ్మ, ఏటప్పలు నిర్వహిస్తూ అనాథ శిశువులకు, మహిళలకు ఆసరా అవుతారు.

రచయిత కథ నడిపించిన తీరు, సంఘటనల పేర్పు, నరసమ్మ పతనోద్ధానాలు, తిరిగి ఆమె అనాథ సేవకు అంకితమైన విధాయకం పాఠకులను మంత్రముగ్ధులను చేస్తుంది. చివరిదాకా విడవక చదివించే ఉత్కంఠ కలిగించడంలో రచయిత శొంఠి జయప్రకాష్ వందశాతం కృతకృత్యుడయ్యాడు.


దళితుల్లోనే ఎన్నో తెగలు, ఉపతెగలుంటాయని వాళ్ల పరస్పరం ద్వేషించుకుంటాని తెలుస్తుంది. ఈ తెగల పెద్దలు తమ స్వార్థపూరిత కుటిలత్వంతో వాళ్లలో వాళ్లకు వైషమ్యాలను ఎగదోస్తుంటారని తెలుసుకుంటాం. జోగప్పలాంటి పూలవనంలో పనిమనిషి గోవిందు లాంటి విషప్పురుగులు, ఏటప్పలాంటి గంగి గోవులంటాయని తెలుస్తుంది. తోళ్లను పదును పెట్టే విధాయకం, చిన్న ఊళ్లో పరస్పరాధీనతలు, అన్ని కులాల మధ్య ఉండాల్సిన సామరస్యం విలువ తెలియజేస్తుంది. ఎక్కడా పద పటాటోపాలు, సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనలు లేకుండా సాదాసీదాగా నవల నడుస్తుంది. క్షణికోద్రేకంలో వేసే తప్పటడుగులు తప్ప, ఉన్నతుల మధ్య పెరిగే వారి ఆలోచనలు ఉన్నతంగానే వుంటాయని నిరూపిస్తుందీ నవల.

'పుట్టినప్పుడు మనిషికి మతం, కులం, జాతి గురించి తెలియదు. పెరిగి పెద్దయ్యాక సమాజం వాటిని నేర్పిస్తుంది'

'చెడు ఎప్పుడూ మనిషిని తన వైపు లాగాలని ప్రయత్నిస్తూ వుంటుంది'

'సర్వ సంపదలు పోగొట్టుకున్నా, ఈ లోకం పగబట్టి కత్తి గట్టినా మనిషి పోగొట్టుకోకూడనిది ధైర్యం' లాంటి మంచి వాక్యాలు ప్రతీకాత్మకతలు నవల నిండా కనిపిస్తూ, పాఠకుడిని ఒక అన్ డిఫైన్డ్ భావనాలోకానికి తీసుకువెళ్తుంది. ఒక మంచి నవల చదివామన్న సంతృప్తిని పాఠకులకు కలిగిస్తుంది.

- కూర చిదంబరం, 8639338675



కత్తులు పూస్తున్న కొమ్మలు

జాలి చూపులతో.. కళ్లనీరు కళ్ళలోనే ఇంకించుకుంటూ.. ఎందుకుంటావ్ !?
బాధలన్నీ నీకేనని..భారమంతా మోస్తున్నానని.. తలుస్తున్నావా?
నీవిక ఏమీ చేయలేవు
ఒడిదుడుకులు లేని ప్రవాహం..బాధలు లేని బ్రతుకుంటుందా..?
జీవితం ఎవరికి వడ్డించిన విస్తరి కాదు -
సృష్టిని చూడు దృష్టి మార్చు -ప్రకృతి అంతాపాఠమే -
జీవమున్న ప్రతిదీ చైతన్యమే..!
స్థితి ఎలా ఉన్నా - పరిస్థితులు ఏవైనా -
కోల్పోకు మానసిక స్థైర్యం - కూడగట్టుకో ధైర్యం.
ఎదురీత దిశ మారుతుంది..రాత రాగమవుతుంది..
సానుభూతికొరకు చూపులు వృధా చేయకు..
సాధించాలని - ఛేదించాలని - రాణించాలని -
బతకాలని - బతికించాలని భావించు...
యోచన మారితే
వివేచన అవుతుంది.. నీవేమిటో నెమరేసుకో
రెక్కలు మొలిచిన పక్షివి...
నెత్తురు మండే పిడికిలివి ..
అవసరమైతే "సంఘటితమవ్వు"
చురకత్తిలా మారు



- గద్దం సులోచన, 7702891559

> సందేహం మనిషికి భయంకరమైన శత్రువు. అది మనిషి హృదయంలో లేనిపోని భయాలని పుట్టిస్తుంది.వాటివల్ల ఎంతో నమ్మకంతో జయించగలమన్న వారి ముందు సైతం మనం తలవంచుకోవాల్సిన విషమ పరిస్థితులు ఎదురవుతుంటాయి.
> - షేక్స్పియర్

సాహితీ వార్తలు

తెలుగు సాహితీవనం కథా పురస్కారం - 2024

తెలుగు సాహితీవనం కథాపురస్కారం కొరకు కథలను ఆహ్వానిస్తున్నది. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ. 2,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది.హైదరాబాద్ లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కారం అందచేస్తారు. కథలు వర్తమాన పరిస్థితులు, మానవ సంబంధాల సాంఘిక ఇతివృత్తంతో 1200 పదాల కంటే మించరాదు. కథను వర్డ్‌లో యూనికోడ్ లో టైప్ చేసి టెక్స్ట్ రూపం లో, హామీ పత్రం జత చేసి sahitivanam82@gmail.com కు మెయిల్ చేయాలి. కథలను పంపటానికి చివరి తేదీ 30.12.2023. వివరాలకు - 9490805404

అబద్ధం ఆవిష్కరణ

ఈ నెల 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు 'అబద్ధం' పుస్తకావిష్కరణ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది. ఈ సభలో బండ్ల మాధవరావు, సీతారాం, ప్రసేన్, శ్రీరాం, మారుతీ పౌరోహితం, అనిల్ డ్యానీ పాల్గొంటారు.

ఇది ప్రజల తిరుగుబాటు

- ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉండకపోతే ఎలా ఉంటుందో ప్రజలు తీర్పు ఇచ్చారని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం వ్యాఖ్యానించారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్కు వద్ద తెలంగాణ అమరులకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పాలకులైనా సరే... ప్రజాస్వామిక విలువలను పాటించాల్సిందేననీ, లేకుంటే ఫలితాలు ఇదే విధంగా ఉంటాయని తెలిపారు. కేసీఆర్ ప్రజలను గడ్డిపోచ మాదిరిగా తీసి పారేశారనీ, ఆ గడ్డిపోచలే అన్ని కలిసి కుర్చీలో నుంచి దించేశాయన్నారు. తొమ్మిదన్నరేండ్ల పీడన అనుభవించిన ప్రజలు నిరసన తెలపకుండా, సమావేశాలు పెట్టుకోకుండా నిరంకుశంగా వ్యవహరించారని తెలిపారు. నిరుద్యోగులు, రైతులు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, నిర్వాసితులు, పోడు భూములు ఇలా అనేక సమస్యలను ఆ నిర్బంధాల మధ్య వెలుగులోకి తెచ్చినట్టు తెలిపారు. ప్రజల చైతన్యం తగ్గలేదనీ, సమయం రాగానే కనబరిచారన్నారు. సీఎం కేసీఆర్ ను ఒకసారి దించకపోతే అహంభావం పెరిగిపోతుందని పసిగట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అహంకార, అవినీతి, అప్రజాస్వామిక విధానాలపై ప్రజలిచ్చిన తీర్పు

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ అహంకారం, అవినీతి, అప్రజాస్వామిక విధానాలపై ప్రజలిచ్చిన తీర్పు అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు.పాలకులకు ఇది కనువిప్పుగా ఉండాలని భావిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కడం, అంతులేని అహంకారం, దురహంకారంతో అప్రజాస్వామిక విధానాలను అనుసరించడం, నిరంకుశ, అవినీతి విధానాలు, నిరుద్యోగ సమస్యలు,ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల బీఆర్ఎస్ పరాజయం పాలైందని తెలిపారు. స్వయంగా కేసీఆర్‌నే ఒకచోట ఓడించడం ప్రజల్లో తీవ్రంగా ఏర్పడిన నిరసనకు నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల మ్యాచ్ ఫిక్సింగ్ వల్ల హైదరాబాద్‌లో భయం, భ్రమలు కల్పించడం వల్ల ఆ మాత్రం సీట్లలో ఆయా పార్టీలు గెలిచాయని వివరించారు. ఈ కూటమి ప్రజావ్యతిరేకంగా రానున్న కాలంలో ఉంటుందని గమనించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపును మతోన్మాద, ఫాసిస్టు కూటమిపై ప్రజలు, ప్రజాస్వామిక గెలుపుగా భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామికంగా, లౌకికత్వంతో సమస్యలను పరిష్కరించే విధంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

31లో 23 కాంగ్రెస్‌వే

- ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో దూసుకెళ్లిన హస్తం వికటించిన బీజేపీ వ్యూహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో హస్తం పార్టీ దూసుకెళ్లింది. బీఆర్ఎస్ 8 స్థానాలకు పరిమితమైంది. ఏడాదిన్నర నుంచి ఆ స్థానాలపై కేంద్రీకరించి పనిచేసిన బీజేపీ ఎన్నికల్లో బొక్కబోర్లా పడింది. మోడీ జపించిన ఎస్సీ వర్గీకరణ తంత్రం పనిచేయలేదు. ఆ సామాజిక తరగతులకు భరోసా కల్పించలేకపోయింది. హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ సభ పెట్టి ప్రధానితో మాట్లాడించినా రిక్తహస్తమే మిగిలింది. అన్ని పార్టీల మాదిరిగానే వర్గీకరణపై కమిటీ వేస్తామని చేసిన ప్రకటన పుట్టిముంచింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలు మొత్తం 31 ఉండగా అందులో 23 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని ముందువరుసలో నిలిచింది. బీఆర్ఎస్ 8 స్థానాలకు పరిమితమైంది. 19 ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో 14 స్థానాలు, ఎస్టీ స్థానాల్లో 12కుగానూ తొమ్మిది హస్తగతమయ్యాయి.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణకు సేవకులం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారంలో ఉన్నా లేకున్నా తాము తెలంగాణ సేవకులమన్నది మరిచిపోవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం "ఎక్స్"లో పోస్ట్ చేశారు. కష్టపడి పనిచేసినందుకు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మన మాతృభూమి కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన సోషల్ మీడియా వారియర్స్ కు ధన్యవాదాలు తెలిపారు. కోరుట్ల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్సీ కవిత, కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం..కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు.. మంత్రి హరీశ్‌రావు

ప్రజాతీర్పును గౌరవిస్తున్నామంటూ, గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీకి అవకాశమిచ్చిన ప్రజలు ఈ సారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని పాలన సాగించాలని కోరారు.ఎన్నికల సమరంలో బీఆర్ఎస్‌కు మద్దతుగా శ్రమించిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పాత పెన్షన్‌కే ఉద్యోగుల మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

- కాంగ్రెస్‌కు ప్రభుత్వానికి శుభాకాంక్షలు : టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర సీపీయస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పాత పెన్షన్ అమలు కోసం సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు పలికారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేయాలనీ, పాత పెన్షన్ అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే సీపీఎస్ రద్దు చేస్తామనీ, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్‌లో పాత పెన్షన్‌ను అమలు చేసిన విధంగా తెలంగాణలో కూడా అమలు చేస్తామంటూ ఆ పార్టీ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందుకుగాను ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో సీపీఎస్ యూనియన్ చేపట్టిన ఉద్యమం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లతోపాటు కుటుంబ సభ్యుల ఓట్లు కూడా దాదాపు కాంగ్రెస్ వైపే మొగ్గుచూపాయని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో పోస్టర్ బ్యాలెట్ ఓట్లు 90 శాతానికి పైగా కాంగ్రెస్‌కు పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలోని 2.10 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనతో చెందుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా పాతపెన్షన్‌ను అమలు చేస్తుందన్న నమ్మకముందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు మంచి భవిష్యత్తు ఉండాలి : టీఈఏ

మంచి మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షులు చిలగాని సంపత్‌కుమారస్వామి, సెక్రెటరీ జనరల్ జి నిర్మల శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలనీ, ఉద్యోగులు, ప్రజలకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు : సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

రాష్ట్రంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు శుభాకాంక్షలు తెలిపారు. మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వేతనాలు, డీఏలు, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, టీఎస్‌జీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల విజయం : టీఎస్‌పీటీఏ

ఇది ముమ్మాటికీ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లు, పీడిత ప్రజలు సాధించిన విజయమని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ తెలిపారు. ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ప్రజా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

అతి విశ్వాసమే కాంగ్రెస్‌ను కొంపముంచింది

- రాజస్థాన్‌లో చిన్న పార్టీలతో పొత్తు కుదుర్చుకుంటే ఫలితాలు మరోలా ఉండేవి

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూసేందుకు హైకమాండ్ ఆసక్తి చూపలేదు. ఛత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని నిలబెట్టుకోగలమని, మధ్యప్రదేశ్, తెలంగాణల్లో అధికారంలోకి రాగలమని నాయకత్వం అతి విశ్వాసంతో ఉంది. అలాంటప్పుడు రాజస్థాన్ వదులుకున్నా ఇబ్బంది లేదని హైకమాండ్ అభిప్రాయపడింది. గత ఎన్నికల ఫలితాలు తరువాత గెహ్లాట్‌ను కాకుండా సచిన్ పైలట్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు హైకమాండ్ ప్రాధాన్యతనిచ్చింది. కానీ గెహ్లాట్ 80 మంది ఎమ్మెల్యేలను తన వెంట ఉంచుకోవడంతో హైకమాండ్ ఎత్తుగడకు అడ్డుకట్ట వేశారు. ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటు చేసి సచిన్ పైలట్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు జైపూర్‌కు వెళ్లిన హైకమాండ్ ప్రతినిధులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. గెహ్లాట్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. హైకమాండ్ పట్టుదలతో మల్లికార్జున్ ఖర్గే ఏఐసిసి అధ్యక్షుడయ్యారు. సచిన్ పైలట్ ఎమ్మెల్యేగా కొనసాగారు. దీంతో గెహ్లాట్, పైలట్ వార్ మరింత ముదిరింది. రాజస్థాన్‌లో గెహ్లాట్ ఓడిపోతే ఆ స్థానంలో గెహ్లాట్‌ను తప్పించి పైలట్‌గా నియమించాలని హైకమాండ్ యోచిస్తోంది. రాజస్థాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లు వదులుకుంటామని నాయకత్వం ఊహించలేదు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాజస్థాన్‌లో ప్రచారం చేసినది కొద్ది రోజులే. ప్రచార భారం ముఖ్యమంత్రి గెహ్లాట్‌పైనే ఉంది. ముఖ్యమంత్రి అభ్యర్థి తదితర అంశాలపై నెలకొన్న అశాంతిని తగ్గించాలని గెహ్లాట్ భావించారు. అయితే ప్రతి సంవత్సరం గడిచేకొద్దీ, కాంగ్రెస్‌లోని అంతర్గత పోరుతో ఇబ్బంది పడుతున్న ప్రజల మనస్సులో ప్రభుత్వ మార్పు సాధారణ సెంటిమెంట్‌గా మారింది. 2013లో అంత పెద్దగా లేకపోయినా బిజెపి మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకుంది. గంగానగర్, హనుమాన్‌గఢ్, చురు, సికార్ జిల్లాలతో కూడిన షెకావతి ప్రాంతంలో మాత్రమే కాంగ్రెస్ పట్టు సాధించగలిగింది. ఇది అన్ని ఇతర ప్రాంతాలలో విచ్ఛిన్నమైంది.యుపికి అనుబంధంగా ఉన్న భరత్‌పూర్ బెల్ట్‌లో ప్రభావం చూపుతున్న సిపిఎం, హనుమాన్ బేనివాల్ రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, ఆర్ఎల్‌డి వంటి పార్టీలతో ఎన్నికల ఒప్పందం కుదుర్చుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నించలేదు. ఈ పార్టీలన్నింటికీ రాజస్థాన్‌లో దాదాపు పది శాతం ఓట్లు ఉన్నాయి. ఇండియా ఐక్యత స్ఫూర్తితో కాంగ్రెస్ ఇతర పార్టీలతో అవగాహన కుదుర్చుకోవడానికి ప్రయత్నించి ఉంటే, బహుశా రాజస్థాన్ చిత్రం మరోలా ఉండేది.

డెత్ జోన్‌గా మారిన గాజా

- 24 గంటల్లో 700మందికి పైగా పాలస్తీనియన్లు మృతి
- చర్చల పునరుద్ధరణపై వెనుదిరిగిన హమస్
- ప్రబలుతున్న అంటు వ్యాధుల ముప్పు



గాజా : గత 24 గంటల్లో గాజాలో 700మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని ప్రభుత్వ మీడియా కార్యాలయ డైరెక్టర్ జనరల్ తెలిపారు. 15లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారని చెప్పారు. వెస్ట్ బ్యాంక్‌లో రాత్రంగా కొనసాగిన దాడుల్లో 60మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా హెబ్రాన్, బెత్లెహామ్, రమల్లా, నబ్లస్, జెనిన్ నగరాల్లో శనివారం ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయి. ఎలాంటి అభియోగాలు, విచారణ లేకుండానే పాలనాపరమైన నిర్బంధం పేరుతో వీరిని అరెస్టు చేశారు.

కాగా, గాజాపై దాడులను ముమ్మరం చేసిన నేపథ్యంలో ఇక ఇజ్రాయిల్‌తో చర్చలు పునరుద్ధరించేది లేదని హమస్ స్పష్టం చేసింది. దాడులు కొనసాగుతునే వున్నందున బందీలు-ఖైదీల మార్పిడి కోసం సంధి చర్చలు జరగబోవని తేల్చి చెప్పారు. హమస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ ఖతార్‌లో జరుగుతున్న చర్చల నుండి ఇజ్రాయిల్ వెనక్కి మళ్ళింది. ఈ నేపథ్యంలోనే హమస్ ప్రకటన కూడా వెలువడింది.

గాజాకు దక్షిణ ప్రాంతంలోని ఖాన్ యూనిస్‌లో నాజర్ ఆస్పత్రిలో దృశ్యాలు చూస్తుంటే అదంతా డెత్ జోన్‌లా మారిందని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ వ్యాఖ్యానించారు. ఎక్కడ చూసినా థర్డ్ డిగ్రీ కాలిన గాయాలతో పిల్లలు నేలపై పడి వున్నారు. పదునైన ఆయుధాలు గుచ్చుకున్న గాయాలు, విరిగిన కాళ్లు చేతులు, తలకు దెబ్బలతో కనిపిస్తున్నారు. మృత్యుముఖంలో వున్న చిన్నారులను పట్టుకుని తల్లులు ఏడుస్తూ వుండడం చూస్తుంటే ఆ ప్రాంతమంతా మరణమృదంగం వినిపిస్తోందన్నారు.

ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో మరణాలు ఒక ముప్పు అయితే, పెరుగుతున్న వ్యాధులు రెండో ముప్పుగా మారిందని జేమ్స్ పేర్కొన్నారు. తాగునీరు, పారిశుధ్యం, రక్షణ లేక అనేకమంది పిల్లలు మరణిస్తున్నారని అన్నారు. యుద్ధం ఆరంభమైన తర్వాత 6వేల మందికి పైగా పిల్లలు మరణించారని తెలిపారు. గాజాలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఒకదాంట్లో హెపటైటిస్ ఎ తలెత్తిందని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ డైరెక్టర్ థామస్ వైట్ తెలిపారు. పారిశుధ్యం సరిగా లేనందున పలు వ్యాధుల ముప్పు పొంచి వుందన్నారు. పారిశుధ్యమనేది తీవ్ర సమస్యగా మారింది, చాలా ఇరుకుగా వున్న తరగతి గదుల్లో ప్రజలు ఇరుకిరుకుగా వుంటున్నారని దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి పాఠశాలల్లో నీటి సదుపాయం చాలా దారుణంగా వుందని, సగటున 125మందికి ఒక్కటే టాయిలెట్ వుందన్నారు. హెపటైటిస్-ఎ బాగా అంటు వ్యాధి. గల్ఫ్ సహకార మండలి సదస్సు మంగళవారం నుండి దోహాలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమయ్యారు. గాజాలో పెరుగుతున్న సంక్షోభంపై సదస్సులో చర్చించనున్నారు. గాజాలో తక్షణమే యుద్ధాన్ని విరమించాలని అరబ్, ముస్లిం నేతలు ఒక సంయుక్త ప్రకటనలో పిలుపిచ్చిన మూడు వారాల తర్వాత ఫై సదస్సు జరగనుంది.

ఫిలిప్పీన్స్‌లో ప్రార్ధనా సమావేశంపై బాంబు దాడి

- నలుగురు మృతి, పలువురికి గాయాలు

మనీలా : దక్షిణ ఫిలిప్పీన్స్‌లో క్రైస్తవుల ప్రార్ధనలపై ఆదివారం శక్తివంతమైన బాంబు దాడి జరగడంతో నలుగురు మరణించారని, దాదాపు 50మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరావి నగరంలోని ఒక యూనివర్శిటీ జిమ్నాజియంలో ప్రార్ధనా సమావేశం జరుగుతుండగా ఈ పేలుడు సంభవించింది. గాయపడిన వారిలో ఇద్దరు మృత్యువుతో పోరాడుతున్నారని, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారని సెక్యూరిటీ చీఫ్ తాహా తెలిపారు. ఈ సంఘటన తీవ్రవాద చర్యేనని ఆయన వ్యాఖ్యానించారు. ఏదో ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన ఘర్షణ కాదని, బాంబు దాడి జరిగితే చుట్టుపక్కలనున్నవారు కూడా మరణిస్తారని అన్నారు. కాగా, మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళలే. వెంటనే సైనిక బలగాలు, పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ దాడికి బాధ్యులెవరో తెలుసుకుని వారిపై చర్య తీసుకుంటామని ప్రకటించారు.

ప్రజలు మార్పు కోరుకున్నారు

- ప్రభుత్వంపై వ్యతిరేకత వల్లే కాంగ్రెస్ గెలుపు : విలేకరుల సమావేశంలో జూలకంటి

నవతెలంగాణ- మిర్యాలగూడ

తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకున్నారని, అందువల్లే కాంగ్రెస్ పార్టీకి అధిక సీట్లు వచ్చాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ పదేండ్ల కాలంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అహంకారంతో నిర్ణయాలు తీసుకున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అహంకారంతో వ్యవహరించారని చెప్పారు. దాని వల్ల ప్రభుత్వం, పాలకులపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కేసీఆర్‌పై తీవ్ర అసంతృప్తి కారణంగా బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందన్నారు. ముఖ్యంగా యువకులు, మహిళలు, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోవడం వల్ల నిరుద్యోగులు అందరూ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను కేవలం రెండు కూటమిలుగానే చూశారని, ప్రత్యేకంగా ఉన్న మూడో కూటమిని చూడలేదని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని, భవిష్యత్‌లో సీపీఐ(ఎం) నిర్మాణానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, డా.మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, జగదీష్ చంద్ర, సత్యనారాయణ రావు, వీరాచారి పాపిరెడ్డి, తదితరులు ఉన్నారు.

తెలంగాణలో నిజమైన ఎగ్జిట్‌పోల్స్

- కామారెడ్డిలో 'ఆరా' చెప్పినట్టే ఫలితం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో సర్వేలు చెప్పినట్టుగానే అధికారం హస్తగతమైంది. 30కిపైగా సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించాయి. అందులో 20కిపైగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నాయని చెప్పాయి. అందులో ఆరా మస్తాన్, చాణక్య స్ట్రాటజీస్, జన్‌కీబాత్, రేస్, ఇండియా టీవీ-సీఎన్ఎక్స్, స్మార్ట్‌పోల్, రిపబ్లిక్ టీవీ, ఆత్మసాక్షి, పొలిటికల్ ల్యాబ్, ఇండియా టుడే, తదితర సంస్థలు ఉన్నాయి. ఆ సంస్థలు చెప్పినట్టుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆరా, పీపుల్ పల్స్, ఇండియాటీవీ సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ వాస్తవ ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఓడిపోతున్నారనీ, అక్కడ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలువబోతున్నారని 'ఆరా' సంస్థ చెప్పింది. ఫలితాల ప్రకటనలో అదే నిజమైంది.

కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు భంగపాటు

- కరీంనగర్ పార్లమెంటరీ స్థానం పరిధిలోనూ ఆశాభంగమే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఆ పార్టీకి చుక్కెదురైంది. అక్కడ నుంచి బరిలోకి దిగిన కృష్ణయాదవ్ ఘోరపరాజయం పాలయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేతిలో 24,630 ఓట్ల భారీ తేడాతో ఓడిపోయారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ స్థానం పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానాలుండగా..బీజేపీ ఒక్క చోట కూడా గెలవలేకపోయింది. లక్ష్మణ్ సొంత నియోజకవర్గమైన ముషీరాబాద్‌లో తాను సూచించిన పూసరాజు పరాజయం పాలయ్యారు. అర్వింద్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ పార్లమెంటరీ స్థానంలో ఆర్మూర్, నిజామాబాద్(అర్బన్) స్థానాల్లోనే బీజేపీ అభ్యర్థులు గెలిచారు. బోధన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో ఓడిపోయారు. సోయం బాపూరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానం పరిధిలో మాత్రం మెరుగైన ఫలితాలను సాధించింది. సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్ అసెంబ్లీ స్థానాల్లో అనూహ్యంగా బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఆసిఫాబాద్(ఎస్టీ), ఖానాపూర్(ఎస్టీ), బోథ్(ఎస్టీ) స్థానాల్లో పరాజయం పాలైంది. ఆ నాలుగు ఎంపీ నియోజకవర్గాల స్థానాల పరిధిలో 28 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా..ఆరు స్థానాలను బీజేపీ గెలుపొందింది.

డాక్టర్ రాజేశ్ రెడ్డికి శుభాకాంక్షలు

- ఏఐడీఎస్ఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగర్ కర్నూల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తెలంగాణ స్టేట్ డెంటల్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ కూచుకుంట్ల రాజేశ్ రెడ్డికి ఆల్ ఇండియా డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు డాక్టర్ మంజూర్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజేశ్ రెడ్డి నాయకత్వంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనీ, దంత వైద్యుల సమస్యలకు గొంతుకగా నిలుస్తారనీ, పరిష్కరిస్తారనీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపీలో కౌన్ బనేగా సీఎం..?

- చౌహాన్ కాకపోతే, ముఖ్యమంత్రి ఎవరు?

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బీజేపీ పెద్ద పార్టీగా అవతరించింది. అయితే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్నది పెద్ద ప్రశ్న. ఈ ఎన్నికలలో శివరాజ్ సింగ్ చౌహాన్ పనిచేసిన తీరు. మహిళా సంక్షేమ విధానాలకు ఉన్న ప్రజాదరణ చూసి పార్టీ ఆయనను పక్కన పెడుతుందా? అనే దానిపై బిగ్ డిస్కర్షన్. కర్నాటకలో బసవరాజ్ బొమ్మైని సీఎం చేసి చేతులు కాల్చుకున్న బీజేపీ.. రాష్ట్రంలో అధికార వ్యతిరేకత లేకుండా చేసేందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎంగా చేయలేదు. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జరిగింది. ప్రజలు, ముఖ్యంగా మహిళలు, శివరాజ్ చౌహాన్ పథకాలకు ఎంతో ఆకర్షితులయ్యారు. వారు బీజేపీకి అధిక సంఖ్యలో ఓటేశారు.

అయితే సీఎంను సీఎం చేయని పార్టీ ఐదోసారి కూడా శివరాజ్ సింగ్ పేరును సీఎంగా ప్రతిపాదిస్తారా? మరి శివరాజ్ కాకపోతే పోటీదారు ఎవరు? శివరాజ్ సీఎం కాకపోతే ఎవరి పేరు పైకి వెళ్తోంది? శివరాజ్ సీఎం కాకపోతే పార్టీ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్ర సింగ్, కైలాష్ విజయవర్గీయ, వీడీ శర్మ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో బీజేపీలో అలాంటి సంప్రదాయం ఏర్పడి చివరి క్షణంలో ఆ పార్టీ సర్ ప్రైజ్‌లు ఇస్తోంది.

శివరాజ్‌కు పాపులారిటీ ఉన్నా సీఎం చైర్ డౌటే..!.

సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఉన్న పాపులారిటీని పరిశీలిస్తే.. పార్టీ ఆయనకు సీఎం పదవిని అందించేలా కనిపించడం లేదు. అయితే కేంద్ర నాయకత్వంతో ఆయన సంబంధాలు చెడిపోతే ఐదో సారి ఆయనకు సమస్యగా మారొచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల వరకు పార్టీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎంగా కొనసాగించే అవకాశమూ లేకపోలేదు. ఆ తర్వాత శివరాజ్ కేంద్ర రాజకీయాల్లో తన భవిష్యత్తుకు సిద్ధపడవచ్చు. శివరాజ్ వయస్సు అతని తోటి నాయకుల కంటే తక్కువ కాబట్టి, ఆయన దీని నుండి ప్రయోజనం పొందవచ్చు. ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో నడిచే బీజేపీ ముందస్తు నిర్ణయాలు తీసుకుంటుందని గుప్తా సంకేతాలిస్తోంది.

పాక్‌లో బస్సుపై కాల్పులు : 9మంది మృతి

పెషావర్ : ఉత్తర పాకిస్తాన్‌లో ఒక బస్సుపై తీవ్రవాదులు కాల్పులు జరపడంతో ఇద్దరు సైనికులతో సహా 9మంది చనిపోయారని స్థానిక పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుందని పోలీసు అధికారి అజ్మత్ షా తెలిపారు. బస్సుపై కాల్పులు జరపడంతో డ్రైవర్‌కు వాహనంపై అదుపు తప్పి ట్రక్కును ఢీ కొందని, దాంతో ట్రక్కుకు నిప్పంటుకుని ఇరు వాహనాల డ్రైవర్లు మరణించారు. ఈ సంఘటనలో 26మంది గాయపడ్డారు. ఇది తీవ్రవాద చర్య అని గిల్గిత్ బాల్టిస్తాన్ హోం మంత్రి షమస్ లోనె విలేకర్లకు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి గుల్బర్ ఖాన్ తెలిపారు. కాగా ఈ కాల్పులతో తమకు సంబంధం లేదని పాకిస్తానీ తాలిబాన్ ప్రతినిధి మహ్మద్ ఖొరసాని తెలిపారు.

ఇంధన వనరుల ఎంపికపై ఆంక్షలను అంగీకరించలేం

- కాప్ సదస్సులో భారత్ స్పష్టీకరణ
- కొత్త ఇంధన సామర్ధ్య ఒప్పందానికి భారత్, చైనా దూరం



దుబాయ్ : ఏ తరహా ఇంధన వనరులు వాడాలి, ఏవి వాడకూడదనే విషయంలో విధించే ఆంక్షలకు భారత్ కట్టుబడి వుండదని పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనా నందన్ స్పష్టం చేశారు. పునర్వినియోగ ఇంధనాన్ని విస్తరించడానికి భారత్ కట్టుబడి వుంటుందని తెలిపారు. 2030కల్లా పునర్వినియోగ ఇంధన సామర్ధ్యాన్ని మూడు రెట్లు చేయాలని ప్రతిన చేస్తూ 118 దేశాలు సంతకాలు చేసిన ఒప్పందానికి భారత్, చైనాలు దూరంగా వున్నాయి. అయితే భారత్ అనుసరించిన ఈ వైఖరి గత వైఖరికి విరుద్ధంగా వుంది. ఎందుకంటే ఈ ఏడాది సెప్టెంబరులో జి-20 డిక్లరేషన్‌లో ఇంధన సామర్ధ్యాన్ని మూడు రెట్లు చేయడానికి కట్టుబడి వున్నట్లు భారత్ పేర్కొంది. అలాగే ఆదివారం 123 దేశాలు సంతకాలు చేసిన మరో ప్రధాన ప్రతిన "డిక్లరేషన్ ఆన్ క్లైమేట్ అండ్ హెల్త్"పై కూడా భారత్ ఇప్పటివరకు సంతకం చేయలేదు.

ఇక్కడ జరుగుతున్న కాప్ 28 సదస్సులో జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, చిలీ, బ్రెజిల్, నైజీరియా, బార్బడోస్‌లతో సహా పలు దేశాలు ఆ ప్రతినకు మద్దతునిచ్చాయి. కాగా చైనా, భారత్‌లు రెండూ సమగ్ర ప్రతినకు అధికారికంగా మద్దతునివ్వలేదు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడంతో పాటూ పరిశుద్ధమైన ఇంధనాన్ని పెంచాలన్నది ఆ ప్రతినలో భాగమే. బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తిని దశలవారీగా తగ్గించాలని ఆ ప్రతిన పిలుపిస్తోంది.

విపరీతమైన వేడి, వాయు కాలుష్యం, ఇన్ఫెక్షన్లను కలగచేసే వ్యాధులు వంటి వాతావరణ సంబంధిత ఆరోగ్య ప్రభావాలతో సహకరించేలా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను సన్నద్ధం చేసేందుకు, కమ్యూనిటీలను రక్షించేందుకు ఈ డిక్లరేషన్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఇవి ఇంకా ముసాయిదాల రూపంలోనే వున్నా, వీటికి ఇంకా చట్టపరమైన అర్హత లభించనప్పటికీ ఈ రెండు డిక్లరేషన్లు కూడా శిలాజ ఇంధనాల కాలుష్యాలను నియంత్రించేందుకు వాతావరణ, ఆరోగ్య లక్ష్యాలతో ముడిపడినవే.

తమ ప్రజల జీవన ప్రమాణాలను వేగంగా మెరుగుపరచడానికి గనూ తమకు అతిపెద్ద ఇంధన వనరుగా వున్న బొగ్గు నిల్వలపై ఆధారపడాల్సి వుందంటూ భారత్ సుదీర్ఘ కాలంగా చెబుతూ వస్తోంది. దీనికి విరుద్ధంగా బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తిని విడనాడనాలని డిమాండ్లు వస్తున్నాయి. ప్రపంచ సగటు తలసరి కాలుష్యం 4శాతం కన్నా తక్కువగానే వున్నందున కార్బన్ల సంక్షోభానికి భారత్ దోహదపడుతున్న వాటా చాలా తక్కువ అని, అందువల్ల బొగ్గును వినియోగించే హక్కు తమకు వుందంటూ భారత్ పునరుద్ఘాటించింది. ఈ డిక్లరేషన్ల లక్ష్యాలను నిర్దిష్ట కాలుష్యాల కేటగిరీకి ముడిపెట్టడాన్ని భారత్ వ్యతిరేకించింది. "వ్యాక్సిన్లు, మందులను నిల్వ చేసుకోవడానికి మాకు కోల్డ్ స్టోరేజీలు అవసరం. పైగా ఇవన్నీ మా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలను పటిష్టంగా వుంచడానికి ముడిపడినవే. అయితే, వీటిని ఉపయోగించడం వల్ల వాతావరణ కాలుష్యానికి దోహదపడుతున్నారన్న వ్యాఖ్యలు, పైగా ఈ ఇంధనాలు బదులుగా ఆ ఇంధనాలను ఎంచుకోవాలంటూ చెప్పడం ఇవన్నీ భారత్‌కు ఆమోదయోగ్యం కాదని నందన్ స్పష్టం చేశారు. భారత్ నిర్మాణాత్మకంగానే వ్యవహరిస్తుందని, కానీ అభివృద్ధి ముంగిట వున్నవారికి ఇంధన వనరులు అందుబాటులో లేకుండా తిరస్కరించడం ద్వారా కాదని ఆమె పేర్కొన్నారు.

ఈటల రెండు చోట్లా ఓటమి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ జాతీయ నాయకత్వం తమ పార్టీ తురుపు ముక్కగా భావించిన ఈటల రాజేందర్ రెండు చోట్లా పరాజయం పాలయ్యారు. తెలంగాణలోనూ బెంగాల్‌లో మమతాబెనర్జీపై సువేంద్ సర్కారును ప్రయోగించిన తరహాలోనే గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై ఈటల రాజేందర్‌ను బీజేపీ బరిలోకి దింపింది. దీంతో పాటు హుజురాబాద్‌లోనూ ఆయన పోటీచేశారు. కానీ, రెండు చోట్లా ఆయన ఓటమిపాలయ్యారు. గజ్వేల్‌లో సీఎం చేతిలో ఘోర పరాభవం పాలయ్యారు. 45 వేల పైచిలుకు ఓట్లతో ఓటమి చవిచూశారు. హుజూరాబాద్‌లో 16873 ఓట్లతో పాడి కౌశిక్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. హుజురాబాద్‌లో బీజేపీ పాత శ్రేణులు ఆయనకు పూర్తిగా సహకరించకపోవడం, తాను ఓడిపోతే శవయాత్ర చూడాల్సి వస్తుందని కౌశిక్‌చేసిన భావోద్వేగ ప్రకటన ఈటల ఓటమికి కారణమయ్యాయనే చర్చ నడుస్తున్నది. ఈటల రాజేందర్ గజ్వేల్‌పై ఎక్కువ కేంద్రీకరించారు. హుజురాబాద్‌లో ఆయన భార్య జమున అంతా తానై చూసుకున్నారు. ఇద్దరు తలో నియోజకవర్గంలో అంతా తామై పనిచేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌ను వీడి ఆ పార్టీనీ, ఇటు తన రాజకీయ జీవితాన్ని ఆగం చేసుకున్నారనే చర్చ నడుస్తున్నది.

ఆ డాక్టర్లకు శుభాకాంక్షలు

- డాక్టర్ రాజీవ్ నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన డాక్టర్లకు టీ-జూడా సలహాదారు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రాజీవ్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారంతా ప్రజల కోసం ప్రజారోగ్యం కోసం పాటుపడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సీపీఎస్ రద్దుకే ఉద్యోగుల మద్దతు

ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్

- ఒకటో తేదీన జీతాలిస్తామంటూ హామీ
- సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం
- 5 శాతం ఐఆర్ ఇచ్చి అవమానించిందనే అభిప్రాయం
- సకాలంలో డీఏలు ఇవ్వకుండా జాప్యం
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో హస్తానికే అధికం


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు మద్దతుగా నిలిచారు. పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) పునరుద్ధరిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఎక్కువ మంది ఓటేశారు. పోస్టల్ బ్యాలెట్లలోనూ ఇది రుజువైంది. 109 నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి అధికంగా రావడమే ఇందుకు నిదర్శనం. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయి. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే సీపీఎస్‌ను రద్దు చేసింది. తాజాగా కర్నాటకలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీంతో తెలంగాణలో సీపీఎస్ రద్దు అంశం ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆకర్షించింది. అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేసే అవకాశముండడంతో కాంగ్రెస్ పార్టీకి వారు మంది మద్దతుగా నిలిచారు. 'ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లిస్తాం. మొదటి తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం. 317 జీవోను సమీక్షించి బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం. బదిలీలను ఏటా వేసవి కాలంలోనే చేపడతాం. కొత్త పీఆర్సీని ప్రకటించి ఆర్నెల్లలోపు సిఫారసులను అమలు చేస్తాం. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు, అన్ని ఆస్పత్రుల్లో వైద్య అందేలా ఆరోగ్య కార్డులను జారీ చేస్తాం. ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఆశావర్కర్లకు, ఐకేపీ ఉద్యోగులకు తక్షణమే వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తాం. అర్బన్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీం కింద 150 రోజులకు పెంచుతూ కనీస వేతనాన్ని రూ.350లకు పెంచుతాం.'అంటూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలిచ్చింది. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆ

బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత

అధికార బీఆర్ఎస్ పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. మాటల్లోనే ఎంప్లాయీ ఫ్రెండ్లీ ప్రభుత్వం... చేతల్లో ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభించడాన్ని తప్పుపట్టారు. మంత్రులు, అధికారులకు పలుమార్లు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఎక్కువ మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీఆర్ఎస్ పార్టీకి ఓటేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించకపోవడంతో ప్రభుత్వ తీరుపట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. మూడు డీఏలను పెండింగ్‌లో ఉంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రెండో పీఆర్సీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూనే ఐదు శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడాన్ని అవమానకరంగా భావించారు. జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు వంటి బిల్లులకు సంబంధించిన డబ్బులు చెల్లించడంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. 317 జీవో బాధితులు, భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించడం, బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడం ఉపాధ్యాయుల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఉన్నది. బీఆర్ఎస్ ఓటమికి ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఉన్న వ్యతిరేకత కూడా ప్రధాన కారణంగా ఉన్నది.

మంత్రినే ఓడించి.. తొలి ఎన్నికల్లోనే సత్తా..

- చరిత్ర సృష్టించిన 'యశస్విని'
- పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా



నవతెలంగాణ-పాలకుర్తి

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి 26 ఏండ్ల యశస్వినిరెడ్డి విజయం సాధించి చరిత్రను సృష్టించారు. సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై అనూహ్యంగా బరిలోకి దిగిన యశస్వినిరెడ్డి.. తొలి ఎన్నికలోనే సత్తా చాటారు. పాలకుర్తి నియోజకవర్గం గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను మొట్టమొదటిసారిగా ఎగురవేసి ఆదర్శంగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఝాన్సీ రెడ్డి టిక్కెట్టు ఆశించగా.. భారత పౌరసత్వం రాకపోవడంతో ఆమె కోడలు యశస్విని రెడ్డిని రాజకీయ రంగ ప్రవేశం చేయించారు. కాగా, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఝాన్సీ రెడ్డికి పౌరసత్వం రాకుండా అడ్డుకోవడంతో పాటు యశస్విని రెడ్డి నామినేషన్ తిరస్కరణకు అనేక కుట్రలు చేశారు. అయినా నియోజకవర్గ ప్రజల అండదండలతో మరింత పట్టుదలతో ప్రచారం నిర్వహించి చివరకు విజయం సాధించారు. రాష్ట్రంలోనే అతి చిన్న వయసురాలిగా పేరుపొందారు. కాగా, 2018లో బీటెక్ పూర్తి చేసిన యశస్విని రెడ్డి.. వివాహం అనంతరం అమెరికా వెళ్లిపోయారు. అక్కడ కొంతకాలం రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేశారు.

పేట గడ్డపై తొలి మహిళా ఎమ్మెల్యే

డాక్టర్ పర్ణికారెడ్డి



నవ తెలంగాణ - నారాయణపేట టౌన్

నారాయణపేట నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి(30) విజయం సాధించారు. నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడిన నేపథ్యంలో.. టీఆర్ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్ రెడ్డిపై 7950 ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు. ఫలితాల అనంతరం భావోద్వేగానికి గురయ్యారు.

వివరాల్లోకి వెళితే.. నారాయణపేటకు చెందిన మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి మనవరాలే ఈ చిట్టెం పర్ణికా రెడ్డి. స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మిల కూతురు. చిట్టెం లక్ష్మి.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డికి భర్త డాక్టర్ విశ్వజిత్ రెడ్డి, కుమారుడు అయన్స్ రెడ్డి(4) ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాదాపు 20 ఏండ్ల పాటు తన మేనమామ, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి.. నియోజకవర్గానికి చేసిన సేవలతోనే నేడు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. తనను నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నియోజకవర్గంలో 1,81,708 ఓట్లు పోలవ్వగా.. కాంగ్రెస్ పార్టీకి 84,005 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్ రెడ్డికి 76,499 ఓట్లు పోలయ్యాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ గెలుపుతో కార్యకర్తలు.. ఆనందంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ముఖ్య కూడళ్లలో బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు షాక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ పార్టీల్లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు ఓటర్లు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ నుంచి 12 మంది గంపగుత్తాగా కారెక్కారు. అదే విధంగా టీడీపీలో గెలిచిన ఇద్దరూ గులాబీ కండువా కప్పుకున్నారు. అందులో కాంగ్రెస్‌కు చెందిన 12 మందిగానూ 10 మంది ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలయ్యారు. టీడీపీ ఎమ్మెల్యేలు కూడా ఓడిపోయారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారామని నేతలు చెప్పినా ప్రజలు విశ్వసించలేదు.

అయితే మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాత్రం గెలుపొందారు. ఓడిపోయిన వారిలో కొత్తగూడెం నుంచి గెలుపొందిన వనమా వెంకటేశ్వర్‌రావు (కాంగ్రెస్), పినపాకలో రేగా కాంతారావు (కాంగ్రెస్), ఇల్లెందులో హరిప్రియ నాయక్ (కాంగ్రెస్), నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య (కాంగ్రెస్), భూపాలపల్లిలో గండ్ర వెంకట రమణారెడ్డి (కాంగ్రెస్), పాలేరులో ఉపేందర్‌రెడ్డి (కాంగ్రెస్), ఎల్లారెడ్డిలో సురేందర్ (కాంగ్రెస్), కొల్లాపూర్‌లో హర్షవర్ధన్ రెడ్డి (కాంగ్రెస్), తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి (కాంగ్రెస్), ఆత్రం సక్కు (కాంగ్రెస్) ఉన్నారు. అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వర్‌రావు (టీడీపీ), సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య (టీడీపీ), బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈసారి వీరంతా బీఆర్ఎస్ అభ్యర్థులుగా బరిలో దిగినా వారికి నిరాశే మిగిలింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లి గెలిచిన నేతలు

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి టిక్కెట్లు ఆశించి...సీట్లు రాకపోవడంతో ఆ నేతలు కాంగ్రెస్‌లో చేరి విజయం సాధించారు. వేముల వీరేశం (నకిరేకల్), జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), కసిరెడ్డి నారాయణ రెడ్డి (కల్వకుర్తి), మందుల సామేల్ (తుంగతుర్తి), తుమ్మల నాగేశ్వరరావు (ఖమ్మం), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (పాలేరు), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కోరం కనకయ్య (ఇల్లందు) ఈ జాబితాలో ఉన్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), జి.వివేక్ వెంకటస్వామి (చెన్నూర్) కూడా గెలిచారు.



కామారెడ్డిలో ఓడిన ఉద్దండులు

- కేసీఆర్, రేవంత్‌రెడ్డిని కాదని..
- రమణారెడ్డిని గెలిపించిన ఓటర్లు

నవతెలంగాణ-కామారెడ్డి

ఇద్దరు ఉద్దండులు పోటీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని కామారెడ్డి నియోజకవర్గం ఆకర్షించింది. అయితే ఇప్పుడు మరింత సంచలనంగా మారింది. కేసీఆర్, రేవంత్‌రెడ్డిని కాదని లోకల్ అభ్యర్థిగా వెంకటరమణారెడ్డికే కామారెడ్డి ప్రజలు పట్టం కట్టారు. దాంతో ఆయన చరిత్ర సృష్టించినట్టు అయింది. సీఎంతో పాటు కాబోయే సీఎం అభ్యర్థిని ఓడించావంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డికి 66,652 ఓట్లు రాగా, కేసీఆర్‌కు 59,911, రేవంత్‌రెడ్డికి 54,916 ఓట్లు వచ్చాయి. 6741 ఓట్ల మెజార్టీతో వెంకటరమణారెడ్డి గెలుపొందారు. తమ స్వగ్రామం కోనాపూర్ అంటూ గంపగోవర్ధన్ సూచన మేరకు కామారెడ్డి నుంచి బరిలో నిలుస్తున్నట్టు కేసీఆర్ మొదటి నుంచి చెప్తూ వచ్చారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు కేసీఆర్‌పై తాను బరిలో నిలిచినట్టు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే ఇద్దరు నాన్‌లోకల్ వ్యక్తులని, తాను లోకల్ అని ఇక్కడే ఉంటానంటూ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ప్రచారంలో ప్రధానంగా చెప్పుకొచ్చారు. దాంతో పాటు కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించారు. తనకు అధికారం లేకున్నా.. ఇన్ని చేస్తున్నా అని, అధికారం ఇస్తే మరింత సేవ చేస్తా అంటూ కేవలం కామారెడ్డి నియోజకవర్గంలో తాను చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రత్యేక మ్యానిఫెస్టో ప్రకటించారు. సుమారు రూ.350 కోట్లతో వివిధ పనులు చేపడతా అంటూ ప్రకటించారు. ఎన్నికల ముందు నుంచి ప్రధానంగా రియల్‌ఎస్టేట్‌లో అధికారపార్టీ ఎమ్మెల్యే అక్రమాలపై పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఎన్నికలకంటే ముందు కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేసీఆర్ వస్తే ప్రధానంగా రైతుల భూములు లాక్కుంటారని ప్రచారం చేయడంతో స్థానిక రైతులు ఆలోచనలో పడ్డారు. గత రెండు పర్యాయాలుగా ఓడినా ప్రజల వెంట ఉన్నట్టు చెబుతూ వచ్చారు. ఇవన్నీ అనుకూలంగా మారాయి.

తొలి నుంచి రేవంత్ ఆధిక్యం.. చివరల్లో బీజేపీ

కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి రేవంత్‌రెడ్డి సుమారు 3000 వేల ఓట్లతో ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. మొత్తం 19 రౌండ్‌లకు గాను 7 రౌండ్‌లలో ఆధిక్యం కనబరిచారు. అయితే మిగిలిన 12 రౌండ్‌లలో బీజేపీ అభ్యర్థి స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. తొలి పది రౌండ్‌ల వరకు కేసీఆర్ మూడో స్థానానికే పరిమితం కావడం గమనార్హం.

వికారాబాద్‌లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..
- కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 5 చోట్ల విజయం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ తన హవా చాటుకుంది. గతంలో ఇక్కడ బలంగా ఉన్న కాంగ్రెస్ మళ్లీ పూర్వ వైభవాన్ని సంపాదించింది. జిల్లాలో మొత్తం 12స్థానాలు ఉంటే కాంగ్రెస్ ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. ఐదు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే వికారాబాద్ జిల్లాలోని నాలుగు చోట్ల కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. గతంలో తాండూర్ తప్పా.. మిగిలినవి బీఆర్ఎస్ సిట్టింగ్ సీట్లు కావడం విశేషం.


ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, వికారాబాద్, కొడంగల్, తాండూర్, పరిగి స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, ఎల్బీనగర్ స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నంలో 15 ఏండ్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజయం సాధిస్తూ వచ్చారు. ఈసారి మాత్రం ఇక్కడ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించారు. షాద్‌నగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ విజయం సాధించారు. కల్వకుర్తిలో బీజేపీ అభ్యర్థి ఆచారిపై కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ వెంటనే టికెట్ దక్కించుకుని విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఎల్బీనగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ మధుయాష్కి పోటీ చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ ఓడిపోయారు. మహేశ్వరంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మరోసారి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములుపై మంత్రి గెలుపొందారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, కాలే యాదయ్య మళ్లీ విజయం సాధించారు. అయితే చేవెళ్లలో మాత్రం కాలే యాదయ్య స్వల్ప ఓట్లతో గెలిచారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి బీం భారత్ రీకౌంటింగ్ చేయాలని డిమాండ్ చేశారు.

కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి విజయం

కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సుమారు 32వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. వికారాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌పై మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ విజయం సాధించారు. పరిగిలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిపై కాంగ్రెస్ నేత రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు. తాండూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి విజయం సాధించారు. ఇక్కడ గతంలో రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచి అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్నికల ముందు డీసీసీబీ చైర్మెన్‌గా ఉన్న మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి తాండూర్ నుంచి గెలుపొందారు. వికారాబాద్ జిల్లాలో మూడు సిట్టింగ్ స్థానాలను బీఆర్ఎస్ కోల్పోయింది. మొత్తానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పూర్వ వైభవం సాధించగా.. బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకుంది.

తగ్గిన కేసీఆర్, హరీశ్‌రావు మెజార్టీ

హరీశ్‌రావు 82308...కేసీఆర్‌కు 45293



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల మెజార్టీ భారీగా తగ్గింది. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీతో పోల్చుకుంటే ఈ సారి తక్కువ మెజార్టీయే వచ్చింది. సిద్దిపేటలో హరీశ్‌రావు 1,05,514 ఓట్లు సాధించి ఘన విజయం సాధించారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణపై హరీశ్‌రావు 82,308 ఓట్ల మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో 1,18,699 ఓట్ల మెజార్టీ సాధించి తెలుగు రాష్ట్రాల్లో రికార్డు మెజార్టీ సాధించారు. గత మెజార్టీ కంటే ఈ సారి 36,391 ఓట్లు తగ్గాయి. ఇక్కడ పోటీ చేసిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ ముగ్గురు అభ్యర్థులు కూడా 20 వేలకు పైగా ఓట్లు పొందారు. దాంతో హరీశ్‌రావు మెజార్టీ బాగా తగ్గింది. గత ఎన్నికల్లో ఈ పార్టీ వాళ్లకు పది వేల ఓట్లు కూడా రాలేదు.

అదే విధంగా గజ్వేల్ నుంచి కేసీఆర్ మూడో సారి కూడా గెలిచారు. ఆయనకు 1,11,684 ఓట్లు వచ్చాయి. సమీప బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45,031 ఓట్ల మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి గెలిచిన ఆయనకు 50 వేల మెజార్టీ వచ్చింది. ఈ సారి ఈటల రాజేందర్ నుంచి గట్టి పోటీ ఉండటంతో కేసీఆర్ మెజార్టీ ఐదు వేలు తగ్గింది.

26 ఏండ్లకే అసెంబ్లీకి ఎన్నిక

- మెడిసిన్‌లో పీజీ చదివిన రోహిత్‌రావు


నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అతిచిన్న వయసులోనే అసెంబ్లీ మెట్లు ఎక్కిన వారిలో మైనంపల్లి రోహిత్ రావు ఒకరు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కొడుకైన మైనంపల్లి రోహిత్‌రావు విదేశాల్లో వైద్య విద్యలో పీజీ చేశారు. ఆర్నెళ్ల క్రితమే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. తండ్రి ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్ఎస్‌లో చేరి మెదక్ నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేశారు. మైనంపల్లి ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గమంతటా సేవా కార్యక్రమాలు చేశారు. విద్య, వైద్యం కోసం ఆర్థిక సహాయం చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. బీఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ చేరిన తండ్రికొడుకులిద్దరికీ టికెట్ వచ్చాయి. దాంతో మైనంపల్లి రోహిత్‌రావు మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై విజయం సాధించారు.

1997 డిసెంబర్ 1న జన్మించిన రోహిత్‌రావు వయసు 26 మాత్రమే. అతి చిన్న వయసులో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు.

అభ్యర్థుల మార్పుతో దక్కిన పరువు

అదిలేకే అనేక చోట్ల భారీ మూల్యం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన బీఆర్ఎస్ చివరిక్షణంలో తీసుకున్న నిర్ణయాలు ఆ పార్టీ పరువు కొంతమేర కాపాడాయి. ఎన్నికలకు దాదాపు నాలుగు నెలల ముందే కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అక్కడక్కడా తలెత్తిన అసంతృప్త గళాలను సర్దుబాటుచేసే ప్రయత్నం చేశారు. కాగా దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అందరికి టికెట్లు ఇస్తామంటూ తొలుత ప్రకటించిన కేసీఆర్, ఆతర్వాత నిర్ణయాలను మార్చుకోవాల్సి వచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చారు. సుమారు పది నియోజకవర్గాల్లో ఈ తరహా మార్పులు చేపట్టారు. ఇందులో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గతంలో రాజయ్య ఎమ్మెల్యేగా ఉండేవారు. కాగా అక్కడి నుంచి కడియం శ్రీహరి పోటీపడటంతో తాటికొండ రాజయ్యను మార్చారు. అక్కడి నుంచి కడియం మరోసారి అసెంబ్లీకి వస్తున్నారు. అలాగే జనగామలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్థానంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. జోగులాంబ-గద్వాల జిల్లాలోని ఆలంపూర్ అభ్యర్థి అబ్రహంను మార్చేసి విజయుడికి టికెట్ ఇవ్వడంతో ఆయన గెలుపొందారు. నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఇక్కడా విజయం సాధించారు. కోరుట్లలో కల్వకుంట్ల విద్యాసాగర్ స్థానంలో ఆయన కుమారుడు, డాక్టర్ అయిన కల్వకుంట్ల సంజయ్‌ను కొత్త అభ్యర్థిగా బరిలోకి దింపి గెలిపించారు. ఆసిఫాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుపై స్థానిక పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి టిక్కెట్ ఇవ్వడంతో ఆమె విజయతీరాలకు చేరారు. మెదక్ జిల్లాలో దుబ్బాక నుంచి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అవకాశం ఇవ్వడంతో ఆయన గెలుపొందారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కత్తిపోటుకు గురవడంతో ఆయనపై సానుభూతి పెరిగి గెలుపు సులువైంది. బోథ్‌లో రాథోడ్ బాబూరావుకు బదులు అనిల్‌జాదవ్‌కు అవకాశం ఇవ్వడంతో అక్కడా విజయం దక్కింది. గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డికి టికెట్ నిరాకరించారు. ఆయన స్థానంలో బండారి లక్ష్మారెడ్డి అవకాశం ఇవ్వడంతో అక్కడా బీఆర్ఎస్‌కు స్థానిక ఓటర్లు పట్టం కట్టారు. మల్కాజ్‌గిరిలో మైనంపల్లి హనుమంతరావు సీటు కేటాయించినా, ఆయన రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో అక్కడా గెలుపు సాధ్యమైంది. కాగా రెండు చోట్ల మాత్రం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహం ఫలించలేదు. ఖానాపూర్‌లో రేఖానాయక్ స్థానంలో జాన్సన్ నాయక్, వేములవాడలో ప్రొఫెసర్ రమేష్‌బాబు స్థానంలో చల్మెడ లక్ష్మి నర్సింహారావుకు సీట్లు కేటాయించగా అక్కడ ప్రత్యర్థులు గెలుపొందారు. కొన్ని చోట్ల స్థానిక పార్టీ శ్రేణుల ఫిర్యాదుల మేరకు అభ్యర్థులను మార్చగా, మరికొన్ని చోట్ల ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా తొలగించారు. ఇదిలావుండగా ఇదే నిఘా వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అభ్యర్థులను మార్చేసి కొత్త వాళ్లను పెడితే విజయావకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయని సూచించింది.

అప్పటికే సమయం మించిపోవడంతో అభ్యర్థులను మార్చేందుకు కేసీఆర్ సాహసించలేదు. ఆ నిర్ణయమే ఇప్పుడు బీఆర్ఎస్ కొంపముంచిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బీఆర్ఎస్ ఏడు.. కాంగ్రెస్ మూడు

- సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో నలుగురు ఓటమి.. నలుగురు గెలుపు
- తొలిసారి ఎన్నికైన.. రోహిత్‌రావు, సంజీవరెడ్డి
- మాజీ మంత్రులు దామోదర్, సునీతారెడ్డి, ఎంపీ కొత్త గెలుపు
- ఉమ్మడి మెదక్‌లో నిలుపుకున్న కారు.. మెరుగుపడిన కాంగ్రెస్
- సిట్టింగ్ సీటు కోల్పోయిన బీజేపీ
- ప్రభుత్వమొచ్చినా గెల్వని జగ్గారెడ్డి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఏడు స్థానాలు దక్కించుకోగా కాంగ్రెస్ మూడు స్థానాలకు సరిపెట్టుకుంది. గత ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో గెలిచిన బీఆర్ఎస్ ఈ సారి ఏడు స్థానాల్లో విజయం సాధించింది. గతంలో గెలిచిన రెండు సీట్లు కోల్పోయిన బీఆర్ఎస్, మరో రెండు చోట్ల బీజేపీ, కాంగ్రెస్ సిట్టింగ్ సీట్లను దక్కించుకుంది. మెదక్ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. బీజేపీ తన సిట్టింగ్ సీటును కోల్పోగా గజ్వేల్‌లో ఈటల రాజేందర్ ఓటమి పాలయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు కేసీఆర్, హరీశ్‌రావు, మాణిక్యరావు, మహిపాల్‌రెడ్డి గెలుపొందగా మరో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, రఘునందన్‌రావు, చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి ఓడిపోయారు. మాజీ మంత్రులు దామోదర రాజనర్సింహ, సునీతాలక్ష్మారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. రోహిత్‌రావు, సంజీవరెడ్డి ఇద్దరు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా సీనియర్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఓటమిపాలయ్యారు.

మెజార్టీ తగ్గిన కేసీఆర్, హరీశ్

సిద్దిపేట జిల్లాలో మూడు స్థానాల్లోనూ బీఆర్ఎస్ గెలిచింది. గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ సీఎం కేసీఆర్.. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45283 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు జైత్ర యాత్రను సాగించారు. తన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణపై 82,308 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే గత ఎన్నికల కంటే ఈ సారి ఎన్నికల్లో వారిద్దరికీ మెజార్టీ తగ్గింది. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి.. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై విజయం సాధించారు.

తొలిసారి రోహిత్ విజయం

మెదక్ జిల్లాలో రెండు స్థానాలుండగా ఒకటి బీఆర్ఎస్, మరొకటి కాంగ్రెస్ దక్కించుకున్నాయి. మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు తొలిసారి పోటీ చేయగా.. తన ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి విజయం సాధించారు.



గులాబీలు పూయిద్దాం!

ప్రేమను వ్యక్తం చేయాలన్నా, సంతోషాలను పంచుకోవాలన్నా.. ముచ్చట గొలిపే రంగుల్లో ముందుండే పూలంటే... గులాబీలే! ... ఇతర పూల ప్రత్యేకతలు ఎన్ని చెప్పినా గులాబీలకు మరేవీ సాటి రావు. అలాంటి వీటి పెంపకానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సులువుగా పెంచుకోవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా లక్షల రకాల్లో గులాబీ మొక్కలు దొరికితే, ఒక్క మన దేశంలోనే సుమారు యాభై వేల రకాలు అందుబాటులో ఉన్నాయట. ఫ్లోరీ బండా, హైబ్రీడ్, గ్రాండీఫ్లోరా, గుబురుగా ఉండేవి, తీగ జాతి, మినియేచర్, ట్రీరోజ్ అంటూ వీటిని ఏడు రకాలుగా శాస్త్రవేత్తలు విభజించారు. వీటిల్లోనే మళ్లీ రకాలుంటాయి. వివిధ రంగుల్లో ఉండే వాటిని ఇష్టాన్ని బట్టి ఎంచుకుని పెంచుకోవచ్చు చిన్నగా ఉండే మినియేచర్ గులాబీలు కానుకలుగా ఇవ్వడానికీ ఉపయోగపడతాయి.

సూర్యరశ్మి తగిలేలా...

సాధారణంగా తీసుకునే జాగ్రత్తల్లో కీలకమైనవి అంటే... ఎంత తక్కువ స్థలం ఉన్నా సరే, సాధ్యమైనంత వరకు గులాబీలను ఇతర మొక్కలతో పాటూ కలపకుండా విడిగా నాటడం మంచిది. ఇవి బంక మట్టి నేలలో చక్కగా పెరుగుతాయి. మట్టి యాభై శాతం తీసుకొని... మిగిలిన యాభై శాతం సేంద్రియ ఎరువులూ, బోన్మీల్, కోకోపీట్‌లు ఉండేలా చూసుకొని మొక్కను నాటుకోవాలి. ఇలా చేయడం వల్ల మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. ఇవన్నీ వాడినప్పుడు ఏ మట్టివాడినా మంచిదే. ఎక్కడ పెంచినా మొక్క చుట్టూ ఉన్న మట్టిని నెలకోసారి తొలిచి కొత్త మట్టిని కలుపుకోవాలి. మొక్కని నాటే ముందు దాన్ని నేరుగా నాలుగైదు గంటల పాటు ఎండ తగిలే చోట ఉంచాలి. అప్పుడే పూలు బాగా వస్తాయి. ట్రీ రోజ్ మొక్కలు మినహా మిగిలిన వాటన్నింటినీ కుండీల్లో పెంచుకోవచ్చు. అయితే కాస్త పెద్ద కుండీలను ఎంచుకొంటే మొక్క చక్కగా ఎదుగుతుంది. వానలు మొదలైన వెంటనే వీటిని నాటి, తగు జాగ్రత్తలు తీసుకుంటే చక్కగా పెరుగుతాయి.

పోషకాలు అందేలా...

బజార్‌లో వివిధ కంపెనీలకు చెందిన 'వాటర్ సాల్యుబుల్ రోజ్ మిక్స్' లభిస్తుంది. ఆ ప్యాకెట్‌పై సూచించిన మోతాదులో రోజా మిక్స్‌ని వర్షాకాలం ఆరంభంలో మట్టిలో కలుపుకోవాలి. దీన్ని మొక్కకు అందించే ముందు వేపపిండిని మట్టిలో కలుపుకొంటే ఆకులకూ, వేళ్లకూ వచ్చే చీడపీడల్ని నివారించవచ్చు. వేళ్ల దగ్గర చెక్క పొట్టూ, ఎండిన ఆకులూ, పత్తి గింజల పొడి, రంపం పొట్టు వంటివి వేస్తే మొక్కకు కావలసిన ఉష్ణోగ్రతా, వేర్లకు తగిన గాలి, తేమా అందుతాయి. సూపర్ ఫాస్ఫేటు తరుచూ చాలా తక్కువ మోతాదులో వేస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు మొక్కను కత్తిరించడం వల్ల ఆరోగ్యంగా పెరుగుతుంది.

పురుగు పట్టకుండా...

గులాబీ మొక్కలకు ఒకేసారి కాకుండా నీళ్లను నెమ్మదిగా పోయాలి. మొక్క చుట్టూ ఉన్న మట్టి అంతా తడిసేలా చూసుకోవాలి. ఆకుల్ని ఎక్కువగా తడవనీయకపోవడమే మేలు. లేదంటే ఆకులకు తెగుళ్ల వచ్చే ప్రమాదం ఉంది. వాతావరణం, పెరిగే ప్రదేశాన్ని బట్టి గులాబీ మొక్కలకు రకరకాల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నా నివారించేందుకు పరిష్కారాలున్నాయి. ప్రతి ఇరవై రోజులకోసారి కొద్దిగా సర్ఫ్ కలిపిన నీటితో ఆకుల్ని తుడవాలి. వేప, వంట నూనెలను నీళ్లల్లో కలిపి చల్లినా ఫలితం ఉంటుంది. ఆకులపై నల్ల మచ్చలు వచ్చినప్పుడు ఆర్గానిక్ ఫంగిసైడ్ చల్లితే సరి.



కష్టపడి పనిచేయడం.. మనకు ప్రత్యేకంగా నేర్పక్కర్లేదు. ఇల్లు, ఆఫీసు పనేదైనా నిబద్ధతతో చకచకా చేసుకుంటూ వెళతాం. ఎంత సంపాదించినా.. ఏ స్థాయిలో నిలిచినా చాలా మంది ఆర్థిక నిర్వహణ దగ్గరికి వచ్చేసరికి తడబడుతుంటారు. ఇది చాలా ప్రమాదం కదా! ఇల్లు, ఆఫీసు బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తాం. ఇంట్లో వాళ్లకు ఏమేం కావాలో దగ్గరుండి చూసుకుంటాం. అన్నీ ఎంత క్రమపద్ధతిగా చేసినా.. ఖాతా మాత్రం ఎలా ఖాళీ అవుతోందో తెలియట్లేదు. చాలామంది ఉద్యోగినులు ఎదుర్కొనే పరిస్థితే ఇది. అయితే ఈ నియమాలు పాటిస్తూ, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఖర్చు ఎలా అవుతుందో తెలుస్తుంది. తద్వారా పొదుపు కూడా సాధ్యమవుతుంది. మరి అవేంటో తెలుసుకుందాం...

ఈ నియమాలు పాటించండి

బడ్జెట్‌ని మూడు రకాలుగా విభజించుకోండి. నిత్యా వసర సరకులు, మందులు, గ్యాస్, కరెంటు బిల్లులు, వంటి వాటిని అత్యవసర జాబితాగా రాసుకోండి. ఈ నెల లేకపోయినా పర్లేదు అనిపించిన వాటిని మరో జాబితాగా రాసి పెట్టుకోండి. వేటికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసుకొని ఉంచుకోండి. తర్వాత పొదుపుకు ఎంత కేటాయించుకోవాలో కూడా నిర్ణయించుకోండి. అత్యవసర అవసరాలు, పొదుపు.. రెండూ పూర్తయ్యాకే మిగిలినవి అనుకుంటే సరి. ఈ తీరు ఖర్చు అదుపులో ఉంచడమే కాదు.. ప్రాధాన్యాత లను నిర్ణయించుకోవడాన్నీ అలవాటు చేస్తుంది. అయితే ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి లెక్కా ఆ పుస్తకంలో చేర్చడం మాత్రం మరవొద్దు.



అన్నీ గమనించాలి

అప్పగించిన బాధ్యత చక్కగా నిర్వహిం చామా.. వేళకి పని ముగించుకొని బయటపడ్డామా అన్నట్లే ఉంటుంది ఎక్కువ శాతం మన ఆలోచన. ఇంటి వద్ద బాధ్యతలు ఎదురు చూస్తుంటాయి కదా మరి. అలాగని ఈ చట్రంలోనే ఉండిపోతే ఎలా? చుట్టుపక్కల విషయాలూ తెలుసు కోవాలి. సంస్థలు ఉద్యోగులకు కొన్నిసార్లు ప్రత్యేకంగా మహిళలకు కొన్ని సదుపాయాలు కల్పిస్తుంటాయి. వాటి గురించి తెలుసు కోండి. హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ ప్లాన్స్, ట్యూషన్ రీయం బర్స్‌మెంట్ వంటివి చాలావరకూ సంస్థలు అందిస్తుం టాయి. వాటిలో మీకు అనువైనవి ఉపయోగించు కోవడంలో తప్పు లేదు. డబ్బు కూడా ఆదా అవుతుంది.

వేస్ట్ ఖర్చులు వద్దు

సరకులు, దుస్తుల కోసం పెద్ద షాపులు, మాల్స్‌కి వెళుతున్నారా? ఒకటి కొనాలని వెళ్తుంటాం. ఆఫర్లు, రాయితీలు ఆకర్షించేస్తాయి. తక్కువకు వస్తున్నాయని అవసరం లేకపోయినా కొంటాం. అదేమో మన బడ్జెట్‌పై ప్రభావం చూపుతుంది. కొనేముందే నిజంగా అవసరమా అని చెక్ చేసుకోండి. చాలా అవసరం అనిపిస్తేనే కొనండి. లేదంటే ఎంత తక్కువ అయినా పక్కన పెట్టేయాల్సిందే. అప్పుడే ఖర్చు కట్టడి అవుతుంది.

ప్రణాళికగా..

పిల్లల పుట్టినరోజులు, పండగలంటూ అనుకోని ఖర్చులొస్తుంటాయి. బడ్జెట్‌లో వీటికీ ముందస్తు ప్రణాళిక ఉండాలి. లేదంటే తర్వాత మనమే ఇబ్బంది పడతాం. నెలలో ప్రత్యేక దినాలు వగైరా ఉంటే ముందుగానే మార్క్ చేసుకోవాలి. వాటికీ ఎంత ఖర్చు అవుతుందనేది అంచనా వేసుకోవాలి. దాని ప్రకారం ఆ నెల ఖర్చులను ప్లాన్ చేసుకోవాలి. అప్పుడూ భారమని పించదు. ఇలా నెలపాటు ప్రణాళికతో సాగండి. తర్వాతి నెలల్లో అవసరమైతే మార్పులు చేసుకోండి. ఖర్చు ఆనుపానులు తెలియడమే కాదు.. ఆర్థిక క్రమశిక్షణా అలవడుతుంది.

తరచూ బయట తింటున్నారా..

యువతులైతే.. ఓపిక లేదనో, వంట చేసుకోడానికి సమయం లేదనో ఒక్కోసారి బయట తింటుంటారు. ఎప్పుడో ఒకసారి పర్లేదు కానీ.. తరచూ చేస్తోంటే పర్సు ఖాళీ. పైగా అనారోగ్యాలూ చుట్టుముడతాయి. ఆరోగ్యానికి హాని కలిగించని, తేలికగా చేసుకునే వీలున్న వాటిపై దృష్టిపెట్టండి. ఎక్కువ సమయం తీసుకోవు. ఆరోగ్యమూ పాడవదు. ఇంకా ఆ మిగిలిన డబ్బులతో ఏదైనా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ చేసుకోవచ్చు.

అవసరమే కానీ..

వారమంతా పనిచేస్తుంటే శరీరం, మనసు అలసిపోవడం మామూలే. ఆఫీసు ముగిశాక సేదదీరు దామని సహోద్యోగులు పిలవగానే మనసు అటుకేసి వెళ్లడమూ సాధారణమే. అలాగని బడ్జెట్ మరవట్లేదు కదా? ఏ ఒక్కరి ఆర్థిక అవసరాలూ ఒకలా ఉండవు. ఎదుటివారు ఖర్చు పెడుతున్నారనో.. వాళ్లముందు పరువు తక్కువనో అవసరం ఉన్నవీ లేనివీ కొనేయొద్దు. అమ్మాయిలం షాపింగులో పడితే సమయమే తెలీదు. తీరా గమనించుకునే సరికే ఖాతా ఖాళీ అయిపోతుంది. వెళ్లాల్సి వస్తే ఇంత బడ్జెట్ అని పెట్టుకోండి. అదీ నెలకు రెండుసార్లకు మించకపోతే మంచిది. నిజంగా సేద తీరాలంటే ఏ పార్క్‌లో నడకకో, ఆటలకో ప్రాధాన్యమిస్తే సరి. ఆనందంతో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుంది.

కొత్తగూడెంలో కూనంనేని జయభేరి



(మొదటిపేజీ తరువాయి)

8 గంటలకు బ్యాలెట్ ఓట్లతో ప్రారంభమైన ఓట్ల లెక్కింపు సాయంత్రం నాలుగున్నర గంటల వరకు కొనసాగింది. ఫలితాలను ఊరించడంలో అధికారులు కొంత జాప్యం చేశారు. కూనంనేని సాంబశివరావుకు 79,155 ఓట్లు రాగా జలగం వెంకట్రావుకు 52,971, వెంకటేశ్వరరావుకు 37,226 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపును జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక, కమల్ కిషోర్ పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు 14 టేబుల్ ద్వారా 19 రౌండ్లలో జరిగింది. కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 2,43,846 ఓట్లు ఉండగా 1,86,347 ఓట్లు పోలయ్యాయి. 76.56శాతం పోలింగ్ జరిగింది

నియంత పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారు : కూనంనేని సాంబశివరావు

రాష్ట్రంలో నియంత పాలనకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పారని కొత్తగూడెం నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు చెప్పారు. గెలిచిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేండ్లుగా ఉద్యమాలను అణిచివేసి నియంత పాలన కొనసాగించారన్నారు. అణచివేత ధోరణిని క్షమించరని తెలిపారు. అందుకు నిదర్శనం శాసనసభ ఎన్నికల ఫలితాలే నిరూపించాయని చెప్పారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మఖ్దూంభవన్‌లో సంబురాలు

కూనంనేని విజయాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సంబురాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకుని బాణాసంచా కాల్చుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, ఎన్ బాలమల్లేష్, నాయకులు బొమ్మగాని ప్రభాకర్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు. నిరంకుశ పాలనపై ప్రజలు గెలిచారని చాడ అన్నారు.

అసెంబ్లీకీ 15 మంది డాక్టర్లు

(మొదటిపేజీ తరువాయి)

ఒకరు బీజేపీ, ముగ్గురు బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. వారిలో కాంగ్రెస్ అభ్యర్థులు డాక్టర్ రామ్ చందర్ నాయక్ (డోర్నకల్), డాక్టర్ వంశీ కృష్ణ (అచ్చంపేట), డాక్టర్ మురళీ నాయక్ (మహబూబాబాద్), డాక్టర్ సత్యనారాయణ (మానకొండూరు), డాక్టర్ మైనంపల్లి రోహిత్ (మెదక్), డాక్టర్ పర్ణిక రెడ్డి (నారాయణపేట్), డాక్టర్ సంజీవ రెడ్డి (నారాయణఖేడ్), డాక్టర్ వివేక్ వెంకటస్వామి (చెన్నూరు), డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి (నాగర్ కర్నూల్), డాక్టర్ భూపతి రెడ్డి (నిజామాబాద్ రూరల్), డాక్టర్ రాగమయి (సత్తుపల్లి) ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి డాక్టర్ తెల్లం వెంకట్రావు (భద్రాచలం), డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల), డాక్టర్ సంజయ్ (జగిత్యాల), బీజేపీ నుంచి డాక్టర్ పాల్వాయి హరీశ్ (సిర్పూర్) విజయాన్ని సాధించారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థులు వత్తిరీత్యా డాక్టర్లు కావడం విశేషం. మొత్తం అసెంబ్లీలోనే 17.85 శాతంగా ఉండటం గమనార్హం.

అసెంబ్లీకి అతివలు..

(మొదటిపేజీ తరువాయి)

సాధించగా ఈ పర్యాయం వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. వీరిలో నలుగురు తొలిసారిగా ఎన్నికైనవారే ఉండటం విశేషం. కొత్తగా విజయం సాధించినవారిలో కంటోన్మెంట్(ఎస్సీ) నుంచి లాస్య నందిత, పాలకుర్తిలో మామిడాల యశస్విని, నారాయణ్‌పేట్‌లో పర్ణికారెడ్డి, సత్తుపల్లి(ఎస్సీ)లో మట్టా రాగమయి ఉండగా, ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి, నర్సాపూర్‌లో సునితా లక్ష్మారెడ్డి, మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి, వరంగల్ తూర్పులో కొండా సురేఖ, ములుగులో సీతక్క, కోదాడలో పద్మావతి రెడ్డి మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. గత ఎన్నికల్లో సబితా ఇంద్రారెడ్డి, గొంగిడి సునిత, హరిప్రియా నాయక్, రేఖా నాయక్, సీతక్క, పద్మా దేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఏడుగురు మహిళలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించించగా, వారిలో లాస్య నందిత, కోవ లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి మాత్రమే విజయం సాధించడం గమనార్హం.

తాజా ఎన్నికల్లో భారీసంఖ్యలో మహిళలు పోటీ చేశారు. అయితే గెలిచింది మాత్రం తొమ్మిది మందే. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సైతం అనేకమంది ఎన్నికల గోదాలోకి దిగారు. వీరిలో ఎక్కువ మంది ఓటమి పాలుకావడం గమనార్హం. కొందరు జనరల్ స్థానాల్లో పోటీచేయగా, మరికొందరు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్నారు. వీరిలో మహేశ్వరం నుంచి విద్యాశాఖ మంత్రి పి. సబితాఇంద్రారెడ్డి మరోసారి గెలుపొందారు. ఆమె ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్సార్ హయాంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి భార్యగా బరిలోకి దిగిన సబిత, గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన విషయం విదితమే. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మామిడాల యశస్విని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించారు. యశస్విని తొలిసారి ఎన్నికల్లో పోటీచేశారు. ఇది రాష్ట్రంలో సంచలనంగా మారింది.

టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన దయాకర్‌రావును ఓడించేందుకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి యశస్విని తరపున భారీగా ప్రచారం చేశారు. కంటోన్మెంట్(ఎస్సీ) స్థానం నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత గద్దరు కూతురు డాక్టర్ జీవి వెన్నెలపై గెలుపొందారు. కాంగ్రెస్ నేతలు సరిగ్గా సహకరిం చకపోవడం వల్లే ఓడిపోయానని ఫలితాల అనంతరం వ్యాఖ్యానించారు. ములుగు నుంచి ధనసరి అనసూయ (సీతక్క) మూడో సారి గెలిచి హాట్రిక్ సాధించారు. ఆమెకు కాంగ్రెస్ మంత్రి వర్గంలో మహిళల కోటాలో ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారనే ప్రచారం గాంధీభవన్‌లో జరుగుతున్నది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి నర్సాపూర్ నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. విజయం సాధించారు. గత ఎన్నికలో ఓడిపోయిన కోవ లక్ష్మి ఈసారి తన సత్తా చాటి బీఆర్ఎస్ తరపున గెలిచారు. మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. కోదాడ నుంచి



ఎన్.పద్మావతి మళ్లీ అసెంబ్లీకి రానున్నారు. గత ఎన్నికల్లో ఓడిన సంగతి తెలిసిందే. అలాగే సత్తుపల్లి(ఎస్సీ) మట్టా రాగమయి మాజీ టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను ఓడించి సంచలనం సృష్టించింది.

ఇకపోతే పోటీచేసి ఓడిపోయిన ప్రముఖల్లో ఖైరతాబాద్ నుంచి పీజేఆర్ కూతురు విజయారెడ్డి, మెదక్ నుంచి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, గోషామహల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సునీతారావు, చొప్పదండి నుంచి బీజేపీ తరపున బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బాల్కొండ నుంచి మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై పోటీచేసిన ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ, ఇల్లెందు(ఎస్సీ) నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, కేటీఆర్‌పై బీజేపీ నుంచి పోటీచేసిన జర్నలిస్టు రాణిరుద్రమరెడ్డి, హుజుర్‌నగర్ నుంచి సీపీఐ(ఎం) తరపున పోటీచేసిన మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఉన్నారు. ఇకపోతే కొల్లాపూర్ నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా రంగంలో ఉన్న కర్నె శిరీష(బర్రెలక్క) విజయం సాధించడంలో విఫలమయ్యారు.

డీజీపీపై ఈసీ వేటు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, మరో ఇద్దరు అదనపు డీజీలు మహేశ్ భగవత్ (సీఐడీ అదనపు డీజీ), సంజయ్ కుమార్ జైన్ (రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ)లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ జారీ చేసిన తాజా ఉత్తర్వులు ఐపీఎస్ వర్గాల్లో కలకలం రేపింది. కాగా నూతన డీజీపీగా రవిగుప్తా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాల్లోకెళ్తే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధిక్యాన్ని సూచిస్తూ ఫలితాలు వెల్లడవుతున్న సమయంలో దాదాపు పన్నెండు గంటల ప్రాంతంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌తో పాటు అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్‌లు జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అంతేగాక, 9వ తేదీన ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల గురించి కూడా చర్చించి అక్కడి నుంచి వెళ్లినట్టు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా రాజకీయ నాయకులను కలవరాదనే నిబంధనలు డీజీపీ అంజనీకుమార్ ఉల్లంఘించారంటూ ఆయనను వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, డీజీపీ వెంట వెళ్లిన ఇద్దరు అదనపు డీజీలకు తాము ఎందుకు అక్కడకు వెళ్లారో సమాధానమివ్వాలంటూ ఆ ఇద్దరు అధికారులకు కూడా నోటీసులను జారీ చేసింది. ఎన్నికల కమిషన్ జారీ చేసిన తాజా ఆదేశాలు రాష్ట్ర పోలీసు శాఖలో కలకలం రేపాయి. అప్పటికే ఈ ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు రేవంత్‌రెడ్డిని కలవటంపై ఐపీఎస్ వర్గాల్లో చర్చ సాగింది.

ఎన్నికల వేళ పోలీసు అధికారుల బదిలీలు, సస్పెండ్‌లు

ఇదిలా ఉంటే, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నగర పోలీసు కమిషనర్‌గా ఉన్న సి.వి ఆనంద్, వరంగల్ కమిషనర్ రంగనాథ్, కరీంనగర్ కమిషనర్ సుబ్బారాయుడు, నిజామాబాద్ కమిషనర్ సత్యనారాయణతో పాటు 23 మంది ఎస్పీలను ఈసీ బదిలీ చేసింది. అనంతరం, సోదాల సందర్భంగా దొరికిన డబ్బులకు సంబంధించి అసలు నిందితుడి పేరును కప్పి పుచ్చటానికి ప్రయత్నించారనే ఆరోపణలపై నగర సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌లను కూడా ఈసీ సస్పెండ్ చేసింది.

ఇన్‌చార్జ్ డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారి?

ఇదిలా ఉంటే, ఎన్నికల ఫలితాలు వెల్లడై రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్రంలో శాంతి భద్రతను పర్యవేక్షించాల్సిన డీజీపీ పోస్టు ఖాళీగా ఉండకుండా ప్రత్యామ్నాయ చర్యలపై ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టిని సారించినట్టు తెలిసింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన డీజీపీ పోస్టుకు సీనియర్ ఐపీఎస్‌ను ఎంపిక చేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అయితే, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయటం, కొత్త కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయటానికి సమయం పడుతుండటంతో అప్పటి వరకు తాత్కాలికంగా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని ఇన్‌చార్జ్ డీజీగా నియమించే అవకాశాలున్నాయని ఐపీఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకోసం రాష్ట్రంలో ప్రస్తుతం డీజీపీ స్థాయి హోదాలో ఉండి రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా ఉన్న జితేందర్, రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్ జనరల్ రవి గుప్తాలు ఎంపిక చేయగా..రవి గుప్తాను రాష్ట్ర డీజీపీగా నియమించింది.

ఆరుగురు మంత్రులు ఇంటికి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో 88 నియోజకవర్గాల్లో విజయంసాధించిన బీఆర్ఎస్ ఈసారీ 39 స్థానాలకే పరిమితమైంది. సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులకూ పరాభవం తప్పలేదు. కొందరు మంత్రులు విజయం సాధించినా, గతంలోని మెజారిటీ మాత్రం దక్కకపోవడం గమనార్హం. తాజా ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నియోజకవర్గం కేసీఆర్ పోటీచేశారు. గజ్వేల్‌లో మరోసారి గెలవగా, కామారెడ్డిలో రెండోస్థానానికి పరిమితమయ్యారు. కేసీఆర్‌ను పక్కనబెడితే మొత్తం 17 మంది మంత్రులకు టికెట్లు దక్కాయి. ఈసారి ఎన్నికల్లో ఆరుగురు మంత్రులకు షాక్ తగిలింది. నిర్మల్ నుంచి బరిలోకి దిగిన ఇంద్రకరణ్‌రెడ్డి, ధర్మపురి నుంచి నిలబడ్డ కొప్పుల ఈశ్వర్, పాలకుర్తి నుంచి పోటీచేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, వనపర్తి నుంచి రంగంలో ఉన్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్, మహబూబ్‌నగర్ వి. శ్రీనివాస్‌గౌడ్ ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల్లో 441 ఓట్లతో గట్టెక్కిన కొప్పుల ఈశ్వర్, ఈసారి మాత్రం ఓటమిని తప్పించుకోలేకపోయారని బీఆర్ఎస్ శ్రేణులు వ్యాఖ్యానించడం గమనార్హం.

2018 శాసనసభ ఎన్నికల్లో 53 వేల ఓట్లతో విజయం సాదించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈసారి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. అలాగే 51 వేల ఓట్లతో గెలిచిన నిరంజన్‌రెడ్డి, ఈమారు కాంగ్రెస్ అభ్యర్థి టి మేఘారెడ్డి చేతిలో, ఇంతకుముందు 57 వేల ఓట్లతో విజయం సాధించిన శ్రీనివాస్‌గౌడ్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిపై ఓడిపోయారు. ఇంతకుముందు మంత్రులుగా పనిచేసిన వారిలో కేటీఆర్, టి. హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పి సబితారెడ్డి, గంగుల కమలాకర్ మరోసారి గెలుపొందారు. తలసాని, సబిత మెజారిటీలు గతం కంటే మెరుగయ్యాయి. సబితారెడ్డికి గతంలో తొమ్మిది వేల ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు 26 వేలకు పెరిగింది. తలసానికి గతంలో 30 వేల ఆధిక్యం రాగా, ఇప్పుడు 41 వేలతో విజయం సాధించారు. సిద్ధి పేట నుంచి పోటీచేసిన మంత్రి హరీశ్‌రావు మరోసారి సత్తా చాటారు. 2018లో ఆయనకు 1.18 లక్షల ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు 82 వేలకు తగ్గింది. సిరిసిల్ల నుంచి బరిలో ఉన్న కేటీఆర్‌కు గతంలో 89 వేలు రాగా, ఇప్పుడు 30 వేల మెజారిటీ మాత్రమే వచ్చింది. మేడ్చల్ మల్లారెడ్డికి గతంలో 89 వేలు రాగా, ఇప్పుడు 33 వేలు మాత్రమే దక్కింది. గంగుల కమలాకర్ ఇంతకుముందు 14వేల ఓట్ల మెజారిటీకి గాను, ఇప్పుడు కేవలం 300 ఓట్లతో బండి సంజయ్‌పై గెలుపొందారు. మిగతా మంత్రులకు సాధారణ మెజారిటీలు వచ్చాయి.

నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూ కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేసినట్టు చెప్పారు. పార్టీ అభ్యర్థుల గెలపుకోసం కృషి చేసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. 119 స్థానాలకు గాను ప్రజలు 39 స్థానాలు ఇచ్చి ప్రతిపక్ష పాత్ర పోషించమని ఆదేశించారని చెప్పారు. ఓటమిని గుణపాఠంగా తీసుకుని..పాఠాలు నేర్చుకుంటామన్నారు. 23 ఏండ్లలో ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయని గుర్తు చేశారు. ప్రజల దయతో రెండు పర్యాయాలు అధికారం చేపట్టామన్నారు. అదివారం నాటి ఫలితాలు కొంత నిరాశపర్చినా..బాధలేదన్నారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజమని తెలిపారు. నాయకులు, కార్యకర్తల కృషి, పోరాట ఫలితంగానే బీఆర్ఎస్ 39 సీట్లు గెలుచుకుందన్నారు. ప్రతిపక్ష పాత్రలో కూడా అలవోకగా ఇమిడిపోతామని తెలిపారు. ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా పనిచేస్తామని చెప్పారు. మా పార్టీ శ్రేణులతో పాటు అడుగడుగునా అండగా నిలబడిన, సహకరించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత చాలా అవసరమన్నారు. గెలుపైనా, ఓటమైనా ఒకేరకంగా తీసుకోవాలని కేసీఆర్ నేర్పించారని గుర్తుచేశారు. గతంలో కంటే రెట్టింపుగా కష్టపడతామన్నారు. కార్యకర్తలు ఎవరూ నిరాశపడొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నడపాలని కేటీఆర్ కోరారు.

ప్రగతి భవన్...ఇక నుంచి ప్రజాభవన్

ఇకపై సామాన్యులకు సచివాలయం గేట్లు తెరిచే ఉంటాయి

- ఈ విజయం అమరవీరులకు అంకితం
- ప్రజల తీర్పునకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా... : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రగతిభవన్‌ను...ఇక నుంచి ప్రజాభవన్‌గా మారుస్తామని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పును అమరులకు అంకితం ఇస్తున్నట్టు తెలిపారు. ప్రజల తీర్పుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో గాంధీభవన్‌కు వచ్చిన రేవంత్...ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, వీహెచ్, విజయశాంతి తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. డిసెంబర్ 3, 2009న శ్రీకాంతచారి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఇవాళ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చి శ్రీకాంతాచారికి ఘన నివాళులర్పించారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞత తెలిపే అవకాశం ఇచ్చినందుకు ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి మాపై మరింత బాధ్యతను పెంచారని చెప్పారు. భారత్ జోడో యాత్ర ద్వారా తెలంగాణలో రాహుల్ గాంధీ స్ఫూర్తిని నింపారని గుర్తు చేశారు. తెలంగాణతో తమది కుటుంబ అనుబంధమని చెప్పి రాహుల్ గాంధీ ప్రజల్లో విశ్వాసం నింపారని కొనియాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అండతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు హేతుబద్ధంగా వాదించేందుకు కాంగ్రెస్ అవకాశమిస్తుందన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కార్యక్రమానికి విపక్షాలతోపాటు అందరినీ ఆహ్వానిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంలో సీపీఐ, జనసమితితోపాటు సీపీఐ(ఎం)ను కూడా కలుపుకునిపోతామనీ, వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. కూటమి గెలుపుకు సహకరించినందుకు సీపీఐ, కోదండరాంకు కతజ్ఞతలు చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. ప్రజా తీర్పును బీఆర్ఎస్ శిరసావహించాలని కోరారు. ప్రభుత్వ ఏర్పాటుకు వారి వైపు నుంచి సహకారం ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. పరిపాలన ఇక గతంలోలా ఉండబోదని హామీ ఇచ్చారు. సచివాలయ గేట్లు సామాన్యులకు తెరిచే ఉంటాయన్నారు. సామాన్యలకు అందులో ప్రవేశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ను అభినందిస్తూ ట్వీట్ చేసిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



హ్యాట్రిక్ వీరులు

బీఆర్ఎస్ నుంచి 15, కాంగ్రెస్ నుంచి ఇద్దరు

- ఎంఐఎం నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరు

20 మంది వరుసగా మూడోసారి విజయం

- డబుల్ హ్యాట్రిక్ కొట్టిన హరీశ్ రావు, అక్బరుద్దీన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో 21 మంది అభ్యర్థులు హ్యాట్రిక్ కొట్టి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నుంచి 15 మంది ,కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, ఎంఐఎం నుంచి ముగ్గురు మూడు సార్లు వరుస విజయాలు నమోదు చేసుకున్నారు. సిద్దిపేట నుంచి హరీశ్ రావు వరుసగా ఏడు సార్లు, చాంద్రాయణ గుట్ట నుంచి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వరుసగా ఆరు సార్లు విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 2014, 2018తో పాటు తాజాగా గెలిచి వరుస విజయాలను సాధించారు.1985 నుంచి 2004 వరకు సిద్దిపేట నుంచి ఆరు సార్లు గెలిచారు. ఇప్పటి వరకు 9 సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా గెలిచి అరుదైన రికార్డును కేసీఆర్ తన ఖాతాలో వేసుకున్నారు. అయితే తాజాగా గజ్వేల్ నుంచి గెలిచిన ఆయన కామారెడ్డి నుంచి ఓటమి పాలయ్యారు. సిద్దిపేట నుంచి మరో అరుదైన రికార్డును హరీశ్‌రావు సొంతం చేసుకున్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు మొత్తం మూడు ఉప ఎన్నికలతో కలిపి ఏడు సార్లు విజయం సాధించారు. చాంద్రాయణ గుట్ట నుంచి ఎంఐఎంగా అభ్యర్థిగా ఆరు సార్లు గెలిచి అక్బరుద్దీన్ ఓవైసీ డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి 2004 నుంచి బాన్సువాడ ఎమ్మెల్యేగా వరుసగా ఐదు సార్లు విజయ సాధించారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ 2014 నుంచి వరుస విజయాలను నమోదు చేసుకున్నారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్ నగర్ నుంచి, బాల్కొండ నుంచి ప్రశాంత్ రెడ్డి, సిరిసిల్ల నుంచి కేటీఆర్, సూర్యపేట నుంచి జగదీష్ రెడ్డి, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్‌లు హ్యాట్రిక్ కొట్టారు. శేరిలింగంపల్లి నుంచి అరికెపుడి గాంధీ, రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్ గౌడ్, జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపినాథ్, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ.వివేకానంద, కూకట్ పల్లి నుంచి మాధవరం క్రిష్ణారావు 2014లో టీడీపీ నుంచి, 2018 తోపాటు ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి మల్లు బట్టి విక్రమార్క మధిర నుంచి నాలుగు సార్లు, ములుగు నుంచి సీతక్క మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. మలక్ పేట నుంచి అహ్మద్ బలాల, కార్వాన్ నుంచి కౌసర్ మొహియొద్దీన్‌లు ఎంఐఎం నుంచి వరుస విజయాలను సాధించారు. బీజేపీ నుంచి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ 2014 నుంచి మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించాడు.

మూడు చోట్ల తప్పిన ఉపఎన్నిక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్




రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తెలివైన తీర్పు నేపథ్యంలో మూడు నియోజకవర్గాల్లో ఉప ఉన్నిక తప్పినట్టయింది. గజ్వేల్, కామారెడ్డి, హుజురాబాద్ స్థానాల్లో ఓటర్లు ఉప ఉన్నికను తప్పించారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మూడు చోట్ల నుంచి ముగ్గురు ప్రధాన పార్టీల నేతలు పోటీకి దిగడంతో అందరికీ ఆసక్తి ఏర్పడింది. ఒక్కొక్కరు రెండేసి చోట్ల నుంచి పోటీచేసేందుకు ఎన్నికల మార్గదర్శకాలు అనుమతిస్తాయి. ఒకవేళ గెలిస్తే ఈ రెండు చోట్లా ఒక్కరే ఎమ్మెల్యేగా కొనసాగడం సాధ్యం కాదు. దీంతో ఏదో ఒక నియోజకవర్గానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అందుకే ఓటర్లు తెలివిగా వ్యవహరించారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ మూడు స్థానాల్లో ఎక్కడా ఉప ఎన్నిక రాకుండా జాగ్రత్త పడ్డారని అంటున్నవారు లేకపోలేదు. సీఎం కేసీఆర్‌కు చాలా కాలంగా గజ్వేల్ స్థానంలోనే కొనసాగుతున్నారు. ఆయన ఈసారి అక్కడి నుంచేగాక కామారెడ్డిలోనూ పోటీచేశారు. మరోవైపు రేవంత్‌రెడ్డి సైతం ఇక్కడి నుంచి బరిలో ఉన్నారు. ఇద్దరూ స్థానికేతరులే. దీంతో స్థానిక ఓటర్లు బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డిని ఎన్నుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో కేసీఆర్ గజ్వేల్‌కే పరిమితమయ్యారు. అలాగే మరోసారి కోడంగల్ నుంచి ఎన్నికల్లో పోటీచేసిన రేవంత్, కాంగ్రెస్ అధిష్టానం సూచనతో కామారెడ్డి నుంచి కూడా నామినేషన్ వేశారు. కేసీఆర్‌కు పోటీగా రేవంత్ బరిలో ఉండటంతో ఈ స్థానంలో రాజకీయం ఆసక్తిగా మారింది. కాగా, రేవంత్‌కు తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గెలిపించిన ఓటర్లు, కామారెడ్డిలో మూడోస్థానానికి పరిమితం చేశారు. ఇకపోతే ఈటల రాజేందర్ రెండు చోట్లా పోటీచేశారు. ఆయన సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌తోపాటు గజ్వేల్‌లోనూ పోటీలో ఉన్నారు. ఒకవేళ రెండు చోట్లా గెలిస్తే ఏ స్థానాన్ని వదులుకుంటారో తెలియని ఆయోమయం ఓటర్లల్లో నెలకొందనే ప్రచారం చోటుచేసుకుంది. దీంతో ఈటల స్థానికంగా అందుబాటులో ఉండకపోవచ్చనే కారణంగా బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించడం గమనార్హం.

గ్రేటర్‌లో కారు హవా..!

- ప్రభావం చూపని కాంగ్రెస్
- పదిలంగా ఎంఐఎం కోటా
- పలు స్థానాల్లో బీజేపీ గట్టి పోటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



గ్రేటర్ హైదరాబాద్‌లో కారు హవా కొనసాగింది. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచినా.. గ్రేటర్ ప్రజలు మాత్రం కారుకే జై కొట్టారు. మొత్తం 24 స్థానాలకుగాను 16స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం కేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేపోయింది. ఖైరతాబాద్, ముషీరాబాద్, జూబ్లీహిల్స్ స్థానాలు కచ్చితంగా గెలుస్తుందని పార్టీ, ఆపార్టీ సర్వేల్లో సైతం తెల్చినా చివరికి అక్కడి ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపారు. ఇకపోతే మజ్లిస్ ఎప్పటిలాగే తన కోటాను పదిలంగా కాపాడుకుంది. మొత్తం తొమ్మిది స్థానాల్లో పోటీ చేసినప్పటికీ.. పాత ఏడు స్థానాలను తిరిగి కైవసం చేసుకుంది. అయితే కౌంటింగ్ నాలుగైదు రౌండ్లు వరకు చార్మినార్, బహుదూర్‌పురా, కార్వాన్ సెగ్మెంట్‌లలో బీజేపీ ఎంఐఎంకు గట్టిపోటీనిచ్చింది. మరోసారి నాంపల్లిలో కాంగ్రెస్, ఎంఐఎం మధ్యే పోటీ సాగింది. ఇక గోషామహల్‌లో ఎప్పటిలాగే బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌కు అక్కడి ప్రజలు పట్టం కట్టారు.

మజ్లిస్ ఏడుకు ఏడు సీట్లలో గెలుపు

మజ్లిస్ పార్టీ తన కంచుకోటకు బీటలు వారకుండా కాపాడుకుంది. చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, కార్వాన్, మలక్‌పేట, బహదూర్‌పుర, నాంపల్లి సెగ్మెంట్లలో తిరిగి పాగా వేసింది. అయితే ఈసారి నగర శివారు ప్రాంత నియోజకవర్గమైన రాజేంద్రనగర్ సెగ్మెంట్ నుంచి మందగిరి స్వామి యాదవ్ పోటీ చేసినప్పటికీ అక్కడ సిట్టింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ మరోసారి విజయం సాధించారు. కానీ ఇక్కడ ముస్లిం ఓటర్లు 48 శాతం ఉండటం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఓట్లు చీల్చుకుంటే మజ్లిస్ పార్టీ అభ్యర్థి సునాయసంగా గెలుపు అవకాశాలు ఉండేవి. కానీ అనూహ్యంగా రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి నిలిచారు. ఇక చాంద్రాయణగుట్ట, చార్మినార్, యాకుత్‌పుర, బహదూర్‌పుర, మలక్‌పేట, కార్వాన్ సెగ్మెంట్లలో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. హోరాహోరీ పోరులో నాంపల్లి సెగ్మెంట్‌ను మజ్లిస్ మళ్లీ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేశారు.

నవచిత్రం

మనసుని కదిలించే పాట..


మానస చౌదరి, రోషన్ కనకాల

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల నటిస్తున్న తొలి చిత్రం 'బబుల్‌గమ్'. ఈ సినిమా ఇప్పటికే హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. మేకర్స్ ఇప్పటివరకు విడుదల చేసిన టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. శ్రీచరణ్ పాకాల ఈ సినిమా కోసం చార్ట్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. ఫస్ట్ సింగిల్ జిలేబి, సెకండ్ సింగిల్ ఇజ్జత్ పాటలు ట్రెమండస్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్‌లో టాప్ ట్రెండింగ్‌లో ఉన్నాయి.

తాజాగా మేకర్స్ 'బబుల్‌గమ్' థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం నుంచి మూడో పాట 'జాను'ని ఈనెల 6న విడుదల చేయనున్నారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ చాలా ఎట్రాక్టివ్‌గా ఉంది. ఈ పాట మనసుని కదిలించే మెలోడీగా ఉండబోతుంది.

క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల చిత్రాలతో ఎక్స్‌ట్రార్డినరీ వర్క్‌తో ఆకట్టుకున్న దర్శకుడు రవికాంత్ పేరెపు మనసుని హత్తుకునే జెన్జీ ప్రేమకథతో ప్రేక్షకులను కట్టిపడేసేలా "బబుల్‌గమ్"ను అద్భుతంగా తెరకెక్కించారు. మానస చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం సరికొత్త రొమాంటిక్ జర్నీతో ప్రేక్షకులని ఆకట్టుకోనుంది. ప్రతిభావంతులైన తారాగణం, అద్భుతమైన టెక్నికల్ టీంతో తెలుగు సినిమా ప్రపంచంలో తప్పక చూడవలసిన చిత్రంగా వుండబోతుంది.

గరుడవేగ, తెల్లవారితే గురువారం, ఆకాశవాణి చిత్రాలకు పనిచేసిన సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్ కాగా, 'తల్లుమల' ఫేమ్ కేరళ స్టేట్ అవార్డ్ విన్నర్ నిషాద్ యూసుఫ్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది.

'ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. కంటెంట్ బాగున్న సినిమాలను మన తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. ఆ కోవలో ఉన్న మా చిత్రానికి కూడా మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని మేకర్స్ తెలిపారు.

హర్ష చెముడు, కిరణ్ మచ్చ, అనన్య ఆకుల, హర్షవర్ధన్, అను హాసన్, చైతు జొన్నలగడ్డ, బిందు చంద్రమౌళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: రవికాంత్ పేరేపు, కథ: రవికాంత్ పేరెపు, విష్ణు కొండూరు, సెరి-గన్ని, సంగీతం: శ్రీచరణ్ పాకాల, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతు, ఆర్ట్ డైరెక్టర్: విఠల్ కొసనం, ప్రొడక్షన్ డిజైన్: శివమ్ రావు, స్క్రీన్ ప్లే కన్సల్టెంట్: వంశీ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దివ్య విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధులిక సంచన లంక.

మిమ్మల్ని కూడా వెంటాడుతాయి


అవికా గోర్

సరికొత్త కంటెంట్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ అందిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ 'వధువు'. ఈ వెబ్ సిరీస్‌లో అవికా గోర్, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటించారు. ఈ వెబ్‌సిరీస్‌ను ఎస్వీఎఫ్ బ్యానర్‌లో శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మించారు. పోలూరు కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది.

ఈ సందర్భంగా ఈ వెబ్‌సిరీస్ హైలైట్స్, ఇందులో నటించిన అనుభవం గురించి నాయిక అవికా గోర్ మీడియాతో ముచ్చటించారు.

- డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఇటీవల 'మాన్సన్ 24' అనే వెబ్ సిరీస్‌లో నటించాను. అదే టైమ్‌లో ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పారు. బెంగాలీ సక్సెస్ ఫుల్ వెబ్ సిరీస్ 'ఇందు'ను తెలుగులోకి 'వధువు'గా తీసుకొస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. ఎందుకంటే ఇలాంటి స్క్రిప్ట్‌లో నేను ఇప్పటిదాకా నటించలేదు. నేను గతంలో చేసిన బబ్లీనెస్ ఉండదు. ఒక యూనిక్ క్యారెక్టర్ దొరికింది.
- ఈ వెబ్ సిరీస్‌లో హర్రర్ ఎలిమెంట్స్ ఉంటాయా అని అందరూ అడుగుతున్నారు. ఇందులో హర్రర్ ఎలిమెంట్స్ ఉండవు. థ్రిల్లర్ జోనర్‌లోనే ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది. మీరు ట్రైలర్‌లో చూసినట్లు మిస్టరీ సన్నివేశాలు ఉంటాయి. టీవీలో సీరియల్స్ చేసిన అనుభవం నాకు ఉంది. టీవీ ఆడియెన్స్‌కు ఎలాంటి కంటెంట్ ఇష్టమో..అది ఇందులో ఉంటుంది. ఇప్పటిదాకా ఓటీటీ చూడకుండా టీవీ కంటెంట్ ఇష్టపడేవారు ఈ సిరీస్ కోసం ఓటీటీకి వస్తారనే నమ్మకం ఉంది. ఆ సెక్షన్ ఆడియెన్స్‌ను బాగా ఆకర్షించబోతున్నాం.
- ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు అందులోని ప్రశ్నలు నాకు ఇంట్రెస్టింగ్‌గా అనిపించాయి. ఇలా ఎందుకు జరిగింది అనే ఎన్నో ప్రశ్నలు స్క్రిప్ట్‌లో ఉంటాయి. అవన్నీ ఆడియెన్స్‌కు కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తాయి. బెంగాలీ ఒరిజినల్ వెబ్ సిరీస్ 'ఇందు'లోని కొన్ని ఎపిసోడ్స్ చూశాను. మొత్తం చూస్తే నేను ఇందులా నా వెర్షన్‌లో సహజంగా నటించలేనేమో అనిపించింది. ఈ స్క్రిప్ట్‌లోని సస్పెన్స్ ఆకట్టుకుంటుంది.
- చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ చేసేప్పుడు నాకు పదేళ్ల వయసు. అప్పటికి పెళ్లంటే ఏంటి?, పెళ్లి కూతురు ఎలా ఉండాలి, ఇంట్లో ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై ఏమాత్రం అవగాహన లేదు. సందేహాలు వస్తే డైరెక్టర్‌ను అడిగేదాన్ని. ఇప్పుడు ఈ వెబ్ సిరీస్ చేస్తున్నప్పుడు అలాంటి ఇబ్బంది లేదు. పెళ్లి, వధువు అంటే ఏంటి అనే విషయాలు తెలుసు. చిన్నప్పుడే నటిగా మారడం వల్ల త్వరగా అన్ని విషయాలు నేర్చుకోగలిగా. అయితే నటిగా మారడం వల్ల ప్రతి రోజూ ఒక కొత్త లైఫ్ చూస్తున్నా.
- ఇప్పటిదాకా నేను ఆన్ స్క్రీన్ పై కనీసం ఇరవై సార్లు పెళ్లి చేసుకుని ఉంటా. అయితే ఇది బోర్ కొట్టలేదు. పెళ్లి కూతురిలా చీర కట్టుకుని, హెయిర్ స్టైల్ చేసుకుని మేకప్ కావడం నాకు ఇష్టం(నవ్వుతూ).

ఆటలు

చెలరేగిన శ్రేయస్

రాణించిన జితేశ్, యశస్వి

భారత్ స్కోరు 160/6

శ్రేయస్ అయ్యర్ (53) జోరు కొనసాగించాడు. ప్రపంచకప్ ఫామ్‌ను పొట్టి ఫార్మాట్‌లోనూ చూపించాడు. చిన్నస్వామిలో అయ్యర్ అర్థ సెంచరీతో కదం తొక్కటంతో ఆతిథ్య భారత్ తొలుత 160 పరుగులు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (21), జితేశ్ శర్మ (24), అక్షర్ పటేల్ (31) సైతం ఆకట్టుకునే ఇన్నింగ్స్‌లు ఆడారు. చిన్నస్వామి స్టేడియంలో ఏడు టీ20ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు ఒకసారే గెలుపు గీత దాటింది.

నవతెలంగాణ-బెంగళూర్



చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద ఆశిస్తే.. భారత్, ఆసీస్ టీ20కి స్లో పిచ్ సిద్ధమైంది. అయినా, టీమ్ ఇండియా బ్యాటర్లు వదల్లేదు. ఆరంభంలో యశస్వి జైస్వాల్ (21, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధనాధన్ దంచికొట్టగా.. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ (53, 37 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో చెలరేగాడు. అక్షర్ పటేల్ (31, 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ శర్మ (24, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) కదం తొక్కారు. కీలక బ్యాటర్లు విఫలమైనా కఠిన స్లో పిచ్‌పై టీమ్ ఇండియా తొలుత 20 ఓవర్లలో 8 వికెట్లకు 160 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో బెహన్‌డార్ఫ్, బెన్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు.

అయ్యర్ అదుర్స్ : పరుగుల విందుకు బెంగళూర్ చిరునామా. టీ20 సిరీస్‌కు భారీ స్కోర్ల థ్రిల్లర్‌తో ముగింపు ఖాయమే అనిపించింది. కానీ అనూహ్యంగా స్లో పిచ్ ఎదురవటంతో అభిమానులకు నిరాశ తప్పలేదు. సిరీస్‌లో నిలకడగా చెలరేగిన కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (5), రింకూ సింగ్ (6), రుతురాజ్ గైక్వాడ్ (10)లు ఆరంభంలోనే వికెట్ కోల్పోయారు. దీంతో భారత్ మంచి స్కోరు సాధిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ స్థితిలో శ్రేయస్ అయ్యర్ (53) అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. క్రీజులో నిలిచిన అయ్యర్.. మరో ఎండ్‌లో జితేశ్ శర్మ (24), అక్షర్ పటేల్ (31) తోడుగా అదరగొట్టాడు. వికెట్లు పడినా.. టీమ్ ఇండియా ఎదురుదాడిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. జితేశ్ శర్మ, అక్షర్ పటేల్ సహజ శైలిలో మెప్పించారు. జితేశ్ మూడు ఫోర్లు, ఓ సిక్సర్ బాదగా.. అక్షర్ రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 36 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన అయ్యర్ చివరి ఓవర్లో నిష్క్రమించాడు. అయ్యర్ ధాటికి చివరి నాలుగు ఓవర్లలో భారత్ 45 పరుగులు పిండుకుంది. దీంతో 55/4 నుంచి కోలుకుని 160 పరుగుల భారీ స్కోరు సాధించింది. తొలుత ఓపెనర్ యశస్వి జైస్వాల్ (21) ఎదురులేని ఆరంభం అందించాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో పవర్‌ప్లేలో విరుచుకుపడ్డాడు. కానీ జైస్వాల్ ఎప్పటిలాగే ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. అతడి నిష్క్రమణతో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది. అయ్యర్, జితేశ్, అక్షర్ రాణించటంతో మ్యాచ్ రేసులో నిలిచే స్కోరు చేయగల్గింది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) ఎలిస్ (బి) బెహన్‌డార్ఫ్ 21, రుతురాజ్ గైక్వాడ్ (సి) బెహన్‌డార్ఫ్ (బి) బెన్ 10, శ్రేయస్ అయ్యర్ (బి) ఎలిస్ 53, సూర్యకుమార్ యాదవ్ (సి) మెక్‌డెర్మాట్ (బి) బెన్ 5, రింకూ సింగ్ (సి) డెవిడ్ (బి) సంగా 24, జితేశ్ శర్మ (సి) షార్ట్ (బి) హార్డీ 24, అక్షర్ పటేల్ (సి) హార్డీ (బి) బెహన్‌డార్ఫ్ 31, రవి బిష్ణోయ్ (రనౌట్) 2, అర్షదీప్ సింగ్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 160.**

వికెట్ల పతనం : 1-33, 2-33, 3-46, 4-55, 5-97, 6-143, 7-156, 8-160.

బౌలింగ్ : అరోన్ హార్డీ 4-0-21-2, బెహన్‌డార్ఫ్ 4-0-38-2, బెన్ 4-0-30-2, నాథన్ ఎలిస్ 4-0-42-1, తన్వీర్ సంగా 4-0-26-1.

హైదరాబాద్ మూడో విజయం

విజయ్ హజారే ట్రోఫీ



జైపూర్ : విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మూడో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఆరో రౌండ్ మ్యాచ్‌లో విదర్భపై 30 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 50 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (102, 98 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో మెరువగా.. ఓపెనర్లు ధ్రువ్ (83, 99 బంతుల్లో 7 ఫోర్లు), అతర్వ (44) రాణించారు. ఛేదనలో తన్మయ్ అగర్వాల్ (77 నాటౌట్, 77 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రాహుల్ సింగ్ (62 నాటౌట్, 80 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర సెంచరీలతో రాణించగా 29 ఓవర్లలో హైదరాబాద్ 159/1 పరుగులు చేసింది. ఈ సమయంలో వెలుతురు లేమి, స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల సమస్యతో మ్యాచ్ గంటన్నరకు పైగా నిలిచిపోయింది. దీంతో ఫలితాన్ని వినోద్ జైదేవ్ (విజెడి) పద్ధతిలో తేల్చారు. హైదరాబాద్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్రూప్-బి టాపర్ విదర్భకు ఇదే తొలి ఓటమి.

జెన్నీఫర్, దివ్యాన్షి చరిత్ర

వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ : టేబుల్ టెన్నిస్‌లో భారత యువ జోడీ చరిత్ర సృష్టించింది. ప్రపంచ యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో రజత పతకం సాధించిన జెన్నీఫర్ వర్గీస్, దివ్యాన్షి బోమిక్‌లు ఈ ఘనత సాధించిన తొలి భారత ప్యాడ్లర్ జోడీగా నిలిచింది. స్లోవేకియాలో జరిగిన ఈవెంట్‌లో అండర్-15 బాలికల విభాగంలో జెన్నీఫర్, దివ్యాన్షి సిల్వర్ షో చేశారు. ఫైనల్లో 5-11, 11-8, 4-11, 2-11తో పరాజయం పాలైంది. అండర్-15 మిక్స్‌డ్ డబుల్స్‌లో జెన్నిఫర్ కాంస్య పతకం సైతం కొల్లగొట్టింది. ఈ టోర్నీలో భారత్‌కు కాంస్య పతకమే ఇప్పటి వరకు అత్యుత్తమం. 'ఎంతో గర్వంగా ఉంది. సిల్వర్ మెడల్ ఊహించలేదు. సెమీస్‌లో బలమైన ఫ్రెంచ్, చైనీస్ జోడీపై విజయం అద్భుతం' అని జెన్నీఫర్, దివ్యాన్షి తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

గెలిచిన అభ్యర్థులు

1. సిర్పూర్
- అభ్యర్థి : పాల్వాయి హరీష్‌బాబు
- సమీప అభ్యర్థి : కోనేరు కోనప్ప
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 63043
- మెజార్టీ : 3043

2. చెన్నూర్ (ఎస్సీ)
- అభ్యర్థి : వివేక్ వెంకటస్వామి
- సమీప అభ్యర్థి : బాల్కసుమన్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 87541
- మెజార్టీ : 37515

3. బెల్లంపల్లి (ఎస్సీ)
- అభ్యర్థి : గడ్డం వినోద్
- సమీప అభ్యర్థి : దుర్గం చిన్నయ్య
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 82217
- మెజార్టీ : 36878

4. మంచిర్యాల
- అభ్యర్థి : ప్రేమ్‌సాగర్‌రావు
- సమీప అభ్యర్థి : రఘునాథ్‌రావు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 105486
- మెజార్టీ : 66116

5. ఆసిఫాబాద్ (ఎస్టీ)
- అభ్యర్థి : కోవలక్ష్మీ
- సమీప అభ్యర్థి : శ్యాంనాయక్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 82,951
- మెజార్టీ : 22832

6. ఖానాపూర్ (ఎస్టీ)
- అభ్యర్థి : వెడ్మ బొజ్జు
- సమీప అభ్యర్థి : జాన్సన్ నాయక్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 53921
- మెజార్టీ : 4289

7. ఆదిలాబాద్
- అభ్యర్థి : పాయల్ శంకర్
- సమీప అభ్యర్థి : జోగు రామన్న
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 66468
- మెజార్టీ : 6147

8. బోథ్ (ఎస్టీ)
- అభ్యర్థి : అనిల్ జాదవ్
- సమీప అభ్యర్థి : సోయం బాపురావు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 76297
- మెజార్టీ : 23023

9. నిర్మల్
- అభ్యర్థి : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : ఇంద్రకరణ్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 106400
- మెజార్టీ : 50,703

10. ముధోల్
- అభ్యర్థి : రామారావు పటేల్
- సమీప అభ్యర్థి : విఠల్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 97501
- మెజార్టీ : 15489

11. ఆర్మూర్
- అభ్యర్థి : పైడి రాకేశ్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : పొద్దుటూరి వినయ్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 72,658
- మెజార్టీ : 29,669

12. బోధన్
- అభ్యర్థి : పి.సుదర్శన్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : షకీల్ ఆమేర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 66,963
- మెజార్టీ : 3,062

13. జుక్కల్ (ఎస్సీ)
- అభ్యర్థి : తోట లక్ష్మీకాంతారావు
- సమీప అభ్యర్థి : హన్మంత్‌షిండే
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 64,489
- మెజార్టీ : 1,152

14. బాన్సువాడ
- అభ్యర్థి : పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : ఏనుగు రవీందర్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 76,278
- మెజార్టీ : 23,464

15. ఎల్లారెడ్డి
- అభ్యర్థి : మదన్‌మోహన్‌రావు
- సమీప అభ్యర్థి : జాజాల సురేందర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 86,989
- మెజార్టీ : 24,001

16. కామారెడ్డి
- అభ్యర్థి : వెంకటరమణారెడ్డి
- సమీప అభ్యర్థి : కేసీఆర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 66,652
- మెజార్టీ : 6,741

17. నిజామాబాద్ (అర్బన్)
- అభ్యర్థి : ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త
- సమీప అభ్యర్థి : షబ్బీర్‌అలీ
- పోలైన ఓట్లు : 1,84,332
- వచ్చిన ఓట్లు : 75,240
- మెజార్టీ : 15,387

18. నిజామాబాద్ (రూరల్)
- అభ్యర్థి : రేకులపల్లి భూపతిరెడ్డి
- సమీప అభ్యర్థి : బాజిరెడ్డి గోవర్ధన్
- పోలైన ఓట్లు : 1,95,018
- వచ్చిన ఓట్లు : 78,378
- మెజార్టీ : 21,963

19. బాల్కొండ
- అభ్యర్థి : వేముల ప్రశాంత్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : ముత్యాల సునీల్‌కుమార్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 70,417
- మెజార్టీ : 4,553

20. కోరట్ల
- అభ్యర్థి : డాక్టర్ కే.సంజయ్
- సమీప అభ్యర్థి : ధర్మపురి అర్వింద్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 72,115
- మెజార్టీ : 10,305

21. జగిత్యాల్
- అభ్యర్థి : డాక్టర్.సంజయ్
- సమీప అభ్యర్థి : టీ.జీవన్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 70,243
- మెజార్టీ : 15,822

22. ధర్మపురి (ఎస్సీ)
- అభ్యర్థి : అడ్లూరిలక్ష్మణ్‌కుమార్
- సమీప అభ్యర్థి : కొప్పుల ఈశ్వర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 91,393
- మెజార్టీ : 22,039

23. రామగుండం
- అభ్యర్థి : మక్కాన్‌సింగ్‌ఠాకూర్
- సమీప అభ్యర్థి : కోరుకంటి చందర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 92,227
- మెజార్టీ : 56,794

24.మంథని
- అభ్యర్థి : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- సమీప అభ్యర్థి : పుట్టమధు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,03,822
- మెజార్టీ : 31,380

25. పెద్దపల్లె
- అభ్యర్థి : విజయరమణరావు
- సమీప అభ్యర్థి : దాసరి మనోహర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,18,888
- మెజార్టీ : 55,108

26. కరీంనగర్
- అభ్యర్థి : గంగుల కమలాకర్
- సమీప అభ్యర్థి : బండిసంజయ్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 90,438
- మెజార్టీ : 3,169

27. చొప్పదండి (ఎస్సీ)
- అభ్యర్థి : మేడిపల్లి సత్యం
- సమీప అభ్యర్థి : సుంకెరవిశంకర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 90,395
- మెజార్టీ : 37,439

28. వేములవాడ
- అభ్యర్థి : ఆదిశ్రీనివాస్
- సమీప అభ్యర్థి : లక్ష్మీనర్సింహరావు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 71,451
- మెజార్టీ : 14,581

29. సిరిసిల్లా
- అభ్యర్థి : కేటీఆర్
- సమీప అభ్యర్థి : కేకే మహేందర్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 89,244
- మెజార్టీ : 29,687

30. మాన్‌కొండూరు
- అభ్యర్థి : కే.సత్యనారాయణ
- సమీప అభ్యర్థి : రసమయిబాలకిషన్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 96,773
- మెజార్టీ : 32,365

31. హుజురాబాద్
- అభ్యర్థి : పాడికౌశిక్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : ఈటెల రాజేందర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 80,333
- మెజార్టీ : 16,873

32. హుస్నాబాద్
- అభ్యర్థి : పొన్నంప్రభాకర్
- సమీప అభ్యర్థి : ఒడితెల సతీష్‌బాబు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,00,955
- మెజార్టీ : 19,344

33. సిద్దిపేట
- అభ్యర్థి : టి.హరీశ్‌రావు
- సమీప అభ్యర్థి : పూజల హరికృష్ణ
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,04,109
- మెజార్టీ : 81,620

34. మెదక్
- అభ్యర్థి : మైనంపల్లి రోహిత్‌రావు
- సమీప అభ్యర్థి : పద్మాదేవేందర్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 87,126
- మెజార్టీ : 10,157

35. నారాయణఖేడ్
- అభ్యర్థి : పట్లోళ్ల సంజీవరెడ్డి
- సమీప అభ్యర్థి : మహారెడ్డి భూపాల్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 90,281
- మెజార్టీ : 5,766

36. అందోల్ (ఎస్సీ)
- అభ్యర్థి : దామోదర రాజనర్సింహ
- సమీప అభ్యర్థి : చంటి క్రాంతి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,14,147
- మెజార్టీ : 28,193

37. నర్సాపూర్
- అభ్యర్థి : వి.సునీతారెడ్డి
- సమీప అభ్యర్థి : ఆవుల రాజిరెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 88,410
- మెజార్టీ : 8,855

38. జహీరాబాద్ ఎస్సీ
- అభ్యర్థి : కె.మాణిక్యరావు
- సమీప అభ్యర్థి : ఏ.చంద్రశేఖర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 96,913
- మెజార్టీ : 13,310

39. సంగారెడ్డి
- అభ్యర్థి : చింత ప్రభాకర్
- సమీప అభ్యర్థి : జయప్రకాశ్‌రెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 82,614
- మెజార్టీ : 9,297

40. పటాన్‌చెరు
- అభ్యర్థి : గూడెం మహిపాల్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : కాటా శ్రీనివాస్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,05,387
- మెజార్టీ : 7,091

41. దుబ్బాక
- అభ్యర్థి : కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : రఘునందన్‌రావు
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 97,451
- మెజార్టీ : 53,707

42. గజ్వేల్
- అభ్యర్థి : కేసీఆర్
- సమీప అభ్యర్థి : ఈటెల రాజేందర్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,11,244
- మెజార్టీ : 45,283

43. మేడ్చెల్
- అభ్యర్థి : మల్లారెడ్డి
- సమీప అభ్యర్థి : వజ్రేష్ యాదవ్
- పోలైన ఓట్లు : 6,37,838
- వచ్చిన ఓట్లు : 1,86,017
- మెజార్టీ : 33,419

44. మల్కాజిగిరి
- అభ్యర్థి : మర్రి రాజశేఖరరెడ్డి
- సమీప అభ్యర్థి : మైనంపల్లి హనుమంతురావు
- పోలైన ఓట్లు : 4,88,807
- వచ్చిన ఓట్లు : 1,25,049
- మెజార్టీ : 49,530

45. కుత్బుల్లాపూర్
- అభ్యర్థి : కేపీ వివేకానందా
- సమీప అభ్యర్థి : కూన శ్రీశైలం గౌడ్
- పోలైన ఓట్లు : 6,99,042
- వచ్చిన ఓట్లు : 1,87,999
- మెజార్టీ : 85,576

46. కూకట్‌పల్లి
- అభ్యర్థి : మాధవరం కృష్ణారావు
- సమీప అభ్యర్థి : బండి రమేష్
- పోలైన ఓట్లు : 4,64,807
- వచ్చిన ఓట్లు : 1,35,635
- మెజార్టీ : 70,387

47. ఉప్పల్
- అభ్యర్థి : బండారి లక్ష్మారెడ్డి
- సమీప అభ్యర్థి : ఎం.పరమేశ్వరరెడ్డి
- పోలైన ఓట్లు : 5,29,396
- వచ్చిన ఓట్లు :
- మెజార్టీ : 49,030

48. ఇబ్రహీంపట్నం
- అభ్యర్థి : మల్‌రెడ్డి రంగారెడ్డి
- సమీప అభ్యర్థి : మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 2,45,459
- వచ్చిన ఓట్లు : 1,25,819
- మెజార్టీ : 40,145

49. ఎల్‌బీ నగర్
- అభ్యర్థి : డి.సుధీర్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : సామ రంగారెడ్డి
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 1,11,380
- మెజార్టీ : 22,305

50. మహేశ్వరం
- అభ్యర్థి : సబితా ఇంద్రారెడ్డి
- సమీప అభ్యర్థి : శ్రీరాములు
- పోలైన ఓట్లు : 3,02,762
- వచ్చిన ఓట్లు : 99,391
- మెజార్టీ : 26,158

51. రాజేంద్రనగర్
- అభ్యర్థి : ప్రకాశ్‌గౌడ్
- సమీప అభ్యర్థి : తోకల శ్రీనివాస్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 3,24,917
- వచ్చిన ఓట్లు : 1,21,283
- మెజార్టీ : 32,305

52. శేర్‌లింగంపల్లి
- అభ్యర్థి : అరెకపూడి గాంధీ
- సమీప అభ్యర్థి : జగదీశ్వర్‌గౌడ్
- పోలైన ఓట్లు : 3,57,074
- వచ్చిన ఓట్లు : 1,56,577
- మెజార్టీ : 46,647

53. చేవెళ్ల (ఎస్సీ)
- అభ్యర్థి : కాలే యాదయ్య
- సమీప అభ్యర్థి : భీం భరత్
- పోలైన ఓట్లు : 1,94,343
- వచ్చిన ఓట్లు : 75,483
- మెజార్టీ : 502

54. పరిగి
- అభ్యర్థి : రామ్మోహన్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : మహేశ్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 2,01,468
- వచ్చిన ఓట్లు : 98,536
- మెజార్టీ : 24,022

55. వికారాబాద్ (ఎస్సీ)
- అభ్యర్థి : ప్రసాద్‌కుమార్
- సమీప అభ్యర్థి : మెతుకు ఆనంద్
- పోలైన ఓట్లు : 1,74,296
- వచ్చిన ఓట్లు : 86,478
- మెజార్టీ : 12,672

56. తాండూర్
- అభ్యర్థి : మనోహర్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : పైలెట్ రోహిత్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 1,73,754
- వచ్చిన ఓట్లు : 84,662
- మెజార్టీ : 6,543

57. ముషీరాబాద్
- అభ్యర్థి : ముఠాగోపాల్
- సమీప అభ్యర్థి : అంజన్‌కుమార్ యాదవ్
- పోలైన ఓట్లు : 1,53,252
- వచ్చిన ఓట్లు : 75,207
- మెజార్టీ : 37,797

58. మలక్‌పేట్
- అభ్యర్థి : అహ్మద్ మీన్ అబ్దుల్ బలాలా
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 6,37,838
- వచ్చిన ఓట్లు : 1,86,017
- మెజార్టీ : 33,419

59. అంబర్‌పేట్
- అభ్యర్థి : కాలేరు వెంకటేశ్
- సమీప అభ్యర్థి : కృష్ణయాదవ్
- పోలైన ఓట్లు : 1,45,171
- వచ్చిన ఓట్లు : 74,416
- మెజార్టీ : 24,537

60. ఖైరతాబాద్
- అభ్యర్థి : దానం నాగేందర్
- సమీప అభ్యర్థి : విజయారెడ్డి
- పోలైన ఓట్లు : 1,53,730
- వచ్చిన ఓట్లు : 67,368
- మెజార్టీ : 22,104

61.జూబ్లీహిల్స్
- అభ్యర్థి : మాగంటి గోపినాథ్
- సమీప అభ్యర్థి : మహమ్మద్ అజారుద్దీన్
- పోలైన ఓట్లు :
- వచ్చిన ఓట్లు : 80328
- మెజార్టీ : 17,300

62.సనత్‌నగర్
- అభ్యర్థి : తలసాని శ్రీనివాస్‌యాదవ్
- సమీప అభ్యర్థి : మర్రి శశిధర్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 1,28,263
- వచ్చిన ఓట్లు : 72,557
- మెజార్టీ : 41,827

63. నాంపల్లి
- అభ్యర్థి : మహ్మద్ మజిద్ హుస్సేన్
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 4,88,807
- వచ్చిన ఓట్లు : 1,25,049
- మెజార్టీ : 49,530

64. కార్వాన్
- అభ్యర్థి : కేసర్ మొహిద్దిన్
- సమీప అభ్యర్థి : అమర్‌సింగ్
- పోలైన ఓట్లు : 1,75,865
- వచ్చిన ఓట్లు : 83,388
- మెజార్టీ : 83,388

65. గోషామాల్
- అభ్యర్థి : రాజాసింగ్
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 5,29,396
- వచ్చిన ఓట్లు :
- మెజార్టీ : 49,030

66. చార్మినార్
- అభ్యర్థి : మీర్ జుల్ఫికర్ అలీ
- సమీప అభ్యర్థి : మేఘరాణి అగర్వాల్
- పోలైన ఓట్లు : 226117
- వచ్చిన ఓట్లు : 89451
- మెజార్టీ : 67025

67. చంద్రాయన్‌గుట్ట
- అభ్యర్థి : అక్బరుద్దీన్ ఓవైసీ
- సమీప అభ్యర్థి : సీతారామ్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 1,53,771
- వచ్చిన ఓట్లు : 99776
- మెజార్టీ : 81663

68. యాకుత్‌పుర
- అభ్యర్థి : జాఫర్ హుస్సేన్
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 316666
- వచ్చిన ఓట్లు : 36174
- మెజార్టీ : 2130

69. బహదూర్‌పుర
- అభ్యర్థి : మహ్మద్ ముబీన్
- సమీప అభ్యర్థి : ఇనాయత్ అలీ
- పోలైన ఓట్లు : 1,42,446
- వచ్చిన ఓట్లు : 89,451
- మెజార్టీ : 67,025

70. సికింద్రాబాద్
- అభ్యర్థి : పద్మారావు
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 2,62,517
- వచ్చిన ఓట్లు : 78,223
- మెజార్టీ : 45,240

71 సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ)
- అభ్యర్థి : లాస్య నందిత
- సమీప అభ్యర్థి :
- పోలైన ఓట్లు : 1,24,064
- వచ్చిన ఓట్లు : 58 911
- మెజార్టీ : 17,164

72. కొడంగల్
- అభ్యర్థి : రేవంత్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : నరేందర్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 1,93,940
- వచ్చిన ఓట్లు : 1,07,429
- మెజార్టీ : 32,532

73. నారాయణపేట్
- అభ్యర్థి : పర్ణికారెడ్డి
- సమీప అభ్యర్థి : రాజేందర్ రెడ్డి
- పోలైన ఓట్లు : 1,81,708
- వచ్చిన ఓట్లు : 84,005
- మెజార్టీ : 7,950

74. మహబూబ్‌నగర్
- అభ్యర్థి : శ్రీనివాస్ రెడ్డి
- సమీప అభ్యర్థి : లక్ష్మారెడ్డి
- పోలైన ఓట్లు : 178,069
- వచ్చిన ఓట్లు : 87,227
- మెజార్టీ : 18,738

75. జడ్చర్ల
- అభ్యర్థి : అనిరుధ్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : లక్ష్మారెడ్డి
- పోలైన ఓట్లు : 1,79,652
- వచ్చిన ఓట్లు : 89,826
- మెజార్టీ : 18,000

76. దేవరకద్ర
- అభ్యర్థి : మధుసుధన్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : వెంకటేశ్వర్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 194,543
- వచ్చిన ఓట్లు : 97,271
- మెజార్టీ : 500

77. మక్తల్ (కాంగ్రెస్)
- అభ్యర్థి : శ్రీహరి
- సమీప అభ్యర్థి : చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 178,069
- వచ్చిన ఓట్లు : 74,914
- మెజార్టీ : 17,525

78. వనపర్తి
- అభ్యర్థి : మేఘారెడ్డి
- సమీప అభ్యర్థి : నిరంజన్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 2,10,739
- వచ్చిన ఓట్లు : 1,05,459
- మెజార్టీ : 24,200

79. గద్వాల్
- అభ్యర్థి : కృష్ణమోహన్‌రెడ్డి
- సమీప అభ్యర్థి : సరిత
- పోలైన ఓట్లు : 2,13,283
- వచ్చిన ఓట్లు : 93,720
- మెజార్టీ : 7,631

80. అలంపూర్ (ఎస్సీ)
- అభ్యర్థి : విజేయుడు
- సమీప అభ్యర్థి : సంపత్ కుమార్
- పోలైన ఓట్లు : 1,96,307
- వచ్చిన ఓట్లు : 1,06,660
- మెజార్టీ : 27,173

81. నాగర్‌కర్నూల్
- అభ్యర్థి : రాజేష్ రెడ్డి
- సమీప అభ్యర్థి : మర్రి జనార్దన్‌రెడ్డి
- పోలైన ఓట్లు : 1,83,098
- వచ్చిన ఓట్లు : 86,479
- మెజార్టీ : 5431

82. అచ్చంపేట్ (ఎస్సీ)
- అభ్యర్థి : వంశీకృష్ణ
- సమీప అభ్యర్థి : బాలరాజ్
- పోలైన ఓట్లు : 1,93,765
- వచ్చిన ఓట్లు : 1,15,337
- మెజార్టీ : 49,676

83. కల్వకుర్తి
- అభ్యర్థి : కసిరెడ్డి నారాయణరెడ్డి
- సమీప అభ్యర్థి : తల్లోజు ఆచారి
- పోలైన ఓట్లు : 2,01,285
- వచ్చిన ఓట్లు : 75,508
- మెజార్టీ : 5,089

84. షాద్‌నగర్
- అభ్యర్థి : వీర్లపల్లి శంకర్
- సమీప అభ్యర్థి : అంజయ్యయాదవ్
- పోలైన ఓట్లు : 1,94,017
- వచ్చిన ఓట్లు : 76,947
- మెజార్టీ : 6,562

85. కొల్లాపూర్ (కాంగ్రెస్)
అభ్యర్థి : జూపల్లి కృష్ణారెడ్డి
సమీప అభ్యర్థి: హర్షవర్ధన్ రెడ్డి
పోలైన ఓట్లు : 1,90,669
వచ్చిన ఓట్లు : 91,853
మెజార్టీ : 28,981



86. దేవరకొండ (ఎస్టీ)(కాంగ్రెస్)
అభ్యర్థి : బాలునాయక్
సమీప అభ్యర్థి: రవీంద్రకుమార్
పోలైన ఓట్లు : 213881
వచ్చిన ఓట్లు : 111344
మెజార్టీ : 30021



87. నాగార్జునసాగర్ (కాంగ్రెస్)
అభ్యర్థి : జయ్‌వీర్‌రెడ్డి
సమీప అభ్యర్థి: నోముల భగత్
పోలైన ఓట్లు : 202,210
వచ్చిన ఓట్లు :1,19,831
మెజార్టీ : 45849



88. మిర్యాలగూడ(కాంగ్రెస్)
అభ్యర్థి :బత్తుల లక్ష్మారెడ్డి
సమీప అభ్యర్థి: నల్లమోతు భాస్కరరావు
పోలైన ఓట్లు : 1,91,235
వచ్చిన ఓట్లు : 1.11963
మెజార్టీ : 48684



89. హుజూర్‌గనర్ (కాంగ్రెస్)
అభ్యర్థి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
సమీప అభ్యర్థి: శానంపూడి సైదిరెడ్డి
పోలైన ఓట్లు : 213702
వచ్చిన ఓట్లు : 116707
మెజార్టీ : 44888



90. కోదాడ (కాంగ్రెస్)
అభ్యర్థి : ఉత్తమ్ పద్మావతి
సమీప అభ్యర్థి: బొల్లం మల్లయ్యయాదవ్
పోలైన ఓట్లు : 206377
వచ్చిన ఓట్లు : 125783
మెజార్టీ : 58679



91.సూర్యాపేట్ (బీఆర్ఎస్)
అభ్యర్థి : జగదీశ్‌రెడ్డి
సమీప అభ్యర్థి: దామోదర్‌రెడ్డి
పోలైన ఓట్లు : 230564
వచ్చిన ఓట్లు :75136
మెజార్టీ :4605



92. నల్లగొండ (కాంగ్రెస్)
అభ్యర్థి : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
సమీప అభ్యర్థి: కంచర్ల భూపాల్‌రెడ్డి
పోలైన ఓట్లు :204137
వచ్చిన ఓట్లు : 107405
మెజార్టీ :54332



93. మునుగోడు (కాంగ్రెస్)
అభ్యర్థి :కె. రాజగోపాల్‌రెడ్డి
సమీప అభ్యర్థి:కె. ప్రభాకర్‌రెడ్డి
పోలైన ఓట్లు : 231197
వచ్చిన ఓట్లు : 118781
మెజార్టీ : 40138



94. భువనగిరి (కాంగ్రెస్)
అభ్యర్థి : కంభం అనిల్‌కుమార్‌రెడ్డి
సమీప అభ్యర్థి: పైళ్ల శేఖర్‌రెడ్డి
పోలైన ఓట్లు :196077
వచ్చిన ఓట్లు : 102744
మెజార్టీ : 26,202



95.నకిరేకల్ (కాంగ్రెస్)
అభ్యర్థి :వేములవీరేశం
సమీప అభ్యర్థి:చిరుమర్తి లింగయ్య
పోలైన ఓట్లు : 201747
వచ్చిన ఓట్లు :1,32,185
మెజార్టీ : 67,849



96. తుంగతుర్తి (ఎస్సీ)(కాంగ్రెస్)
అభ్యర్థి : మందుల సామేల్
సమీప అభ్యర్థి: గాదరి కిశోర్‌కుమార్
పోలైన ఓట్లు : 225237
వచ్చిన ఓట్లు : 129535
మెజార్టీ : 50194



97. ఆలేర్ (కాంగ్రెస్)
అభ్యర్థి :బీర్ల అయిలయ్య
సమీప అభ్యర్థి: గొంగిడిసునీత
పోలైన ఓట్లు : 212102
వచ్చిన ఓట్లు : 122140
మెజార్టీ : 49636



98. జనగాం
అభ్యర్థి : రాజేశ్వర్‌రెడ్డి
సమీప అభ్యర్థి : ప్రతాప్‌రెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 98,975
మెజార్టీ : 15,783



99. ఘన్‌పూర్ స్టేషన్ (ఎస్సీ)
అభ్యర్థి : కడియం శ్రీహరి
సమీప అభ్యర్థి : ఇందిర
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,01,696
మెజార్టీ : 7779



100. పాలకుర్తి
అభ్యర్థి : యశస్వినీరెడ్డి
సమీప అభ్యర్థి : దయాకర్‌రావు
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,24,234
మెజార్టీ : 47,149



101 డోర్నకల్ (ఎస్టీ)
అభ్యర్థి : రామచంద్రునాయక్
సమీప అభ్యర్థి : రెడ్యానాయక్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,15,587
మెజార్టీ : 53,131



102. మహబూబాబాద్ (ఎస్టీ)
అభ్యర్థి : మురళీనాయక్
సమీప అభ్యర్థి : శంకర్‌నాయక్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,16,644
మెజార్టీ : 50,172



103. నర్సంపేట్
అభ్యర్థి : మాధవరెడ్డి
సమీప అభ్యర్థి : సుదర్శన్‌రెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,04,185
మెజార్టీ : 1,4185



104. పర్కాల
అభ్యర్థి : ప్రకాశ్‌రెడ్డి
సమీప అభ్యర్థి : ధర్మారెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 72,573
మెజార్టీ : 7,941



105. వరంగల్ పశ్చిమ
అభ్యర్థి : కొండా సురేఖ
సమీప అభ్యర్థి : ప్రదీప్‌కుమార్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 66,725
మెజార్టీ : 15,040



106. వరంగల్ తూర్పు
అభ్యర్థి : రాజేందర్‌రెడ్డి
సమీప అభ్యర్థి : వినయ్‌భాస్కర్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 72,648
మెజార్టీ :15,337



107. వర్ధన్నపేట్ (ఎస్సీ)
అభ్యర్థి : నాగరాజు
సమీప అభ్యర్థి : అరూరి రమేశ్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,06,696
మెజార్టీ : 19458



108. భూపాలపల్లి
అభ్యర్థి : సత్యనారాయణరావు
సమీప అభ్యర్థి : వెంకటరమణారెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,23,116
మెజార్టీ : 52,699



109.ములుగు (ఎస్టీ)
అభ్యర్థి : సీతక్క
సమీప అభ్యర్థి : నాగజ్యోతి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,02,267
మెజార్టీ : 33,700



110. పినపాక (ఎస్టీ)
అభ్యర్థి : వెంకటేశ్వర్లు
సమీప అభ్యర్థి : కాంతారావు
పోలైన ఓట్లు : 158978
వచ్చిన ఓట్లు : 90510
మెజార్టీ : 34506



111. ఇల్లందు (ఎస్టీ)
అభ్యర్థి : కోరం కనకయ్య
సమీప అభ్యర్థి : బానోత్ హరిప్రియ
పోలైన ఓట్లు : 1,74,904
వచ్చిన ఓట్లు : 1,06,734
మెజార్టీ : 55,718



112. ఖమ్మం
అభ్యర్థి : టీ.నాగేశ్వరరావు
సమీప అభ్యర్థి : అజయ్‌కుమార్
పోలైన ఓట్లు : 23,6224
వచ్చిన ఓట్లు : 1,36,061
మెజార్టీ : 49,381



113. పాలేరు
అభ్యర్థి : పి. శ్రీనివాసరెడ్డి
సమీప అభ్యర్థి : ఉపేందర్ రెడ్డి
పోలైన ఓట్లు : 2,15,969
వచ్చిన ఓట్లు : 12,7820
మెజార్టీ : 56,650



114. మధిర (ఎస్సీ)
అభ్యర్థి : భట్టి విక్రమార్క
సమీప అభ్యర్థి : లింగాల కమల్‌రాజ్
పోలైన ఓట్లు : 1,96,419
వచ్చిన ఓట్లు : 1,08,970
మెజార్టీ : 35,452



115. వైరా (ఎస్టీ)
అభ్యర్థి : రాందాస్ నాయక్
సమీప అభ్యర్థి : మదన్‌లాల్
పోలైన ఓట్లు : 1,69,457
వచ్చిన ఓట్లు : 93,913
మెజార్టీ : 33,050



116.సత్తుపల్లి (ఎస్సీ)
అభ్యర్థి : మట్టా రాగమయి
సమీప అభ్యర్థి : వెంకటవీరయ్య
పోలైన ఓట్లు : 2,12,605
వచ్చిన ఓట్లు : 1,09,449
మెజార్టీ : 18,475



117. కొత్తగూడెం
అభ్యర్థి : సాంబశివరావు
సమీప అభ్యర్థి : జలగం వెంకట్రావ్
పోలైన ఓట్లు : 18,6347
వచ్చిన ఓట్లు : 79,155
మెజార్టీ : 26,184




118. అశ్వరావ్‌పేట (ఎస్టీ)
అభ్యర్థి : ఆదినారాయణ
సమీప అభ్యర్థి : మెచ్చా నాగేశ్వరరావు
పోలైన ఓట్లు : 1,35,497
వచ్చిన ఓట్లు : 74,420
మెజార్టీ : 28,457



119. భద్రాచలం (ఎస్టీ)
అభ్యర్థి : తెల్లం వెంకట్రావు
సమీప అభ్యర్థి : వీరయ్య
పోలైన ఓట్లు : 1,17,447
వచ్చిన ఓట్లు : 52,912
మెజార్టీ : 5,755





బీఆర్ఎస్‌కు నిరుద్యోగుల వాత

ఎన్నికల్లో హామీ ఇచ్చినా అమలు కాని 'భృతి'

- ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం
- టీఎస్‌పీఎస్సీ తీరుపై అసంతృప్తి
- ప్రశ్నాపత్రాల లీకేజీతో ఇబ్బందులు
- కాంగ్రెస్‌వైపు మొగ్గిన యువత



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ పార్టీ మ్యానిఫెస్టోలోనూ ప్రకటించారు. ఎన్నికల్లో మామీ ఇచ్చినా ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో నిరుద్యోగుల్లో ఈ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే ఈ ఎన్నికల సందర్భంగానైనా నిరుద్యోగుల కోసం బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని ఆశించారు. కానీ అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలనే ప్రస్తావించలేదు. దీంతో బీఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మోసం చేసిందన్న అభిప్రాయానికి వచ్చారు. అదును కోసం ఎదురుచూసిన నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకున్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలిచి బీఆర్ఎస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్‌ను ఓడించాలంటూ ఓయూ జేఏసీ నేతలు, యువజన సంఘాలు గ్రామగ్రామాన తిరిగి ప్రచారం చేశాయి. జాగో తెలంగాణ పేరుతో నిరుద్యోగ చైతన్య బస్సుయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బు, మద్యానికి ఓటు వేస్తే తమ జీవితాలు ఆగమవుతున్నాయని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇది ప్రజలను ఆలోచింపచేసింది. అందుకే అటు నిరుద్యోగులు, ఇటు ఉద్యోగులు, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు సైతం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేశారు. అందుకే అధికార పార్టీ ఓటమిని చవిచూసింది.

కొలువులు రాక మానసిక వేదన

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదం పేరుతో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయని యువకులు ఆ ఉద్యమంల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎంతో మంది ఆత్మబలిదానాలు చేశారు. తెలంగాణ వచ్చినా బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయమే తెలంగాణలోనూ జరిగిందన్న అభిప్రాయానికి నిరుద్యోగులొచ్చారు. ఇంకోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వ్యవహరించిన తీరు నిరుద్యోగుల్లో ఆగ్రహానికి కారణంగా ఉన్నది. ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు రద్దు కావడం, వాయిదా పడడం వంటి కారణాలతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా మొదటిసారి, హైకోర్టు ఆదేశాలతో రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను కూడా టీఎస్‌పీఎస్సీ, ఎన్నికల కారణంగా డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేశాయి. దీంతో జీవితాలు నాశనమయ్యాయన్న అభిప్రాయానికి నిరుద్యోగులు బలంగా వచ్చారు. ఒకవైపు విలువైన సమయం, ఇంకోవైపు డబ్బు వృధా అయ్యాయన్న మానసిక ఆవేదనకు వచ్చారు. ఎన్నికల్లో నిరుద్యోగుల అంశం కీలకంగా పనిచేసింది. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. ఇంకోవైపు పరీక్షలు వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ప్రవళిక ఆత్మహత్య సంచలనమైంది. ప్రేమకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదంటూ మంత్రి కేటీఆర్ ప్రకటించి అభాసుపాలయ్యారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. అందుకే నిరుద్యోగులు ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపులో కీలక భూమిక పోషించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గం నుంచి పోటీచేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విషయం తెలిసిందే.ఆయనకు 44,646 ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలో బీఎస్పీ అభ్యర్థులకు మొత్తం 3,21,048(1.37 శాతం) ఓట్లు రావటం విశేషం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తన ప్రచారానికి ఎన్ని ఆటంకాలు సృష్టించినా..బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవటం వల్లనే ఆ మాత్రం ఓట్లు వచ్చాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.మరో పక్క డబ్బు, మద్యంతోపాటు ప్రభుత్వ యంత్రాంగం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కదిలికలపై కేంద్రీకరించి స్వేచ్చగా ప్రజలను కలవకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు.

8 స్థానాల్లో బీజేపీ గెలుపు

- 68 నియోజకవర్గాల్లో డిపాజిట్ గల్లంతు
- ప్రభావం చూపని జనసేన..ఆదరించని సెటిలర్లు
- కూకట్‌పల్లిలో మినహా మిగతా చోట్ల 4వేల లోపే
- అన్నిచోట్లా డిపాజిట్ గల్లంతు
- గెలుస్తారనుకున్నోళ్ల ఓటమి..అంచనా లేనోళ్ల గెలుపు
- కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి గెలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రంలో 20కిపైగా సీట్లు వస్తాయనీ, తద్వారా కింగ్‌మేకర్ పాత్ర పోషించాలనే ఆశ ఆదిలోనే ఆవిరైంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఊహించిందేమీ జరగలేదు. బెంగాల్‌లో మమతాబెనర్జీపై సువేందు సర్కారును ప్రయోగించినట్టే ఇక్కడ సీఎం కేసీఆర్‌పై ఈటలను బీజేపీ ఎక్కుపెట్టింది. కానీ, అది బూమరాంగ్ అయింది. సీఎం కేసీఆర్ చేతిలో 45031 ఓట్ల భారీ తేడాతో ఈటల ఓటమి చవిచూశారు. తన సొంత నియోజకవర్గమైన హుజురాబాద్‌లో తగిన ప్రచారం చేసుకోకపోవడంతో ఆయన అక్కడా 16 వేల పైచిలుకు ఓట్లతో పరాజయం పాలయ్యారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి కృష్ణయాదవ్ ఓడిపోయారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో గట్టెక్కలేకపోయారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అధిష్టానం వద్ద పట్టుబట్టిమరీ తన అనుచరుడు పూసరాజుకు ముషీరాబాద్ సీటును ఇప్పించుకున్నాడు. కానీ, గెలిపించుకోలేకపోయాడు. అధిష్టానం విజయం సాధిస్తారని భావించిన నేతలంతా ఓడిపోయారు. ఊహించని నేతలు గెలిచారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను, టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డిలను వెనక్కి తోచి బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి సంచలన విజయం సాధించారు. బీజేపీ గెలిచిన ఎనిమిది స్థానాల్లో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే నాలుగున్నాయి. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టి రెండేండ్లుగా ఆ పార్టీ పనిచేసినప్పటికీ ఆ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదు. ఎస్సీ వర్గీకరణను చూపెట్టి మందకృష్ణ మాదిగతో విశ్వరూపసభ పెట్టించి దళితుల ఓట్లు పొందాలనే ఆశ నెరవేరలేదు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కమలం పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తామే ప్రత్యామ్నాయం అని ప్రచారం చేసిన ఆ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మలేదు. బీసీని సీఎం చేస్తామన్న మాటల్ని విశ్వసించలేదు. మొత్తం 68 స్థానాల్లో ఆ పార్టీ డిపాజిట్లను కోల్పోయింది. అమిత్‌షా 11 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా ఎక్కడ కూడా గెలవలేదు. మోడీ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో రెండు చోట్లనే (కామారెడ్డి, నిర్మల్)లో విజయం సాధించింది. యోగి ఆదిత్యనాథ్ 8 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. అందులో సిర్పూర్, గోషామహల్ స్థానాల్లోనే గెలిచింది. నడ్డా ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఆ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. కేంద్ర మంత్రులు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇతర రాష్ట్రాల నేతలు ప్రచారం చేసిన చోట ఆ పార్టీకి ఆశించిన ఓట్లు రాలలేదు. రాష్ట్రంలో మొత్తం 111 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 68 నియోజకవర్గాల్లో డిపాజిట్లను కోల్పోయింది. అయితే, బీజేపీ బలం గత ఎన్నికలతో పోలిస్తే పెరిగింది. 2018 ముందస్తు ఎన్నికల్లో 7.1 శాతం ఓట్లను పొందిన ఆ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో 13.90 శాతం ఓట్ల సాధించి మూడోస్థానంలో నిలిచింది.

నోటాకు 1,71,885 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నన్ ఆఫ్ ది ఎబో (నోటా) కు 1,71,885 ఓట్లు పోలయ్యాయి. పోటీ చేసిన అభ్యర్థుల్లో తమకు ఎవరు నచ్చని సందర్భంలో నోటాకు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజక వర్గాల్లో అత్యధికంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 4,079 ఓట్లు నోటాకు పోల్ కాగా, అత్యల్పంగా ఆలేరు నియోజకవర్గంలో 73 ఓట్లు మాత్రమే పోల్ అయినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. 500 ఓట్ల లోపు అదిలాబాద్, హుస్నాబాద్‌లలో నోటాకు ఓట్లు పోల్ కాగా శేరిలింగంపల్లి, వర్ధన్నపేట, మేడ్చల్ నోయోజకవర్గాల్లో మూడు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. రెండు వేలకు పైగా ఉప్పల్, సిర్పూర్, పటాన్‌చెరు, పాలకుర్తి, నిజామాబాద్ రూరల్, అచ్చంపేట, ఆలంపూర్, బెల్లంపల్లి, బోథ్, ధర్మపురి, దుబ్బాక, ఖానాపూర్, కొండంగల్, కూకట్ పల్లి, ఎల్బీనగర్, మహేశ్వరం, మల్కాజిగిరి,మొత్తం 17 స్థానాల్లో నోటాకు రెండు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

సాగర్ వద్ద హైడ్రామాకు తెర

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్‌పై నాలుగు రోజుల హైడ్రామాకు తెరపడింది. డ్యాంను సీఆర్పీఎఫ్ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. డ్యాంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా వేసిన కంచెను, భారీకేడ్లను ఆదివారం ఉదయం తొలగించారు. ప్రాజెక్ట్ పర్యవేక్షణ బాధ్యతలను కృష్ణా బోర్డు, కేంద్ర బలగాలకు అప్పగించడం, దానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించిన నేపథ్యంలో డ్యామ్‌ను స్వాధీనం చేసుకున్నాయి. కుడి కాలువకు నీటి విడుదల కూడా బంద్ చేశారు.

వారసులు.. కుటుంబ సభ్యులు..

ఎన్నికల్లో గెలుపోటములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనున్నది. అయితే ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి (అన్నా, తమ్ముళ్లు, మామా అల్లుళు_, భార్యా భర్తలు)పలువురు బరిలో నిలవగా కొందరు ఓటమి, మరికొందరిని గెలుపు వరించింది.

కోమటిరెడ్డి బ్రదర్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఘన విజయం సాధించారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ తరపున వీరు పోటీ చేశారు.మునుగోడులో రాజగోపాల్ రెడ్డి 21వేల మెజార్టీతో గెలుపొందగా, ఆయన అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండలో 54వేలకు పైగా మెజార్టీతో భారీ విజయాన్ని అందుకున్నారు.

గడ్డం సోదరులు..

గడ్డం వినోద్, గడ్డం వివేక్ విజయం సాధించారు. వినోద్ బెల్లంపల్లి నియోజక వర్గం నుంచి ఆయన సోదరుడు వివేక్ చెన్నూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఇద్దరూ విజయం సాధించటం గమనార్హం.

భార్యాభర్తలు..

ఎన్నికల్లో భార్యభర్తలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పద్మావతి రెడ్డి భారీ విజయాన్ని అందుకున్నారు. హుజూర్‌నగర్‌నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పోటీలో నిలిచిన ఆయన భార్య పద్మావతిరెడ్డి ఘన విజయం సాధించారు.

మామా అల్లుళ్లు..

మేడ్చల్ నియోజక వర్గం నుంచి మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరిలో ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు.

కేసీఆర్..కేటీఆర్..

తండ్రికొడుకులు సీఎం కేసీఆర్, కేటీఆర్ పోటీలో ఈ సారి కూడా ఉన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేయగా కామారెడ్డిలో ఓటమి చవిచూశారు. గజ్వేల్‌లో గెలుపొందారు. కుమారుడు కేటీఆర్ సిరిసిల్లలో బరిలో దిగారు. భారీ మెజారిటీతో గెలుపొందారు.

మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ తరపున బరిలోకి దిగారు.

మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన రోహిత్ గెలుపొందగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన మైనంపల్లి హనుమంతరావు ఓటమి పాలయ్యారు.

ఓడిన బంధువులు..

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్ బీజేపీ తరపున పోటీలో నిలిచారు. ఆయన సోదరుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచారు. ఇద్దరూ ఓటమి పాలయ్యారు.

అత్త..అల్లుడు..

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున బాల్కొండ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో ఉండగా..ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ బీజేపీ తరపున బరిలో నిలిచారు. చివరకు వేముల ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించారు.